గురువారం 9-2-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 319

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

రాజస్తాన్‌లో ఆడపిల్ల పుడితే
ఇంకా కొన్ని పల్లెల్లో బంధువులు వెళ్లి
'శోక్ ప్రకటన్' (శోక ప్రకటన) చేసే ఆనవాయితీ ఉంది.
మొదట కొడుకు పుట్టేశాక
రెండో సంతానంగా ఆడపిల్ల పుడితే
బిడ్డ బాగోగులు నిర్లక్ష్యం చేసే ఆనవాయితీ ఉండటంతో
ప్రభుత్వం ఏకంగా రెండో సంతానం కోసమే
'మాతృత్వ పోషణ్ యోజన' పేరుతో
తల్లికి 6 వేల రూపాయలు ఇస్తోంది.
అలాంటి చోట ఒక మహిళా సర్పంచ్
హల్‌చల్ చేస్తోంది.
తను సర్పంచ్ కావడమే ఊరిలోని ఆడపిల్లలతో
ఒక హాకీ టీమ్ ఏర్పాటు చేసి
'హాకీ వాలీ సర్పంచ్' అనే పేరు గడించింది.
తాజాగా హాకీ బ్యాట్ పట్టుకుని తిరుగుతూ
పెళ్లిళ్లలో చెత్త చెదారం వేసినా,
ఆహారాన్ని వ్యర్థం చేసినా
డొక్క చించుతానని కొత్త ఆర్డర్ పాస్ చేసింది.
ప్రజల కోసం సొంత డబ్బు కూడా ఖర్చు పెడుతున్న
నీరూ యాదవ్ పరిచయం.



నీరూ యాదవ్

హాకీ వాలీ సర్పంచ్

జిల్లా అధికారులతో ఎప్పుడు మీటింగ్ జరిగినా నీరూ యాదవ్ లేచి గట్టిగా మాట్లాడుతుంది. అక్కడున్న వాళ్లు ఆమెను 'మహిళ అయినా' ఎంత గట్టిగా మాట్లాడుతోందని ఆశ్చర్యంగా, మెచ్చుకోలుగా చూస్తారు. 'నేను మహిళనే. కాని బాగా చదువుకున్నాను. మీరు గోల్‌మాల్ చేసిన బిల్లుల మీద సంతకం పెట్టమంటే పెట్టను. అవినీతి చేయను. నా పంచాయితీలో జరగనివ్వను' అని తిరగబడుతుంది. అంతే కాదు అది వీడియో తీసి యూట్యూబ్‌లో పెడుతుంది కూడా.

రాజస్థాన్‌లోని 'ఝుంఝును' జిల్లాలోని 'లంబి అహిర్' అనే పంచాయితీ ఈ నీరూ యాదవ్ అనే సర్పంచ్ వల్ల అందరినీ ఆకర్షిస్తోంది. లంబి అహిర్ రాజస్థాన్‌లో ఉన్నా హర్యాణ సరిహద్దులో ఉంటుంది. ఆ ఊళ్లో యాదవులు ఎక్కువ. నీరూ యాదవ్ ఊళ్లోకెల్లా బాగా చదువుకోవడం వల్ల సర్పంచ్‌గా సులభంగా ఎంపికైంది. మరి... ఎం.ఎస్సీ, ఎం.ఇడి చేసి పిహెచ్.డి కూడా చేసిన నీరూ ఊరికి సేవ చేస్తానంటే ఎవరు వద్దంటారు?



> మన దేశంలో ఒక మనిషి సంవత్సరానికి సగటున 50 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నాడు. ప్రపంచంలో చైనా తర్వాత ఆహారాన్ని వృధా చేస్తున్నది మనమే.

అమ్మాయిల ప్రగతే ముఖ్యం

2020లో సర్పంచ్ అయిన నాటి నుంచి నీరూ యాదవ్ ముఖ్యంగా అమ్మాయిల ప్రగతి గురించి దృష్టి పెట్టింది. తన పంచాయతీలోని స్త్రీల పట్ల ఉన్న కట్టుబాట్లను బాగ ఎరిగిన నీరూ వారు అన్ని విధాలుగా వికాసం చెందాలంటే విద్యతో పాటు ఇంటి నుంచి బయటకు కదలడం ముఖ్యమే అని ఊరికి చూపించదలుచుకుంది. అందుకే స్కూలు, కాలేజీ వయసున్న ఆడపిల్లల ఇంటింటికి వెళ్లి వారికి, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిని ఒక మహిళా హాకీ జట్టుగా జమ చేసింది. సర్పంచ్‌గా తనకొచ్చే జీతంతో ఒక కోచ్‌ను ఏర్పాటు చేసింది. పంచాయతీ నిధులతో గ్రౌండ్‌ను శుభ్రం చేసి ఏర్పాటు చేసింది. 'మీరు ఉత్తమ హాకీ టీమ్‌గా విజయాలు సాధించాలి' అనంటే ఆ ఆడపిల్లలు ఉదయం, సాయంత్రం ప్రాక్టీసు చేస్తూ, ఆటను ఆస్వాదిస్తూ ఇవాళ జిల్లా స్థాయిని దాటి స్టేట్ లెవల్‌లో ఆడేదాకా ఎదిగారు. ఇది ఊరందరికీ నచ్చి నీరూ యాదవ్ అసలు పేరు మరిచి 'హాకీ వాలీ సర్పంచ్' అని పిలవడం మొదలెట్టారు. అయితే ఆటలు మాత్రమే కాదు బాలికల చదువుకు, టెక్నికల్ విద్యకు కూడా నీరూ ప్రోత్సాహం అందిస్తోంది. కొంతమంది యువతులను షార్ట్‌టర్మ్ టెక్నికల్ కోర్సులకు పంపి వారికి ఉద్యోగాలు దొరికేలా చూస్తోంది.

తన సొంత డబ్బుతో చదివిస్తోంది.

పెళ్ళిళ్ల వృధాకు విరుగుడు

ఊళ్లో పెళ్లిళ్లు, మీటింగులు, ఇతర ఫంక్షన్ల వల్ల భోజనాల సమయంలో పేరుకు పోతున్న చెత్తను గమనించిన నీరూ యాదవ్ తాజాగా 'చెత్త రహిత వివాహాలు' అనే ప్రచారాన్ని మొదలెట్టింది. పెళ్లిళ్ల సమయంలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, బాటిళ్లు వాడి పారేయడం వల్ల పేరుకుపోతున్న చెత్తకు విరుగుడుగా స్టీలు పళ్లేలు, గ్లాసులు, బకెట్లు, వంట పాత్రలు కొని పంచాయితీ ఆఫీసులో పెట్టింది. ఊళ్లో ఏ ఫంక్షన్‌కైనా వీటిని ఉచితంగా ఇస్తారు. అయితే నీరూ యాదవ్ తయారు చేసిన మహిళా కార్యకర్తలు వచ్చి వడ్డిస్తారు. ఎంత తింటే అంత పెట్టడం వల్ల ఆహారం వృధా కాకుండా చూడాలనేది ఆలోచన. అంతేకాదు ఒకవేళ ఆహారం వృధా అయితే దానిని ఎరువుగా మార్చి రైతులకు ఇవ్వాలనే కార్యాచరణ కూడా నీరూ మొదలెట్టింది. 'మన దేశంలో ఒక మనిషి సంవత్సరానికి సగటున 50 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నాడు. ప్రపంచంలో చైనా తర్వాత ఆహారాన్ని వృధా చేస్తున్నది మనమే' అంటుంది నీరూ. పిల్లల ఆట కోసం చేతిలో సరదగా హాకీ బ్యాట్ పట్టుకున్నా అది పట్టుకుని ఆమె చేస్తున్న సంస్కరణలు జనం వింటున్నారు.

రైతుల కోసం

నీరూ యాదవ్ పల్లెకు ఆయువుపట్టైన రైతును ఎలా నిర్లక్ష్యం చేస్తుంది. రైతులకు కావాలసిన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల ఏర్పాటు కోసం పండించిన పంటకు సరైన మద్దతు ధర దొరకడం కోసం ఊరి రైతులతో ఎఫ్.పి.ఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) ఏర్పాటు చేసింది. దాంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు. నీరూ యాదవ్‌ను మెచ్చుకుంటున్నారు.

'హాకీ వాలీ సర్పంచ్' నీరూ యాదవ్ రాబోయే రోజుల్లో సర్పంచ్ కంటే పై పదవికి వెళ్లకుండా ఉండదు. ఆమె చేయాలనుకున్న మంచి పనుల లిస్టులో ఇవి కొన్నే. అన్ని పనులు జరగాలంటే అలాంటి వాళ్లు ఇక్కడితో ఆగకపోవడమే కరెక్ట్.

సైబర్ టాక్

బామ్మా.. స్మార్ట్ ఫోన్‌తో జాగ్రత్త?!

విచారంగా కూర్చొని ఉన్న వర్ధనమ్మను చూసి ఏమైందని అడిగింది మనవరాలు హారిక. 'బ్యాంకు ఖాతా నుండి డబ్బులు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. నేను ఆ డబ్బులు డ్రా చేయలేదు. నా దగ్గర డబ్బులు ఉన్నట్టు ఇంట్లో ఎవ్వరికీ చెప్పలేదు. బ్యాంకులో అయితే భద్రంగా ఉంటాయనుకున్నా. ఇప్పుడెలా..' అంది మనవరాలితో దిగులుగా వర్ధనమ్మ. 'ఎవరైనా నీకు ఇంతకు ముందు ఫోన్ చేశారా..' అడిగింది హారిక. 'బ్యాంకు నుంచి ఫోన్ వచ్చింది. అత్యవసరం అని చెబితే, వాళ్లు పంపిన లింక్ ఫామ్‌లో వివరాలు ఇచ్చాను. అంతకన్నా ఏమీ చేయలేదు' అంది వర్ధనమ్మ. బామ్మ సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోయిందని అర్థమై, వెటనే తగిన చర్యలు తీసుకుంది హారిక. ఆ తర్వాత బామ్మకు సైబర్ మోసగాళ్ల గురించి వివరించింది.

ఇంట్లో వయసు పైబడిన వారుంటే సైబర్ మోసాగాళ్ల బారిన పడకుండా ఈ విషయాలు తప్పక తెలియజేయాల్సిన అవసరం వారి పిల్లలకు ఉంది.

సాధారణంగా జరిగే మోసాల్లో ప్రధానమైంది ఫిషింగ్:

సైబర్ నేరగాళ్లు మీ డిజిటల్ సమాచార మొత్తాన్ని పొందడానికి ఆన్‌లైన్ సేవ లేదా బ్యాంక్ ఏజెంట్ల వంటి విశ్వసనీయ పరిచయాలను పెంచుకుంటారు. కొన్ని ఉదాహరణలు.. సహాయం కోసం రిక్వెస్ట్ అడుగుతారు. మీరు బహుమతిని గెలుచుకున్నారని చూపుతారు. పెన్షన్ ఫండ్ విడుదలకు కెవైసి అవసరం అంటారు. గతంలో తక్కువ ఆదాయపు పన్ను చెల్లించారు, ఇప్పుడు రెట్టింపు ఛార్జ్ పడింది అంటారు.

గుర్తింపు చోరీ

సైబర్ దాడి చేసే వ్యక్తులు మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, చిరునామా, డెబిట్/ క్రెడిట్ కార్డ్ వివరాలు, యుపిఐ, పిన్ నంబర్ మొదలైన వ్యక్తిగత సమాచారాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. ఆర్థిక లాభాలను పొందడానికి ఈ సమాచారం సేకరిస్తారు.

దాడుల్లో రకాలు

వీటిలో తరచుగా సీనియర్ డేటింగ్, ప్రిస్క్రిప్షన్ మాత్రలు, యాంటీ ఏజింగ్ ఉత్పత్తులు, పెట్టుబడి లేదా ఛారిటీ స్కామ్‌లు, స్నేహితులు లేదా కుటుంబ సభ్యుల నుండి నకిలీ ఆర్థిక సహాయ అభ్యర్థనలకు సంబంధించిన మోసాలు ఉంటాయి. చాలా మంది సీనియర్లు ఇలాంటి మోసాలకు లోనవడానికి పెద్ద కారణం ఒంటరితనం, జ్ఞానం లేకపోవడమే.

భద్రతా చిట్కాలు:

- తెలియని వారి నుంచి వచ్చే ఇ-మెయిల్‌ల లోని లింక్‌లపై క్లిక్ చేయవద్దు. మీకు తెలిసిన వ్యక్తుల నుండి వచ్చినవి అయినప్పటికీ, వింత లేదా ఊహించని సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండండి. ఇ-మెయిల్‌లు, వాట్సప్ సందేశాలు లేదా ఎసెమ్మెస్‌లు, సోషల్ మీడియా పోస్ట్‌లు అన్నీ హానికరమైన ఫైల్స్‌ను కలిగి ఉండే చిన్న లింక్‌లతో ఉంటాయి.



ప్రతీకాత్మక చిత్రం


స్మార్ట్‌ఫోన్ నుండి దూరంగా ఉండాలంటే..

- మీ స్మార్ట్‌ఫోన్‌లో నోటిఫికేషన్‌లను నిలిపి వేయండి.
- మీ పడకగది, భోజనాల గదిని స్మార్ట్‌ఫోన్ రహిత జోన్‌గా మార్చండి.
- మీ స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్ నుండి సోషల్ మీడియాను యాక్సెస్ చేయండి.
- ఫోన్ వినియోగాన్ని పర్యవేక్షించడం కోసం ఆండ్రాయిడ్‌లో డిజిటల్ వెల్‌బీయింగ్ యాప్, ఐఓఎస్‌లో స్క్రీన్ టైమ్ యాప్‌ని ఉపయోగించండి.
- ప్రజలు తమ స్క్రీన్ వినియోగ సమయం పెరుగుతోందని భావిస్తే గ్రే స్కేల్ మోడ్ ఫీచర్‌ని ఉపయోగించండి

- పంపినవారు మీకు తెలిసినవారే అని ధృఢపరుచుకునేవరకు ఏ లింక్‌లను ఓపెన్ చేయవద్దు. స్నేహితుడు లేదా కుటుంబ సభ్యుల నుండి ఆ మెసేజ్ వచ్చినట్లు కనిపిస్తే, వారు మీకు ఏదైనా పంపినట్లు నిర్ధారించుకోవడానికి తిరిగి వారినే సంప్రదించండి.
- అనుమానిత ఫోన్ కాల్స్, రోబోకాల్స్‌ను రిసీవ్ చేసుకోకండి. కాలర్ తాను ''టెక్ సపోర్ట్' నుండి మాట్లాడుతున్నట్టు మీతో చెప్పవచ్చు. మీ కంప్యూటర్‌కు వైరస్ సోకిందని, రిపేర్ ఉందని మీకు తప్పుగా చెప్పవచ్చు. మీరు టాక్స్ డిఫాల్టర్ లేదా పెన్షన్ ప్రాసె సింగ్ లేదా కెవైసీ కోసం అడుగుతున్న బ్యాంక్ అధికారి అని కూడా చెప్పవచ్చు. పెన్షన్ ఫండ్ మొదలైన వాటి ప్రాసెసింగ్ అని చెప్పవచ్చు.
- మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లోని పాప్‌అప్ విండోలకు ప్రతిస్పందించవద్దు లేదా దానిపై క్లిక్ చేయవద్దు. మీ కంప్యూటర్ లేదా ఫోన్‌లో 'అత్యవసర' పాప్‌అప్ విండో కనిపిస్తుంది. మీ డిజిటల్ పరికరానికి రిపేర్ అవసరమని లేదా ఒక ఫోన్‌ని కొని ఆఫర్‌లో 'మరొక ఫోన్ ని పొందండి' అంటూ మీలో ఆశను కలిగిస్తాయి. మీ కంప్యూటర్ సిస్టమ్‌కి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేయమని అడగవచ్చు.
- అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం లేదా తెలియని వాటిని డౌన్‌లోడ్ చేసే సమయంలో సురక్షిత బ్రౌజింగ్ పద్ధతులను అనుసరించండి. మీకు తెలిసిన సీనియర్స్‌కి విశ్వసనీయ వెబ్‌సైట్‌లను మాత్రమే సందర్శించమని, వారు సురక్షితమైన సైట్‌లో ఉన్నారని నిర్ధారించుకోవడానికి httpr:// (ప్యాడ్ లాక్ సింబల్) కోసం చూడాలని సలహా ఇవ్వండి.
- రెగ్యులర్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు భద్రతా లోపాలను పరిష్కరించగలవు. వారి కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్, యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్ వంటి పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయమని సీనియర్లను ప్రోత్సహించండి.
- యాప్స్ స్టోర్ లేదా ప్లే స్టోర్ నుండి మాత్రమే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.
- ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లను (ప్రత్యేక అక్షరాలు, పెద్ద అక్షరాలు, సంఖ్యాపరమైనవి) ఉపయోగించమని వృద్ధులను ప్రోత్సహించండి. వారి పుట్టిన తేదీ లేదా చిరునామా వంటి సులభంగా ఊహించదగిన సమాచారాన్ని ఉపయోగించవద్దు.
- తెలియని వ్యక్తులతో మీ మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌లతో రిమోట్ స్క్రీన్ షేరింగ్ చేయకండి.
- అన్ని ఇ-మెయిల్స్, సోషల్ మీడియా, బ్యాంక్ ఖాతాల కోసం రెండు కారకాల ప్రమాణీకరణను ఉపయోగించండి.

మోసపోతే ఏం చేయాలంటే..

ఈ టోల్ ఫ్రీ నంబర్ 1930కి వెంటనే (ఒక గంటలోపు) ఫోన్ చేయండి. దీని ద్వారా పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుంది. ఈ 1930 సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, భారత ప్రభుత్వంచే నిర్వహించబడుతుంది. దీనికి బదులుగా మీరు మీ స్థానిక సైబర్ క్రైమ్ పోలీసు అధికారుల వద్ద జరిగిన మోసం చెప్పి కంప్లయింట్ ఇవ్వచ్చు. లేదా httpr://www.cybercrime.gov.inలో ఫిర్యాదును నమోదు చేయవచ్చు.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

● స్ఫూర్తి

శ్రీ అన్న నామమే సిరిసంపదలై...



లహరి బాయి

చిరుధాన్యాలతో లహరి బాయి

లహరికి చిన్నప్పుడు అమ్మమ్మ,నానమ్మలు 'అనగనగా...' అంటూ జానపదకథలు చెప్పేవారు.
ఆ కథల్లో మహా బలవంతులు, బాహుబలులు ఉండేవారు.
'వారి బలానికి కారణం ఏమిటి?' అనేది ఆ పెద్దలు ఎప్పుడూ చెప్పలేదు.
కానీ అమ్మమ్మ, నాన్నమ్మలు ఆరోగ్యంగా, హుషారుగా, బలంగా ఉండడానికి కారణం, తారకమంత్రం ఏమిటో లహరికి తెలిసిపోయింది. దాని పేరు... చిరుధాన్యాలు!
మధ్యప్రదేశ్‌లోని మారుమూల గ్రామానికి చెందిన 27 సంవత్సరాల లహరి బాయి మిల్లెట్స్‌కు సంబంధించి 'గ్రాస్‌రూట్స్ అంబాసిడర్'గా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది....

భారత్‌ను శ్రీఅన్న (చిరుధాన్యాలు)కు ప్రపంచకేంద్రంగా మార్చడానికి దేశవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో లహరి బాయిలాంటి స్ఫూర్తిదాయక సామాన్య మహిళల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

మధ్యప్రదేశ్‌లోని దిందోరి జిల్లాలోని శిల్పిడి గ్రామానికి చెందిన లహరి అరుదైన విత్తనాలను సేకరించి తన ఇంటినే 'విత్తనాల బ్యాంక్'గా మార్చింది.

చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి వీటి గురించి ప్రచారం చేసి ఉచితంగా అందిస్తోంది. అయితే ఇది నిన్నమొన్నటి విషయం కాదు... దాదాపుగా దశాబ్దం కిందటి మాట! అప్పటికి చిరుధాన్యాల ప్రయోజనాల గురించి ఎవరికీ పెద్దగా తెలియదు.

చిరుధాన్యాల ప్రయోజనాల గురించి ప్రచారం చేస్తున్న కొత్తలో తనను ఎవరూ పెద్దగా పట్టించుకునే వారు కాదు. కొందరైతే 'నీకు ఏమీ పనిలేనట్లుగా ఉంది' అని ముఖం మీదే తిట్టేవారు. ఎన్ని అవమానాలు, అవహేళనలు ఎదురైనా లహరి తన ప్రయాణంలో వెనకడుగు వేయలేదు.

> **'అందరిలాగే నేను కూడా లహరిని పట్టించుకోలేదు. ఇప్పుడు చిరుధాన్యాలకు లభిస్తున్న ప్రాధాన్యత, ప్రచారం చూస్తుంటే లహరి ఎంత ముందుచూపుతో వ్యవహరించిందో కదా అనిపిస్తుంది. ఆమె ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది' అంటున్నాడు 58 సంవత్సరాల రైతు బాబులాల్.**

అయితే కొద్దికాలానికి మాత్రం ప్రజల్లో మార్పు వచ్చి ఆమె ప్రచారానికి విలువ ఇచ్చి గౌరవించడం ప్రారంభించారు.

ఒకప్పుడు పక్కింటి వాళ్లే పెద్దగా పట్టించుకోని లహరి ఇప్పుడు దిందోరి జిల్లాలో ఎంతోమందికి సుపరిచితురాలు. మిల్లెట్స్ 'గ్రాస్‌రూట్స్ అంబాసిడర్'గా ఎన్నో గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు స్ఫూర్తి ఇస్తున్న లహరి ఇప్పటికీ మట్టి గుడిసెలోనే తల్లితో కలిసి నివసిస్తోంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. అయితే లహరి వాటిని పట్టించుకునే స్థితిలో లేదు. తన ఏకైక ధ్యేయం చిరుధాన్యాలను వీలైనంతమందికి చేరువ చేయడం.

ఆడుతూ.. పాడుతూ.. లెక్కలు

మ్యాథ్స్ అంటే స్టూడెంట్స్‌కు ఎప్పుడూ భయమే. వారిలో భయాన్ని పోగొట్టి ఆట, పాటలతో మ్యాథ్స్ నేర్పిస్తుంది తెలంగాణలోని సిద్దిపేట జిల్లా సిరసనగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల టీచర్ రూపారాణి. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, లెక్కలు అంటే మక్కువ చూపే విధంగా బోధిస్తున్న ఈ టీచర్ ప్రయత్నాన్ని అందరూ మెచ్చుకోవాల్సిందే!

మ్యాథ్స్ అంటే కొందరి విద్యార్థుల్లో చెప్పలేనంత భయం ఉంటుంది. కొందరికైతే అదొక ఫోబియా. అదే గేమ్స్ అంటే ఎంతో ఇష్టం చూపిస్తారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో లెక్కలపై మక్కువ చూపే విధంగా ఈ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఓ కొత్త ఆలోచన చేసింది. ఆ ఆలోచనను వెంటనే ఆచరణలో పెట్టింది. ఫలితం ఇప్పుడా టీచర్ దగ్గర లెక్కల పాఠాలు నేర్చుకున్న పిల్లలకు అంకెలు, సంఖ్యలు, ఆల్‌జీబ్రాలు, కొలతలు, వేగాలు అన్ని మంచినీళ్ల ప్రాయంగా అర్థమవసాగాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే కానీ ఇప్పుడు వీరు కార్పొరేట్‌కు ఏ మాత్రం తీసిపోరని నిరూపిస్తున్నారు. రూపారాణి ఇటీవల కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చి, టీచర్ కేటగిరిలో ప్రత్యేక బహుమతిని సాధించారు.



గ్రాఫ్ చెబుతున్న రూపారాణి



పిల్లలకు గణితాన్ని ఆటల్లో చెబుతూ..

చార్‌పత్తర్‌తో..

విద్యార్థులు ఆడుకునే చార్ పత్తర్ ఆటతో గ్రాఫింగ్ పాయింట్‌లు ఎలా పెట్టవచ్చో చూపుతున్నారు. ఒక బాక్స్‌లో నాలుగు సమాన బాక్స్‌లు చేసి మధ్యలో నాలుగు రాళ్లు పెట్టి, వాటిని విద్యార్థులు తీసుకునే విధానం ద్వారా గ్రాఫింగ్ పాయింటింగ్ నేర్పిస్తున్నారు.

డయల్ యువర్ ఫార్ములాతో ఫార్ములాలను కనుక్కోవడం, మ్యాజిక్ ఫార్ములాతో సమస్యలు ఎలా సాధన చేయవచ్చో, సంఖ్య రేఖపై ఆటల ద్వారా కూడికలు, తీసివేత గుణాంకాలను చేయడం, ఎలక్ట్రికల్ లైట్స్‌తో ప్రాపర్టీ ఆఫ్ సర్కిల్స్.. ఇలా విద్యార్థులకు ఆటలతో అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తున్నారు.

పాటలతో ఎక్కాలు

బతుకమ్మ పాటలతో ఎక్కాలను సులభంగా నేర్చుకునే విధంగా, యానిమేటెడ్ డిజిటిల్స్ ద్వారా విద్యార్థులకు దృశ్య రూపకంగా సులభంగా అర్థమయ్యేలా చేస్తున్నారు. దీంతో విద్యార్థులు మ్యాథ్స్ అంటే భయం పోయి మక్కువ చూపుతున్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ

విద్యార్థులకు ఆటలతో మ్యాథ్స్ బోధించే విధానాన్ని జాయ్ ఫుల్ లెర్నింగ్ మ్యాథ్స్ బై గేమ్స్ యూజింగ్ ఇన్నోవేటివ్ ఐడియాస్ పేరుతో ఎగ్జిబిట్‌లను రూపొందించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబర్చారు. కేరళ రాష్ట్రం త్రిశూల్‌లో జరిగిన జాతీయ స్థాయిలో ఈ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. విశ్వేశ్వరయ్య ఇండ్రస్టియల్ టెక్నాలజీ మ్యూజియం తరుపున ప్రత్యేక బహుమతిని అందుకున్నారు.

నాన్న స్ఫూర్తితోనే!

మా నాన్న రాజమౌళి ప్రభుత్వం ఉపాధ్యాయుడిగా రిటైర్ అయ్యారు. టూర్‌లకు వెళ్లిన సమయంలో విద్యార్థుల కోసం బొమ్మలను తీసుకువచ్చి, వాటి ద్వారా విద్యా బోధన చేశారు. దీంతో విద్యార్థులూ చదువు పట్ల మక్కువ చూపించేవారు. అలా నాన్న స్ఫూర్తితో నేనూ ఏదైనా చేయాలనుకుని ఆలోచించాను. విద్యార్థులకు ఆటల ద్వారా మ్యాథ్స్‌ను బోధిస్తున్నారు. మానాన్న స్ఫూర్తితోనే విద్యార్థులకు ఆటలు పాటల ద్వారా మాథ్స్ చెప్పతున్నాను. దీంతో విద్యార్థుల పాస్ పర్సంటెజ్ బాగా పెరుగుతుంది. సిరసనగండ్ల జెడ్పీ స్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా ఉన్న నేను ఇటీవల డిప్యూటేషన్ పై మూట్రాజ్‌పల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాను. ఇక్కడా ఇదే పద్ధతిలో మ్యాథ్స్ బోధిస్తున్నాను.

– పెందోట రూపారాణి

– గజవెల్లి షణ్ముఖరాజు, సాక్షి, సిద్దిపేట
ఫొటోలు: సతీష్ కుమార్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 319

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు.. తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



మనకి ముప్పు ఎంత..?

భారత్‌లో 60 శాతం భూభాగానికి భూకంప ప్రమాదం ఎక్కువే.. -6లో



అసలు సిసలు 'పరీక్ష'

నాగ్‌పూర్‌లో నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టెస్టు -12లో



బీజేపీ వల్లే అదానీకి ఆస్తులు

2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే గౌతమ్ అదానీ ఆస్తులు విపరీతంగా పెరిగాయని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

- వివరాలు 6లో▶



భారత్ పైనా డ్రాగన్ బెలూన్లు

చైనా అమెరికాపైనే కాదు.. భారత్‌ను కూడా లక్ష్యంగా చేసుకుని బెలూన్లతో నిఘా పెట్టినట్లు 'ద వాషింగ్టన్ పోస్టు' తెలిపింది.

- వివరాలు 6లో▶



సూచీలకు పాలసీ లాభాలు

ఆర్‌బీఐ రేట్ల పెంపులో దూకుడు తగ్గించడంతో స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

- వివరాలు 13లో▶



రష్యా యుద్ధంలో ఓడిపోతుంది

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆకస్మికంగా బ్రిటన్ పర్యటనకు వచ్చారు. యుద్ధంలో రష్యా ఓడిపోతుందని జోస్యం చెప్పారు.

- వివరాలు 6లో▶

ప్రగతిభవన్ గేట్లు బద్దలుకొట్టాలి



'రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలు రక్తమాంసాలు కరిగించి, శ్రమించి పన్నులు చెల్లిస్తే రూ.2వేల కోట్లతో ప్రగతిభవన్ కట్టారు. అందులో ప్రజలెవరికీ ప్రవేశం లేదు. ప్రజలకు ఉపయోగ పడని ఆ భవనం గేట్లు బద్దలు కొట్టాలి. ప్రజల సమస్యలను వినే భవన్ కావాలి..' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు.

- వివరాలు 3లో▶

ఈసారి ఎంసెట్‌లో 70% సిలబస్



తెలంగాణ ఎంసెట్‌లో ఈసారి 70% సిలబస్ మాత్రమే ఉంటుందని ఉన్నత విద్యామండలి వర్గాలు తెలిపాయి. మరోవైపు ఇంటర్ మార్కుల వెయిటేజీపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. - వివరాలు 11లో▶

క్రెడిట్ కార్డుల స్వైపింగ్‌తో
రూ.5 కోట్ల మోసం

- వందకు పైగా క్రెడిట్ కార్డులు సేకరించి..
- రూ.5కోట్ల నగదు స్వైప్ చేసి కార్డుదారులకు నగదు ఇవ్వకుండా పరార్

- వివరాలు 11లో▶





52 గంటల తరువాత.. అమ్మ ఒడికి...

ఎనిమిదేళ్ల బాలుడు తుర్కియేలో భూకంపంతో శిథిలమైన భవంతి కింద చిక్కుకుపోయాడు. 52 గంటల తరువాత బయటపడ్డాడు. ఆ ఆనందంతో హుషారుగా కనిపించిన ఆ బాలుడు.. తల్లి ఒడి చేరగానే ఇలా భావోద్వేగానికి గురయ్యాడు.

17 గంటలు.. అక్కే అండగా...

సిరియాలో ఓ భవనం శిథిలాల కింద అక్క, తమ్ముడు 17 గంటల పాటు చిక్కుకుపోయారు. ఆ శిథిలాల కింద తమ్ముడికి అపాయం కలగకుండా తన చేతిని అడ్డుపెట్టి కాపాడిందీ అక్క. ఆమె ధైర్యాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.



11,200 దాటిన మరణాలు 6లో

ఆ నిధులు తేండి

రాష్ట్రంపై ప్రేమ ఉంటే బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్రం నుంచి రూ.1,27,109 కోట్ల నిధులను తేవాలి: హరీశ్

- కేంద్రం ఒక్కో పౌరుడిపై రూ.1,39,956 అప్పు భారాన్ని మోపింది
- రాష్ట్రాల అప్పులు తగ్గుతుంటే కేంద్రం అప్పులు పెరుగుతున్నాయి
- మిషన్ భగీరథను కాపీ కొట్టినా.. కేంద్రం ముందుకు తీసుకెళ్లలేకపోతోంది
- రైతులపై కార్లు ఎక్కించిన వారు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరం
- కోత లేకుండా విద్యుత్ ఇచ్చాం.. అందుకే ప్రజలు మాకు పవర్ ఇచ్చారు
- గతంలో ఖాళీ బిందెల ప్రదర్శనలుండేవి... ఇప్పుడు మిషన్ భగీరథతో నీళ్ల సమస్య లేకుండా చేశాం: బడ్జెట్‌పై హరీశ్ సమాధానం



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకవైపు రాష్ట్ర రుణాలకు కోతపెడుతూ... మరోవైపు రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను ఇవ్వకుండా అడ్డుకుంటోందని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్ రావు ధ్వజమెత్తారు. ప్రస్తుత సంవత్సరమే రాష్ట్రానికి రూ. 37,809 కోట్లను ఎగ్గొట్టిందని, అలాగే, నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు మిషన్ భగీరథకు ఇవ్వాల్సిన రూ.19,205 కోట్లకు ఎగనామం పెట్టిందన్నారు. ఇలా కేంద్రం నుంచి మొత్తం రూ.1,27,109 కోట్లు రావాల్సి ఉందని స్పష్టంచేశారు. బీజేపీ ఎమ్మెల్యేలకు రాష్ట్రంపై ప్రేమ ఉంటే ఈ మొత్తం నిధులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. 'ఏడాదిలో విద్యుత్ కోతలు లేకుండా చేస్తామని 2014లో సీఎం కేసీఆర్ మిగతా 2వ పేజీలో ▶

నాడు మీరు చెప్పిందే వినిపిస్తున్నా..:
'ఈ రాష్ట్రం పరువు తీయడం కాదు.. ఆ సూచనలేవో కేంద్రానికి చెప్పండి' అని గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ బీజేపీ సభ్యులను ఉద్దేశించి అన్న మాటలను హరీశ్‌రావు బుధవారం అసెంబ్లీలో ట్యాబ్ ద్వారా సభ్యులకు ప్రదర్శించారు. అనంతరం 'నాటి మీ మాటలను గుర్తుచేస్తున్నా.. అదే నేనూ చెబుతున్నా. అదేదో కేంద్రానికి చెప్పండి' అని ఈటలను ఉద్దేశించి అన్నారు.

ప్రజలే నాకు రక్షణ కవచం

- దూషణలు, అబద్ధాలు నన్నేమీ చేయలేవు
- యూపీఏ హయాంలో ఒక దశాబ్దాన్ని కోల్పోయాం
- లోక్‌సభలో ప్రతిపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని నరేంద్ర మోదీ

- వివరాలు 6లో▶



ప్రధాని మోదీ ధరించిన జాకెట్ (కుడి) రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌తో తయారుచేసింది. బుధవారం ఆయన ఈ 'సద్రీ' జాకెట్‌తోనే రాజ్యసభ సమావేశంలో పాల్గొన్నారు. దీన్ని ఇటీవల బెంగళూరులో ఐవోసీ సంస్థ ఆయనకు బహూకరించింది.

వడ్డింపే.. కానీ భారం స్వల్పం!

ఈసారి రెపో రేటు 0.25 శాతం పెంపు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా సమావేశం అంచనాలకు అనుగుణంగా రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) ఈ సారి పావుశాతమే పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ఈ మేరకు బ్యాంకుల గృహ, వాహన, కార్పొరేట్ రుణ రేట్లు పెరగనున్నాయి.

- వివరాలు 13లో▶



ఏబీకేకు 'రాజా రామ్మోహన్‌రాయ్ జాతీయ అవార్డు'

కార్టూనిస్ట్ శంకర్‌కు 'ఎక్స్‌లెన్స్ ఇన్ పొలిటికల్ క్యారికేచర్' పురస్కారం

-వివరాలు 11లో▶

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్!

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నిక నోటిఫికేషన్ ఒకటి రెండు రోజుల్లో వెలువడే అవకాశముంది. ఎమ్మెల్యేల కోటాలో మండలికి ఎన్నికైన ముగ్గురు సభ్యుల పదవీ కాలం మార్చి 29న ముగియనుంది.

-వివరాలు 2లో▶

'ఆ అభ్యర్థులకు' మరో చాన్స్



యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీలో భాగంగా అభ్యర్థులకు నిర్వహించిన ఎత్తు కొలతల్లో ఒక సెంటీమీటర్, అంతకంటే తక్కువ తేడాతో అనర్హులైన అభ్యర్థులకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మరో అవకాశం కల్పించనుంది. ఇందుకు అర్హులైన అభ్యర్థులు www.tslprb.in వెబ్‌సైట్‌లో ఈనెల 10న ఉదయం 8 నుంచి 12వ తేదీ రాత్రి 8 వరకు లాగిన్ ఐడీల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

-వివరాలు 11లో▶

ఢిల్లీ లిక్కర్ స్కాం.. హైదరాబాద్ ఆడిటర్ గోరంట్ల అరెస్ట్

-వివరాలు 3లో▶

క్లుప్తంగా...

అసెంబ్లీలో కనీసం ఒక గదైనా ఇవ్వండి: ఈటల

అధికార పార్టీ సభ్యుల వాగ్వాదం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో ఒక గది అయినా ఇవ్వాలని ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బుధవారం సభలో స్పీకర్‌ను కోరారు. గతంలో పార్టీకి ఒక్కరున్నా వసతి కల్పించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇది శాసనసభ ఎమ్మెల్యేలకు ఇచ్చే గౌరవమని తెలిపారు. ఈటల ఈ అంశాన్ని సభలో ప్రస్తావించడంపై అధికార పార్టీ సభ్యులు, మంత్రి హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ వద్ద ఈ అంశాన్ని చర్చిస్తే బాగుంటుందని సలహా ఇస్తూ అడ్డుపడ్డారు. దీంతో సభలో ఈ అంశంపై ఈటల, అధికారపక్ష సభ్యుల మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కూడా ఇదే సలహా ఇవ్వడంతో ఈటల బడ్జెట్‌పై చర్చను ప్రారంభించారు. రాష్ట్ర బడ్జెట్ పేదల సంక్షేమాన్ని అడ్డుకునేలా ఉందని, వీలుకాని, సాధ్యంకాని ట్యాక్సులను బడ్జెట్‌లో ఆదాయంగా చూపించడం, కేంద్రం ఇవ్వలేదని నిందలు వేయడం ప్రభుత్వానికి తగదన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇంకా రానేలేదని, ఉద్యోగులకు జీపీఎఫ్‌లు కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని ఈటల ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ...అసెంబ్లీని బీఆర్ఎస్‌ఎల్పీ కార్యాలయంగా మార్చారని ఈటల ఆరోపించారు.

అందరి గుండెల్లో నిలిచిన నేత కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ వారి గుండెల్లో నిలిచిన నేత సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి కొనియాడారు. బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమైక్య పాలనలో తెలంగాణలో జరిగిన విధ్వంసం స్థానంలో ఎనిమిదిన్నరేళ్లలోనే సీఎం కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేశారన్నారు. సంక్షేమ రంగాల్లో దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపారని వెల్లడించారు. రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు ఇవ్వనందుకు కేంద్రం సిగ్గుపడాలని విమర్శించారు. కేంద్రం సహకరించకున్నా సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఐటీ రంగం ద్వితీయశ్రేణి నగరాలకు కూడా విస్తరిస్తోందంటే ఆ ఘనత కేసీఆర్ సర్కారుదేనని తెలిపారు.

కాల్ చేసి... బెదిరిస్తున్నారు



సాక్షి, హైదరాబాద్: కొంతమంది ఫోన్ చేసి తనను బెదిరిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం శాసనసభ దృష్టికి తెచ్చారు. బుధవారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర పురోభివృద్ధికి శ్రమిస్తున్న కేసీఆర్ ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో విపక్షాలు చేస్తున్న విమర్శలకు మీడియాముఖంగా సమాధానం చెబితే రౌడీల చేత తనకు ఫోన్‌కాల్స్ చేసి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టడుగువర్గాలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంపై కొన్ని పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, ఆ వర్గాలను ఆర్థికంగా బలోపేతం కాకుండా చూడాలన్నదే వాళ్ళ ఆలోచనన్నారు.

నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్: నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నకిలీ విత్తనాల బెడద అరికట్టేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ చేసి సీజన్‌కు 2, 3 నెలల ముందు నుంచే చర్యలు చేపడుతున్నామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. గుజరాత్, ఇతర పొరుగురాష్ట్రాల నుంచి కొంతమేర నకిలీ విత్తనకంపెనీల బెడద ఉందని, దీనికి పాల్పడేవారిపై పీడీ యాక్ట్, ఇతర రూపాల్లో కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. విత్తనాలకు కొరత, ఇబ్బంది లేకుండా ప్రతీ సీజన్‌లో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఇదండీ సంగతి



దేనివల్లో కానీ.. ఈడీ, మనం ఏకమయ్యామని ప్రతిపక్షాలంటున్నాయి సార్!

ఆ నిధులు తెండి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటిస్తే, కాంగ్రెస్ పక్ష నేత జానారెడ్డి ఆశ్చర్యంగా ఉందన్నారు. అలా చేస్తే తాను గులాబీ జెండా పట్టుకుని ప్రచారం చేస్తానన్నారు. ఇప్పుడు నాణ్యమైన కరెంట్ 24 గంటలూ ఇస్తున్నాం. విద్యుత్ కోత అన్న మాటే లేకుండా చేశాం. పవర్ ఇచ్చాం కాబట్టే ప్రజలు మాకు పవర్ ఇచ్చారు.. విపక్షాలకు పవర్ లేకుండా చేశారు' అని హరీశ్‌రావు చెప్పారు. శాసనసభలో బుధవారం రాష్ట్ర బడ్జెట్ 2023–24పై జరిగిన సాధారణ చర్చలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు ఆయన సమాధానమిచ్చారు. హరీశ్‌రావు ప్రసంగం ఆయన మాటల్లోనే..

డబుల్ ఇంపాక్ట్ బాగుందా.. డబుల్ ఇంజిన్ బాగుందా?

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశాం. రాజకీయ దురుద్దేశంతోనే విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలి. గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీళ్లు కూడా లేక ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. బడ్జెట్ సమావేశాలొస్తే ఖాళీ బిందెల ప్రదర్శనలు జరిగేవి. మిషన్ భగీరథ ద్వారా నీళ్ల సమస్యే లేకుండా చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ఈ పథకాన్ని కేంద్రం కాపీ కొట్టినా, ముందుకు తీసుకెళ్లలేకపోతోంది. డబుల్ ఇంపాక్ట్ సర్కార్ బాగుందా.. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బాగుందా (కేంద్రాన్ని ఉద్దేశించి).

తాంత్రిక పాలన కాదు.. ఆధ్యాత్మికమే!

సీఎం కేసీఆర్ పాలనను తాంత్రిక పాలన అని జేపీ నడ్డా వంటి బీజేపీ జాతీయ నేతలు ఆరోపించడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలో పెద్దఎత్తున ఆలయాలను నిర్మించడంతోపాటు ప్రాజెక్టులకు దేవుళ్ల పేర్లను పెట్టిన కేసీఆర్ ఆధ్యాత్మిక గుణ సంపన్నుడు అని కొనియాడారు. బీజేపీ నేతల తరహాలో తమ నాయకుడు దేవుళ్ల పేరుతో ద్వేషాన్ని పెంచడం లేదని స్పష్టంచేశారు.

రాష్ట్ర అప్పులు తగ్గుదల

జీఎస్డీపీ (రాష్ట్ర స్థూలజాతీయోత్పత్తి)లో ఎంత శాతం ఉందని చూడటమే అప్పులకు కొలమానం. గతేడాది జీఎస్డీపీలో 24.7గా ఉన్న అప్పుల శాతాన్ని ఈ ఏడాది 23.8 శాతానికి తగ్గిస్తున్నాం. పెరిగిన జీఎస్డీపీని బట్టి రుణాలను సమీకరిస్తున్నాం. రాష్ట్రాల అప్పులు తగ్గుతుంటే కేంద్రం అప్పులు పెరుగుతున్నాయి. కేంద్ర అప్పులు రూ.160 లక్షల కోట్లకు పెరగగా, ఒక్కో పౌరుడిపై రూ.1,39,956 అప్పు భారాన్ని మోపింది. గతేడాది దేశ జీడీపీలో 55.9 శాతం ఉన్న కేంద్ర ప్రభుత్వ అప్పులు ఈ ఏడాది 56.2 శాతానికి పెరిగాయి. కేంద్రం తెచ్చే అప్పుల్లో 48.7 శాతాన్ని రోజు వారీ ఖర్చులు,



అప్పు కట్టడానికే సరిపోతోంది. ఎఫ్ఆర్‌బీఎం సంస్కరణల పేరుతో గతేడాది రూ.15,033 కోట్ల రాష్ట్ర రుణాలకు కోత పెట్టిన కేంద్రం.. తాను మాత్రం యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతోంది.

కార్పొరేట్లకు దోచిపెట్టుడే...



బీజేపీ అంత్యోదయ సిద్ధాంతానికి నీళ్లొదిలింది. అదానీ సిద్ధాంతాన్ని అమలు చేస్తోంది. చిట్టచివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే అంత్యోదయ సిద్ధాంతం. కానీ, బీజేపీ వాళ్లకు పేదల సంక్షేమం వద్దు, కార్పొరేట్లకు దోచిపెట్టుడే ముద్దు. గత ఆరేళ్లలో కార్పొరేట్లకు చెందిన రూ.19 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసిన కేంద్రం.. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్లాలు కట్టడాన్ని ఆక్షేపించింది. దీనికోసం ఖర్చుచేసిన రూ.151 కోట్లను తిరిగి ఇచ్చేదాకా రాష్ట్రానికి ఉపాధి హామీ నిధులను కూడా ఆపేసింది. రైతులపై కార్లెక్కించిన బీజేపీ నేతలు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది.

కేంద్రం నుంచి రావాల్సినవి

'15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన రూ.5,374 కోట్ల స్టేట్ స్పెసిఫిక్ గ్రాంట్, 2022–23 ఫైనాన్స్ కమిషన్ బకాయిలు రూ.2,016 కోట్లు, జీఎస్టీ పరిహారం రూ.2,437 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.5వేల కోట్లు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు రూ.1,350 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లను ఇవ్వకుండా కేంద్రం అడ్డుపడుతోంది' అని హరీశ్‌రావు చెప్పారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టనందుకు 2021–26 మధ్య కాలంలో రూ.30 వేల కోట్లు (ఏటా సుమారు రూ..6వేల కోట్లు) ఆపేసిందన్నారు. ఏపీ నుంచి రావాల్సిన రూ.17,800 కోట్ల విద్యుత్ బకాయిలు, పొరపాటున ఏపీకి వెళ్లిన రూ.495 కోట్ల రాష్ట్ర నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్నీ కలిపి రాష్ట్రానికి రూ.1,27,109 కోట్లు రావాల్సి ఉందన్నారు.

హరీశ్‌రావు ఇంకా ఏమన్నారంటే?

- మిషన్ కాకతీయ వల్ల ఎండిపోయిన చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. భూగర్భ జలమట్టం పెరిగింది. బోరు వెయ్యకుండానే నీళ్లు రావడం మునుగోడు నియోజకవర్గంలోని మర్రిగూడలో చూశాను. ఎండాకాలంలోనూ చెరువులు పొంగుతున్నాయి. చెక్‌డ్యాంలు అలుగుపారుతున్నాయి. 500 ఏళ్లలో పడనంత వాన వచ్చినా చెరువుల కట్టలు తెగలేదు.
- ప్రాజెక్టులు కడుతుంటే విపక్షాలు అడ్డుపడుతున్నాయి. కేసులు వేస్తున్నాయి. క్షుద్ర రాజకీయాలు చేస్తున్నాయి. ఎవరు అడ్డుపడ్డా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తాం.
- కృష్ణానది జలాల వాటా సాధన కోసం అనేక ప్రయత్నాలు చేశాం. కేంద్రం పరిష్కరిస్తామంటేనే సుప్రీంకోర్టులో వేసిన కేసునూ ఉపసంహరించుకున్నాం. పది నెలలైనా పరిష్కరించలేదు. కొద్ది రోజులు చూసి మళ్లీ కోర్టుకెళ్తాం.
- మహారాష్ట్ర రైతులు తెలంగాణ సరిహద్దుల్లో భూమి కొనుక్కుని, ఇక్కడ్నుంచీ బోర్ ద్వారా నీళ్లు పారించుకుంటున్నారు. మన కరెంట్‌తో కర్ణాటక సరిహద్దుల్లోనూ నీళ్లు పారుతున్నాయి.
- రైతు ఆత్మహత్యల స్థాయి నుంచి ఆత్మగౌరవం స్థాయికి తెచ్చాం. జీఎస్డీపీలో 18.2 శాతం ఆదాయం వ్యవసాయం నుంచే వస్తోంది. రైతుకు అన్ని దశల్లోనూ అండగా ఉంటున్నాం.

బడ్జెట్ వాస్తవ దూరం: భట్టి

- పన్నుల రాబడి రూ. 40 వేల కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో రూ. 30 వేల కోట్లు ఎక్కువ చూపారు
- హరీశ్‌రావులాగే బడ్జెట్ కూడా పొడుగ్గా ఉందని వ్యాఖ్య




సాక్షి, హైదరాబాద్: కొందరి ఆస్తులు అనూహ్యంగా పెరిగితే రాష్ట్రంలోని ప్రజలందరి ఆదాయం పెరిగినట్లు కాదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పేదల జీవితాలేమీ మారలేదని, కొందరు పెద్దలు మాత్రమే వేల కోట్ల ఆదాయం పొందారన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆయనలాగే పొడుగ్గా ఉన్నప్పటికీ, వాస్తవానికి దూరంగా ఉందని విమర్శించారు. 2014–15 సంవత్సరంలో లక్ష కోట్లతో మొదలైన బడ్జెట్ 2023–24 నాటికి 2,90,396 కోట్లకు పెంచారే తప్ప బడ్జెట్ లెక్కలు వాస్తవాలకు దగ్గరగా లేవని అన్నారు. కొత్త పన్నులు వేయకుండా స్వీయ పన్నుల ఆదాయం ఎలా పెరుగుతుందో చెప్పాలన్నారు. పన్నుల రాబడిలో రూ.40 వేల కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధుల్లో రూ.30 వేల కోట్లు ఎక్కువగా చూపించారని, ఇది అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. ఈ బడ్జెట్లో రూ 46,317 కోట్లు అప్పు తేనున్నట్లు చూపారని, ఈ అప్పుతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా చేసిన అప్పులు రూ. 3.57 లక్షల కోట్లకు చేరుకుంటుండగా, గ్యారంటీలు, కార్పొరేషన్ల పేరిట తీసుకువచ్చిన అప్పులు రూ. 1.29 కోట్లు కలిపితే మొత్తం రూ. 4.86 కోట్ల అప్పుల భారం ప్రజలపై మోపినట్లు అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తలసరి ఆదాయం రూ. 1,40,840 నుంచి రూ. 3,17,115కు పెరిగినట్లు చెబుతున్నప్పటికీ.. అది సంపన్నులకేనన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై విమర్శలు

కేంద్రం ప్రవేశపెట్టిన రూ. 45 లక్షల కోట్ల బడ్జెట్లో రూ. 15 లక్షల కోట్లు అప్పులుగా చూపారని, తెలంగాణకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని భట్టి విమర్శించారు. రాష్ట్ర విభజన హక్కుల చట్టం ప్రకారం ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీ, ఐటీఐఆర్ తదితర ఏ ఒక్క ప్రాజెక్టుకూ నిధులివ్వలేదన్నారు. పేదలకు పంచిన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే విధానం మారాలన్నారు. చైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఎలాంటి వసతులు లేకున్నా వేలకు వేలు ఫీజుల భారం మోపి ప్రజలను దోపిడీ చేస్తున్నాయని, ఫీజుల నియంత్రణ పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. భట్టి విక్రమార్క ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే బీజేపీ సభ్యుడు రఘునందన్‌రావు, నారాయణ, చైతన్య విద్యా సంస్థల గురించి మాట్లాడుతుంటే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద అడ్డుకునే ప్రయత్నం చేశారు.

తెలంగాణకు సహకరించని కేంద్రం

- జీఎస్టీ తర్వాత తగ్గిన రాష్ట్రాల నిధుల వాటా
- పాతబస్తీలో హిందువుల హక్కుల కోసం పోరాడతాం
- బడ్జెట్‌పై చర్చలో అక్బరుద్దీన్‌ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతతో వ్యవహరిస్తోందని, రాష్ట్రానికి ఆర్థికంగా ఎలాంటి సహకారం అందించడం లేదని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన 2023–24 బడ్జెట్‌పై చర్చను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.2.90 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం పట్ల అభినందనలు తెలిపారు. అయితే ఎనిమిదిన్నరేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదన్నారు. కేంద్ర పన్నుల వాటాలో ఆంధ్రప్రదేశ్‌కు 2/3వ వంతు, తెలంగాణకు 1/3 వంతు మాత్రమే ఇస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీ అమలు తర్వాత రాష్ట్రాల నిధుల వాటా తగ్గిందని అన్నారు. కేంద్రం ఇష్టా రీతిన అప్పులు చేస్తూ.. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసే అప్పుల మీద ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. అలాంటి కేంద్రం తెలంగాణ అప్పుల గురించి గగ్గోలు పెట్టడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

కేంద్రం తీరు వల్లే రాష్ట్రంలో రెవెన్యూ లోటు

కేంద్రం చేసిన అప్పుల ముందు రాష్ట్రం అప్పులు చాలా స్వల్పమని అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. పునర్ విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని తలసరి ఆదాయం జాతీయ సగటు కన్నా ఎక్కువ అని , అన్ని రంగాల్లో తెలంగాణ ముందుకు వెళుతోందని కొనియాడారు. రాష్ట్ర బీజేపీ నేతలు ఇక్కడ విభజన రాజకీయాలు చేసే బదులు.. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి పోరాడితే బాగుంటుందని సూచించారు. కేంద్రం మైనార్టీలకు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లు రద్దు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఆ స్కాలర్‌షిప్పులు ఇచ్చే విషయమై ఆలోచించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డులో విలువైన పత్రాలు గాయబ్ అవుతున్నాయని , రికార్డులను పరిశీలించి చర్యలు చేపట్టాలని సూచించారు.

పాతబస్తీ కొత్త నగరాన్ని మించి పోనుంది...

భవిష్యత్తులో పాతబస్తీ కొత్త నగరాన్ని మించిపోనుందని అక్బరుద్దీన్ ఒవైసీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో ఆరుగంటల పాటు జరిగిన సమావేశం సంతృప్తికరంగా సాగిందని చెప్పారు. పాతబస్తీలోని ముస్లింలతో పాటు హిందువులు, సిక్కులు, క్రిస్టియన్‌ల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. లాల్‌దర్వాజ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పాతబస్తీలోని హిందువుల హక్కుల కోసం పోరాడతామన్నారు.

కొత్త పన్నుల యోచన లేదు

- ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఆదాయం పెంచుకుంటాం: మంత్రి హరీశ్‌రావు
- జూన్ నాటికి రూ.20 వేల కోట్లు ఆశిస్తున్నామని వెల్లడి
- లిక్కర్ ఆదాయాన్ని భారీగా చూపటం అనైతికం: భట్టి

సాక్షి, హైదరాబాద్: ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్తగా పన్నులు వేసే ఆలోచన లేదని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందుకోసం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్‌కమిటీ సూచనలు చేస్తోందని చెప్పారు. జూన్ నాటికి రూ.20 వేల కోట్లను సమకూర్చుకోనున్నామని, నిరర్థక ఆస్తులను వనరులుగా మార్చుకుంటున్నామని తెలిపారు. కేవలం భూములను అమ్మడం ద్వారానే ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నామనడం సరికాదన్నారు. బుధవారం బడ్జెట్‌పై సాధారణ చర్చ అనంతరం కాంగ్రెస్ సభా పక్ష నేత భట్టి విక్రమార్క అడిగిన క్లారిఫికేషన్స్‌కు ఆయన సమాధానమిచ్చారు.

పాత్రికేయులకు వెంటనే స్థలాలివ్వండి: భట్టి

లిక్కర్, భూముల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయాన్ని బడ్జెట్‌లో భారీగా చూపటం అనైతికమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు చూసేందుకు వచ్చే విదేశీయులకు అనుమతి ఇస్తున్న ప్రభుత్వం, ప్రతిపక్ష నేతలు వెళ్తే మాత్రం ఎందుకు అరెస్టు చేస్తోందని నిలదీశారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన ఇళ్ల స్థలాలను అందజేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత పాత్రికేయులకు వెంటనే ఆ స్థలాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయానికి నాలుగైదు గంటలు కూడా కరెంటు సరఫరా కావటం లేదని సభ దృష్టికి తెచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో చెరువు నీటిని తాగినందుకు ఓ మహిళను వివస్త్రను చేసి దాడి చేసిన ఘటనకు సంబంధించిన వీడియోను ఫోన్ ద్వారా ప్రదర్శించేందుకు ఆయన ప్రయత్నించగా, ముందస్తు అనుమతి తీసుకోనందున అనుమతించలేమని స్పీకర్ చెప్పారు.

డబుల్ బెడ్రూం ఇళ్లపై...

బడ్జెట్‌లో నిరుద్యోగుల భృతి, స్పోర్ట్స్ పాలసీ, డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రస్తావన లేదని బీజేపీ సభ్యుడు రఘునందన్‌రావు ప్రస్తావించగా.. క్రీడా విధానంపై మంత్రి శ్రీనివాసగౌడ్ ప్రకటన చేస్తారని, డబుల్ బెడ్రూం ఇళ్లను హడ్కో నుంచి తెచ్చే రుణం ద్వారా పూర్తి చేస్తామని హరీశ్‌రావు బదులిచ్చారు. ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు, మూడు పెండింగ్ డీఏలను చెల్లించటంతోపాటు తక్షణమే కొత్త పీఆర్సీ కమిటీ వేయాలని, సాదాబైనామాలను క్రమబద్ధీకరించాలని అక్బరుద్దీన్ కోరారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నందున వీటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హరీశ్‌రావు సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్?

- మార్చి 29న ఖాళీ అవుతున్న మూడు ఎమ్మెల్సీ సీట్లు
- ముగుస్తున్న వీజీ గౌడ్, నవీన్, ఎలిమినేటి పదవీ కాలం

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేల కోటాలో శాసనమండలికి ఎన్నికైన ముగ్గురు సభ్యుల పదవీ కాలం మార్చి 29న ముగియనుంది. వచ్చే నెల 29 నాటికి ఎమ్మెల్సీలుగా తమ ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న వారిలో వి.గంగాధర్ గౌడ్, కుర్మయ్యగారి నవీన్‌కుమార్, ఎలిమినేటి కృష్ణారెడ్డి ఉన్నారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకునేందుకు షెడ్యూలు విడుదలపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే 40 మంది సభ్యులున్న తెలంగాణ శాసన మండలిలో ముగ్గురు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలతో పాటు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ (ఎంఐఎం), ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి మే నెలలో ఆరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటున్నారు. వీరి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా ఏప్రిల్‌లో విడుదల కానున్నది.

వాస్తవాలను ప్రజల ముందుంచాలి

- అదానీ వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత
- జాయింట్ పార్లమెంటరీ కమిటీ లేదా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి
- రూ.10 లక్షల కోట్ల ప్రజాధనం ఆవిరైనా మాట్లాడని ప్రధాని మనకు అవసరమా? అని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి విచారించాలని, లేదా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై గంటన్నర మాట్లాడిన ప్రధాని మోదీ, ఒక్కసారి కూడా అదానీ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదో సమాధానం చెప్పాలన్నారు. రూ. పది లక్షల కోట్ల ప్రజాధనం ఆవిరైనా మాట్లాడని ప్రధాని మోదీ మనకు అవసరమా అని నిలదీశారు. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన 10 రోజుల్లోనే అదానీ ప్రపంచంలోని ధనవంతుల జాబితాలో 2వ స్థానం నుంచి 22వ స్థానానికి పడిపోయారని కవిత పేర్కొన్నారు. అదానీ సంస్థ అనేక ప్రభుత్వరంగ సంస్థల నుంచి అప్పులు తీసుకోవడంతో పాటు, ఎల్ఐసీ అదానీ గ్రూప్‌లో రూ.80 వేల కోట్లు పెట్టుబడి పెట్టిందన్నారు. చిరుద్యోగులు, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు ఎల్ఐసీ షేర్లు కొని, అదానీ సంస్థ కారణంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎల్పీకి మంత్రి ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అసెంబ్లీలోని కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) కార్యాలయానికి వచ్చారు. బుధవారం అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత టీఆర్ఎస్ఎల్పీలో సమావేశం అనంతరం వెళ్లిపోయేందుకు ఎర్రబెల్లి వస్తుండగా సీఎల్పీ కార్యాలయ కార్యదర్శి శ్రీకాంత్ ఆయన్ను కలిశారు. ఉపాధి హామీ నిధుల గురించి సీఎల్పీ నేత భట్టి కలవాలనుకుంటున్నారని, సమయం ఇవ్వాలని అడిగారు. ఇందుకు స్పందించిన ఎర్రబెల్లి తానే భట్టి దగ్గరకు వస్తున్నానంటూ సీఎల్పీ కార్యాలయంలోకి వెళ్లారు. ఆ సమయంలో భట్టి తన చాంబర్‌లోపల కాంగ్రెస్ నేతలు జీవన్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావు తదితరులతో భోజనం చేస్తున్నారు. దీంతో కొంతసేపు వేచి ఉన్న తర్వాత ఎర్రబెల్లి భట్టిని కలిసి మాట్లాడి వెళ్లిపోయారు. అలాగే బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కూడా బుధవారం సీఎల్పీ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి మాట్లాడారు.

కొత్త టీచర్లు వచ్చే వరకు అక్కడే కొనసాగాలి

- అలా రాకుంటే బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేసేది లేదు
- మంత్రి సబిత స్పష్టీకరణ... మండలిలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు బదులిచ్చిన మంత్రి
- పాడి రంగానికీ ఉచిత విద్యుత్ ఇవ్వాలి: జీవన్‌రెడ్డి
- ఉద్యోగాల భర్తీకి నిరుద్యోగ యువతను సన్నద్ధం చేస్తున్నాం: కవిత



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల బదిలీలతో పాఠశాలలు ఖాళీ అయ్యే ప్రసక్తే ఉండదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితారెడ్డి స్పష్టం చేశారు. ఒకవేళ పాఠశాలల్లో పూర్తిస్థాయి ఉపాధ్యాయులకు స్థానచలనం జరిగి, కొత్త టీచర్లు రాని పరిస్థితి ఉన్నప్పుడు బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయబోమని, కొత్త టీచర్లు వచ్చే వరకు అక్కడే కొనసాగాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. బడ్జెట్‌పై సభ్యుల ప్రసంగాల్లో భాగంగా ఉపాధ్యాయ బదిలీలపై పలు అంశాలు లేవనెత్తారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సైతం జోక్యం చేసుకుంటూ జీఓ 317లో భాగంగా పలువురు ఉపాధ్యాయులకు పల్లె బడుల్లో పోస్టింగ్ లిచ్చారని, తాజాగా బదిలీల నిబంధనల సడలింపుతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఖాళీ అయ్యే ప్రమాదముందంటూ సూచనలు చేశారు. దీనిపై మంత్రి పైవిధంగా స్పందించారు. రాష్ట్రంలో ఎక్కడా టీచర్ లేని పాఠశాలలు ఉండకూడదనేది ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని వివరించారు. జీఓ 317 బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, జిల్లాల్లో ఖాళీల ఆధారంగా వారికి సొంత ప్రాంతాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యుడు ఏ.నర్సిరెడ్డి సూచించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతన క్రమబద్ధీకరణ చేయాలని, కనీస వేతనాన్ని రూ.25వేలకు పెంచాలని కోరారు. యూనివర్సిటీల్లో నియామకాలకు సంబంధించిన బోర్డు ఏర్పాటుకు సంబంధించిన బిల్లును గవర్నర్ త్వరితంగా ఆమోదించాలని, దీంతో నియామకాల ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. మైనార్టీ గురుకుల పాఠశాలలు నిర్దేశించిన లొకేషన్లలో కాకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారని, దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సంతృప్తికరంగా లేదని, తక్షణ చర్యలు తీసుకోవాలని మరో సభ్యుడు కె.జనార్దన్‌రెడ్డి కోరారు.

పాడి రైతుకూ ఉచిత కరెంట్ ఇవ్వాలి

వ్యవసాయానికి ఉచిత కరెంటు ఇస్తున్నట్లుగానే పాడి రైతులకూ ఉచిత కరెంటు ఇవ్వాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పాడి రైతులు



గడ్డికోత మెషీన్లు, ఇతరాలకు కరెంటును వినియోగిస్తుండగా... అధికారులు వాటికి చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో చాలాచోట్ల రైతాంగం కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతోందని, వాటిని అరికట్టేందుకు స్టెరిలైజేషన్ యూనిట్లను ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రభుత్వ రంగంలో 2,42,142 ఉద్యోగాలు కల్పించామని, ఇప్పుడు 80వేలకు పైగా ఉద్యోగ ఖాళీలను నోటిఫై చేసి భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్సీ కవిత వెల్లడించారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి కేంద్ర ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తోందని, ఈ అంశంపై నిలదీస్తే రాష్ట్రాలను బదనాం చేస్తోందని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ అన్నారు. తెలంగాణ ఎఫ్ఆర్‌బీఎం పరిధికి లోబడే వ్యవహరిస్తోందని, కానీ కేంద్రం మాత్రం పరిధులు దాటి దేశాన్ని అప్పులపాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఇప్పటివరకు రూ.54వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇక రైతుబంధు బడ్జెట్‌లో 40శాతానికిపైగా బీసీలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఇతర పద్దుల్లోనూ బీసీలకు సమ వాటా అందిస్తోందని ఆయన తెలిపారు.



స్పీకర్ పోచారానికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం. చిత్రంలో హరీశ్, వేముల, గుత్తా తదితరులు

అసెంబ్లీలో కంటివెలుగు శిబిరం

- మండలి చైర్మన్, స్పీకర్, పలువురు మంత్రుల హాజరు
- ఎంఐఎం ఎమ్మెల్యేలకు కంటి పరీక్షలు చేయించిన హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఆవరణలో కంటివెలుగు ప్రత్యేక శిబిరాన్ని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కంటివెలుగు పథకం దేశంలోనే మంచి కార్యక్రమం అని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ పథకాన్ని ప్రశంసించారని సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్న కంటివెలుగు కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగకరమని పోచారం అన్నారు. మెరుగైన, ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో లేని పేదలకు ఈ పథకం వరం లాంటిదన్నారు. కాగా, ఎంఐఎం శాసనసభ్యులను కంటివెలుగు ప్రత్యేక శిబిరం వద్దకు మంత్రి హరీశ్‌రావు స్వయంగా తోడ్కొని వెళ్లారు. అక్బరుద్దీన్ ఒవైసీ, పాషాఖాద్రి, ముంతాజ్‌ఖాన్‌లకు దగ్గరుండి కంటి పరీక్షలు చేయించారు. ఈ పథకం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని వారు చెప్పారు.

క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డిపై పీడీ యాక్ట్ పెట్టాలి

అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా ప్రగతి భవన్ పేల్చాలన్న వాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై పీడీ యాక్ట్ ప్రయోగించి జైల్లో పెట్టాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ,మండలి మీడియా పాయింట్‌ల్లో బుధవారం వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర డీజీపీతోపాటు పార్లమెంట్ స్పీకర్‌కు రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో రేవంత్ సంఘ విద్రోహ శక్తులు మాట్లాడే భాష మాట్లాడుతున్నారని ఆరోపించారు. పేల్చేయడం, కూల్చేయడమే కాంగ్రెస్ ఎజెండానా? దీనితో ప్రజలకు ఆయన ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వానికి దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

రేవంత్‌పై చర్యలు తీసుకోండి

డీజీపీకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి తన పాదయాత్రలో భాగంగా చేసిన వ్యాఖ్యలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు డీజీపీ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎల్.రమణ, శంభీపూర్ రాజు, తక్కెళ్లపల్లి రవీందర్, తాతా మధు, దండె విఠల్ డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డి మంగళవారం తన పాదయాత్రలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పరిపాలనా కార్యాలయాన్ని నక్సలైట్లు గ్రెనేడ్స్ పెట్టి పేల్చాలని కోరడం, కేసీఆర్‌పై వ్యాఖ్యలు చేయడాన్ని వారు ప్రస్తావించారు. చట్ట సభల్లో సభ్యుడిగా ఉండి అధికారిక భవనాలు కూల్చేయాలని కోరడం అంటే అది కచ్చితంగా అది చట్టవ్యతిరేకమైన చర్యగా భావించాలని వారు కోరారు. రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని పరిశీలించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఫిర్యాదు

ములుగు: ములుగులో జరిగిన సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రగతి భవన్‌ను నక్సలైట్లు కూల్చివేసినా తప్పులేదంటూ చేసిన వ్యాఖ్యలు నక్సలిజాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఉన్నాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎంపీ రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్కలపై కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. ములుగు ఎమ్మెల్యే మాజీ నక్సలైట్ కావడం నక్సలైట్లతో మధ్యవర్తిత్వం నడిపినట్లు అనుమానాలున్నాయని ఆ ఫిర్యాదులో తెలిపారు. సదరు వ్యక్తులపై కుట్ర కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ కోరారు. ఆయన వెంట ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయ్ రాంనాయక్, కోగిల మహేశ్ ఉన్నారు.

లోకేశ్ పాదయాత్రతో లాభం లేదు: జేసీ



సాక్షి, హైదరాబాద్: టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్రతో లాభం లేదని, ఆయనతో సహా రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేసినా, ఎవరు చేసినా లాభం లేదని ఏపీకి చెందిన మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాదయాత్రలకు కాలం చెల్లిందని, జనాలు పట్టించుకోవడం లేదని చెప్పారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఆయన సీఎల్పీ కార్యాలయానికి వచ్చారు. అప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఏపీకి చెందిన మాజీ మంత్రి శైలజానాథ్ ఉన్నారు. వారితో కొద్దిసేపు ముచ్చటించిన జేసీ.. ఆ తర్వాత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గతంలో పాదయాత్రలు వేరని, ఇప్పుడు వేరని, ఇప్పుడు అన్నీ డబ్బుతో కూడుకున్న యాత్రలేనని ఈ సందర్భంగా దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

'ధరణి'ని సవరించాలి

అసెంబ్లీ ముట్టడికి బీజేపీ కిసాన్‌సెల్ యత్నం.. అడ్డుకున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌లో లోపాలు సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి బీజేపీ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో చేసిన ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా తోపులాటలో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. నిరసనలు తెలిపే ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు, కిసాన్‌సెల్ నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. బుధవారం శాసనసభ వైపు వెళ్లేందుకు యత్నించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కిరణ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి తదితరులను అరెస్ట్ చేశారు. ధరణి పోర్టల్‌తో రైతుల భూములను కాజేసేందుకు బీఆర్‌ఎస్ నేతలు కుట్ర చేస్తున్నారని కిసాన్ మోర్చా నాయకులు ఆరోపించారు. అరెస్టయిన సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ధరణి పేరుతో సీఎం కేసీఆర్ రైతుల ఉసురు తీస్తున్నారని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్‌లో తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు చెప్పులరిగేలా తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాలకు బిచ్చగాళ్ల మాదిరిగా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాగా, కిసాన్ మోర్చా నాయకులు, రైతులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఖండించారు.



సాక్షి, హైదరాబాద్

జేబు దొంగలు (పిక్ పాకెటర్స్) ఇప్పుడు ట్రెండ్ మార్చారు. ఒకప్పుడు పర్సులు కొట్టే పిక్ పాకెటర్లు ఇప్పుడు సెల్ ఫోన్లు, ఇతర సొత్తును టార్గెట్‌గా చేసుకుని పక్కా ప్లానింగ్‌తో పని కానిచ్చేస్తున్నారు. ఆ..చిల్లర దొంగల్లే అనుకోకండి. అతి చిన్న నేరమైన పిక్ పాకెటింగ్‌పై ఆధారపడి హైదరాబాద్‌లో ఇప్పుడు అనేక వ్యవస్థీకృత ముఠాలు పని చేస్తున్నాయి. అయితే ఇవన్నీ పోలీసు రికార్డుల్లోకి ఎక్కవు. కానీ రాజధానిలో ఏటా జరుగుతున్న సాధారణ చోరీలు, దోపిడీలు, దొంగతనాల్లో చోరుల పాలవుతున్న సొత్తుకు సమానంగా జేబు దొంగలు గుల్ల చేస్తున్న మొత్తం ఉంటోందని అంచనా. అందుకే ఓ పక్క ఒంటరి నేరగాళ్లు పిక్ పాకెటింగ్‌లు చేస్తుండగా, మరో పక్క వ్యవస్థీకృత ముఠా నేరగాళ్లు ఈ చోరీలు చేయిస్తున్నారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు గతంలో చిక్కిన థండర్ సింగ్ కుష్వా అనే పిక్ పాకెటర్ చందానగర్‌లో నివసిస్తున్న ఫ్లాట్ అద్దె నెలకు రూ.30 వేలుగా తేలడం..విస్మయం కలిగించే అంశం. కాగా మహా నగరంలో వ్యవస్థీకృతంగా జరుగుతున్న పిక్ పాకెటింగ్స్‌లో ఏటా బాధితులు నష్టపోతున్నది రూ.30 కోట్లకు పైగా ఉంటుందని అనధికారిక అంచనా.

ఖాళీ పర్సులతో గిట్టుబాటు కాక..!

హైదరాబాద్‌లో పిక్ పాకెటింగ్ గ్యాంగ్‌లు ఏళ్లుగా పని చేస్తున్నాయి. మధ్య, పశ్చిమ, తూర్పు మండలాల్లోని అనేక ప్రాంతాలు వీరికి అడ్డాలుగా ఉన్నాయి. ఈ ముఠాలు ఒకప్పుడు కేవలం పర్సుల్ని మాత్రమే టార్గెట్ చేసేవి. ప్రతి నెలా మొదటి, రెండు వారాల్లో జీతం డబ్బుతో ఇళ్లకు వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకునేవి. అయితే ప్లాస్టిక్ కరెన్సీగా పిలిచే క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగం పెరిగిన తర్వాత పర్సుల్లో నగదు అంతగా లేకపోతుండటంతో వీరికి 'గిట్టుబాటు'కావట్లేదు. పర్సుల్లో దొరికిన కార్డుల్ని తీసుకువెళ్లి షాపింగ్ చేయడం, ఏటీఎం సెంటర్లలో నగదు డ్రా చేయడం ఓ పట్టాన కుదిరే పనికాదు. అందుకే ఇటీవల కాలంలో పర్సుల్ని వదిలేసి సెల్‌ఫోన్లపై పడ్డారు. చోరీ చేసిన ఫోన్ల ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ (ఐఎంఈఐ) నంబర్‌ను క్లోనింగ్ చేసి అమ్మడం ద్వారానో, రాష్ట్ర సరిహద్దుల్ని దాటించి విక్రయిస్తూనో, కొన్నాళ్లపాటు వినియోగించకుండా ఉంచేసి తర్వాత సొమ్ము చేసుకోవడమో చేస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం దొంగలకు అనుబంధంగా మరికొన్ని గ్యాంగ్స్ పని చేస్తుంటాయి. ఈ కారణంగానే చోరీకి గురైన ఫోన్లు సాంకేతికంగానూ ట్రాక్ కావట్లేదు.

ప్రత్యేక పారిభాషక పదాలు.. పక్కా ప్లానింగ్

పిక్ పాకెటింగ్ ముఠాలకు ప్రత్యేక పారిభాషిక పదాలు కూడా ఉన్నాయి. రద్దీగా ఉండే బస్సులు, ఆటోలు, మార్కెట్లను ఎంచుకునే ఈ గ్యాంగ్ సభ్యులు టార్గెట్‌ను అనుసరిస్తుంటారు. మొదట గ్యాంగ్‌లోని కొందరు సభ్యులు ఎంచుకున్న వ్యక్తి చుట్టూ చేరతారు. ఇలా చేరడాన్ని ఫీల్డింగ్ అని, వారిని 'ఆడి'అని పిలుస్తారు. వీరు సదరు వ్యక్తి చుట్టూ చేరి హడావుడి చేయడంతో పాటు గందరగోళ వాతావరణం, ఒత్తిడి కలిగిస్తారు. అదే అదనుగా మరో ముఠా సభ్యుడు తమ 'టార్గెట్'నుంచి సెల్‌ఫోన్, పర్సు లేదా సొత్తును చోరీ చేస్తాడు. ఇలా చేయడాన్ని స్ట్రైకింగ్ అని, అతడిని 'షాను'అని పిలుస్తుంటారు. కావాల్సింది చేతి కందగానే 'షాను'అక్కడ నుంచి ఉడాయించడమో, మరో వ్యక్తికి అందించి పంపేయడమో చేస్తాడు. బస్సుల్లో ఈ చోరీలు జరుగుతుంటే దాని వెనుకే వీరి ఆటో ఫాలో అవుతుంది. ఈ ముఠా సభ్యులు 'శిక్షణ' కూడా పొందుతారు. 'పని'కి ఉపక్రమించే ముందు అంతా ఓ చోట సమావేశమై చోరీ చేయాల్సిన విధానాన్ని చర్చిస్తారు. ఆ సమయంలో జరిగే పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులు, రద్దీ ప్రాంతాలు, వ్యాపార కేంద్రాలు తదితరాలను దృష్టిలో పెట్టుకుని వ్యూహ రచన చేస్తుంటారు. అంతా కలిసి ఒకేచోట కాకుండా జట్లుగా విడిపోయి 'పని'చేస్తుంటారు. ఈ ముఠాలో ఎవరైనా పోలీసులకు చిక్కితే గ్యాంగ్ లీడర్ న్యాయవాదిని ఏర్పాటు చేయడం, బెయిల్‌కు అవసరమైన ఖర్చులు భరించడం వంటివి చేస్తుంటాడు.

ఎక్కడా ఆధారాలు లేకుండా...

ఈ నేరంలో ఎంత మొత్తం పోయినా దానికి బాధితుడి వాంగ్మూలం తప్ప ఎలాంటి ఆధారం ఉండదు. పిక్ పాకెటర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ సీసీ కెమెరాలు వంటివి ఉన్న ప్రాంతాల్లో చేతివాటం చూపరు. షాపింగ్ మాల్స్ సహా మరికొన్ని చోట్లకు వెళ్లరు. చోరీకి పాల్పడిన వెంటనే సొమ్మును క్షణాల్లో జట్టులోని ప్రధాన వ్యక్తికి అందిస్తారు. అతడు వెంటనే అక్కడ నుంచి జారుకుంటాడు. ఒకవేళ బాధితుడు తన జేబును ఖాళీ చేసిన వ్యక్తిని పట్టుకున్నా ఫలితం ఉండదు. ఆధారాలేమీ చిక్కవు. సొమ్ము అందుకునే వ్యక్తి ముఠాకు సూత్రధారిగా వ్యవహరిస్తాడు. ఏదైనా ముఠా చిక్కినప్పుడు వారి వాంగ్మూలం ఆధారంగా కొలిక్కిరావాల్సిందే తప్ప ప్రత్యేక దర్యాప్తు అంటూ ఉండదు. అప్పటివరకు కేసు పెండింగ్ జాబితాలో ఉండిపోవాల్సిందే. అందుకే పోలీసులు సైతం ఈ ఫిర్యాదుల్ని పెద్దగా పట్టించుకోరు. కేసుగా నమోదు చేయడానికి అంగీకరించరు.

హద్దు 'దాటితే'అంతే..

ఒంటరిగా నేరాలు చేసే వారు ఎక్కడ పడితే అక్కడ చేసినా.. వ్యవస్థీకృత గ్యాంగులు నడిపించే వారు మాత్రం కొన్ని ప్రాంతాలు, బస్సులు, రూట్లు ఎంపిక చేసుకుంటారు. నిత్యం ఆయా ప్రాంతాల్లోనే తమ పంజాలు విసురుతుంటారు. గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కిన మన్సూర్, జహీర్, మొయిన్‌లు కేవలం చాంద్రాయణగుట్ట, సైదాబాద్ మధ్యే బస్సుల్లో చోరీలు చేశారు. ఒక ముఠా నేరాలు చేసే ప్రాంతంలోకి మరో ముఠా వస్తే సహించరు. ఎంతకైనా తెగిస్తారు. మొఘల్‌నగర్‌కు చెందిన జహీర్.. అక్రమ్ నేతృత్వంలో నడిచే గ్యాంగ్‌లో పని చేసి ఆపై సొంత ముఠా ఏర్పాటు చేసుకున్నాడు. వీరు లక్డీకాపూల్, నాంపల్లి, మెహదీపట్నం వంటి ప్రాంతాల్లో పంజా విసిరేవారు. అవే ఏరియాల్లో ఖైసర్ గ్యాంగ్ సైతం చోరీలు చేస్తుండటంతో వీరి మధ్య వైరం ఏర్పడింది. దీంతో ఖైసర్‌ను హత్య చేయడానికి జహీర్ కుట్రపన్ని పోలీసులకు చిక్కాడు. జేబు దొంగల ముఠాల మధ్య తరచు ఇలాంటి గ్యాంగ్ వార్‌లు, హత్యలు సైతం నగరంలో వెలుగు చూస్తున్నాయి.

ఈ ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాల్సిందే..

పిక్ పాకెటింగ్ కేసుల్లో పట్టుబడుతున్న వారిలో చాలావరకు మల్లేపల్లి, మాన్గార్‌బస్తీ, పాతబస్తీలోని వట్టేపల్లి, హసన్‌నగర్, ఫలక్‌నుమా, డబీర్‌పుర, తలాబ్‌కట్ట, షాహీన్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన వారే ఉంటున్నారని పోలీసులు గుర్తించారు. వీరు పంజా విసిరే వాటిల్లో ఐఎస్ సదన్, ఇమ్లిబన్, అఫ్జల్‌గంజ్, ఉస్మానియా ఆసుపత్రి, అబిడ్స్, కోఠి, సుల్తాన్ బజార్, బషీర్‌బాగ్, నిజాం కాలేజ్, ట్యాంక్ బండ్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, దిల్‌సుఖ్ నగర్, చిక్కడపల్లి, నాంపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, సికింద్రాబాద్‌లతో పాటు టూరిస్టుల్ని కొల్లగొట్టేందుకు అనువుగా ఉండే చార్మినార్, లాడ్‌బజార్, గుల్జార్‌హౌస్ తదితర ప్రాంతాలు ఎక్కువగా ఉంటున్నాయి. వీరితో కొందరు అవినీతి పోలీసులు కుమ్మక్కవుతుండటం గమనార్హం. పిక్ పాకెటింగ్ గ్యాంగ్స్‌ను నిర్వహిస్తూ కానిస్టేబుల్ ఒకరు నల్లగొండ పోలీసులకు చిక్కడం ఇందుకు నిదర్శనం. మరికొందరు పోలీసుల పైనా ఈ 'మిలాఖత్'ఆరోపణలు ఉన్నాయి.

ప్రగతిభవన్ గేట్లు బద్దలు కొట్టాలి

- పునాదులతో సహా కూల్చేయాలి
- మానుకోట జోడో యాత్రలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి, మహబూబాబాద్: 'రాష్ట్రంలోని నాలుకోట్ల మంది ప్రజలు రక్తమాంసాలు కరిగించి, శ్రమించి పన్నులు చెల్లిస్తే రూ.2వేల కోట్లతో ప్రగతిభవన్ కట్టారు. దీనిలోకి రైతులు, కూలీలు, ఉద్యమకారులు, విద్యార్థులు, చివరకు ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులకు కూడా ప్రవేశం లేదు. ప్రజలకు ఉపయోగపడని ఆ భవనం గేట్లు బద్దలు కొట్టాలి. పునాదులతో సహా కూల్చేయాలి. ప్రజల సమస్యలను వినే భవన్ కావాలి..' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్ర బుధవారం మహబూబాబాద్ జిల్లాలో సాగింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో, బహిరంగ సభలో మాట్లాడారు.

తెలంగాణ ద్రోహుల కేంద్రంగా ప్రగతిభవన్

'గతంలో పనిచేసిన సీఎంలు వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబుల కార్యాలయాలు ప్రజల సమస్యలు, వినతులు తీసుకునే విధంగా ఉండేవి. కానీ ఇప్పుడు తెలంగాణ ద్రోహులు, దగాకోర్లు, మాఫియా, చీకటి ఒప్పందాలకు కేంద్రంగా ప్రగతిభవన్ ఉంది. 1969లో తెలంగాణ ఉద్యమం మొదలైంది. 2014లో రాష్ట్రాన్ని సాధించింది. ఇప్పుడు 2023లో తెలంగాణలో నియంత పాలన అంతానికి మరో ఉద్యమం వచ్చింది. నాటి ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్‌ను వంద మీటర్ల లోతుకు పాతేందుకు కాంగ్రెస్ దండు కదలాలి..' అని రేవంత్ పిలుపునిచ్చారు.

కేసీఆర్‌పై కూడా కేసు పెట్టాలి

'ప్రగతిభవన్‌ను నేలమట్టం చేయాలని చెప్పినందుకు తనపై కేసు పెట్టాలని పోలీసులను ఆశ్రయించిన దద్దమ్మ నాయకులు గతాన్ని తెలుసుకోవాలి. నక్సలైట్ల ఎజెండానే మా ఎజెండా అని టీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన కేసీఆర్‌పై కూడా కేసు పెట్టాలి. చట్టం అందరికీ సమానమే. నాకో నీతి.. కేసీఆర్‌కో నీతా?..' అని ప్రశ్నించారు.

ప్రజలు చెప్పిందే మేనిఫెస్టోలో..

'గతంలో మాదిరిగా ఈసారి కాంగ్రెస్ టికెట్ల కేటాయింపులో ఉత్కంఠ ఉండదు. ఇప్పటికే 50 శాతం అభ్యర్థుల జాబితా తయారు చేశాం. ఇతర పార్టీల నాయకులు తమకు నచ్చింది ఎన్నికల మేనిఫెస్టోలో పెడతారు. మేం మాత్రం ప్రజలు చెప్పిందే పెడతాం. వారి సమస్యలు తీర్చేలా మేనిఫెస్టో ఉంటుంది. పోడు భూములకు పట్టాలు, పేదలకు ఇళ్లు, పంటలకు గిట్టుబాటు ధర, 317 జీఓ సవరణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తాం. అమరవీరుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులు కేటాయిస్తాం..' అని రేవంత్ చెప్పారు.



పాదయాత్రలో బస్సు డ్రైవర్‌తో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

మానుకోటలో దుశ్శాసన పాలన

'మానుకోట ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఒక రాక్షసుడు. దుశ్శాసన పాలన చేస్తున్నాడు. కలెక్టర్‌ను అవమానపర్చడం, పేదలకు అన్యాయం చేయడంలో ఆయనకు ఆయనే సాటి. ఒక వైపు ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మరోవైపు ఎంపీ కవిత వందల ఎకరాలు పంచుకుంటున్నారు..' అని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సీతక్క, మల్లురవి, సుదర్శన్‌రెడ్డి, బలరాం నాయక్, బెల్లయ్య నాయక్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇలావుండగా మహబూబాబాద్ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో 'జై బీఆర్‌ఎస్, జై శంకరన్న' అంటూ నినాదాలు చేసిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని తర్వాత వదిలేశారు. వారు రేవంత్‌పై చెప్పులు విసిరేసేందుకు యత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నారనే ప్రచారం జరిగినా, అలాంటిదేమీ లేదని పోలీసులు అన్నారు.

రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్‌కు ముప్పు

ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ నాశనం: ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డిని నియమించుకోవడంతో కాంగ్రెస్ పార్టీకి ముప్పు ఏర్పడిందని, ఆయన ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ నాశనమవుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డిని తెలంగాణ ప్రజలు ఐటెమ్ సాంగ్‌లా చూస్తారని, ఆయన వెంట పాదయాత్రలో కిరాయి మనుషులు తప్ప కాంగ్రెస్ నేతలు ఎవరూ లేరన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, ఆరూరి రమేశ్, నన్నపునేని నరేందర్‌తో కలిసి బుధవారం అసెంబ్లీలోని బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి బ్రోకర్, జోకర్, బ్లాక్‌మెయిలర్ అని వ్యాఖ్యానించారు. ప్రగతిభవన్‌ను నక్సలైట్లు గ్రెనేడ్లతో పేల్చి వేయాలంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎర్రబెల్లి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో మంత్రి సత్యవతి రాథోడ్

స్థాయిలేని వ్యక్తికి పీసీసీ పదవి..

స్థాయిలేని వ్యక్తికి పీసీసీ పదవి ఇచ్చారని రేవంత్ తన మాటలతో రుజువు చేసుకున్నారని, రేవంత్ నక్సలైట్ల భుజం మీద తుపాకీ పెట్టి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవాలని చూస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రేవంత్ తన వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పకపోతే ఆయన పాదయాత్ర మానుకోట దాటదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి పీడీ యాక్ట్ పెట్టాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు.



పార్లమెంట్ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్, ఆప్, శివసేన ఎంపీలు

హిండెన్‌బర్గ్ నివేదికపై నోరు విప్పాలి

- అదానీ అంశంపై ప్రధాని మోదీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నిరసన
- పార్లమెంట్ గాంధీ విగ్రహం వద్ద ఆప్, శివసేనతో కలిసి ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ చేత విచారించాలన్న డిమాండ్‌తో ఆప్, శివసేనతో కలసి బీఆర్‌ఎస్ పార్టీ బుధవారం సైతం తమ నిరసనను కొనసాగించింది. సభా కార్యక్రమాల ప్రారంభానికి ముందు బీఆర్‌ఎస్ సభాపక్ష నేతలు కె.కేశవరావు, నామా నాగేశ్వర్‌రావులతో కలసి మిగతా ఎంపీలు గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. హిండెన్‌బర్గ్ నివేదికపై ప్రధాని నరేంద్ర మోదీ నోరు విప్పాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అదానీ షేర్ల పతనంతో ప్రజల పొదుపు సొమ్ము ప్రమాదంలో పడిందన్నారు. ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ బ్యాంకులపై పడే ప్రభావంపై కేంద్రం సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్రం దీనిపై దాటవేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. అనంతరం ఎంపీలు నామా, కేకేలు ఉభయసభల్లో ఇదే అంశంపై వాయిదా తీర్మానాలు ఇచ్చినా వాటిని సభాధ్యక్షుడు తిరస్కరించారు. దీంతో ఉభయ సభల నుంచి ఎంపీలు వాకౌట్ చేశారు. కాగా, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఇచ్చేందుకు ప్రధాని మోదీ సిద్ధమవుతుండగా సభలో ఉన్న ఎంపీ నామా అదానీ అంశాన్ని లేవనెత్తారు. అదానీ అంశంపై జేపీసీ వేయాలని పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా కల్పించుకుని 'మీరు ఇదివరకే వాకౌట్ చేశారు కదా?'అని ప్రశ్నించగా...మోదీ సమక్షంలో మరోమారు తమ డిమాండ్ వినిపించేందుకే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నామని చెబుతూ వాకౌట్ చేశారు.

దద్దరిల్లిన జంతర్‌మంతర్

- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా
- ధర్నాలో పాల్గొన్న ఎంపీలు ఆర్.కృష్ణయ్య, కేకే

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాతో ఢిల్లీలోని జంతర్‌మంతర్ దద్దరిల్లింది. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ. 2 వేల కోట్లు కేటాయించి అన్యాయం చేశారని నిరసిస్తూ బీసీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సంఘ కన్వీనర్ లాల్ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ నరేశ్, రాజ్‌కుమార్, ఢిల్లీ అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ నాయకత్వం వహించిన మహాధర్నాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీఆర్‌ఎస్ ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్ పాల్గొని ప్రసంగించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి హాజరైన జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మహాధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తూ, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. బీసీలకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ.. రాజకీయ రిజర్వేషన్లు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించి బీసీలను విస్మరించారని మండిపడ్డారు. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం 22 మంది మాత్రమే బీసీ ఎమ్మెల్యేలు ఉన్నారని.. రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను 20 జిల్లాల నుంచి ఒక్క బీసీ ఎమ్మెల్యే కూడా లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో 129 బీసీ కులాలకుగాను 120 కులాలు ఇంతవరకు అసెంబ్లీ గడప తొక్కలేదన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 175 మంది ఎమ్మెల్యేల్లో 38 మంది బీసీ ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఈ దేశంలో బీసీలను బిచ్చగాళ్లను చేశారని ఆర్.కృష్ణయ్య విమర్శించారు. గత 35 సంవత్సరాల్లో 70సార్లు పార్లమెంటు వద్ద ధర్నాలు– ప్రదర్శనలు నిర్వహించామని... శాంతియుతంగా ఉద్యమిస్తే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.



జంతర్‌మంతర్ వద్ద మహాధర్నాలో పాల్గొన్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

ప్రత్యేక మంత్రిత్వ శాఖ కావాలి: కేకే

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు డిమాండ్ చేశారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉంటే పథకాలు వేగంగా అమలు జరుగుతాయని అన్నారు. ఈ విషయమై పార్లమెంటులో ప్రస్తావించి పోరాటం కొనసాగిస్తామని కేకే తెలిపారు. బీసీ జనాభా లెక్కించాలన్న డిమాండ్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్‌ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. తెలంగాణను చూసి కేంద్ర ప్రభుత్వం నేర్చుకోవాలని లింగయ్య యాదవ్ అన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు.. హైదరాబాద్ ఆడిటర్ గోరంట్ల అరెస్ట్



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో హైదరాబాద్‌కు చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబుని సీబీఐ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో విచారణ నిమిత్తం గోరంట్లను ఢిల్లీకి పిలిపించిన సీబీఐ అధికారులు మంగళవారం సాయంత్రం ఆయనని అదుపులోనికి తీసుకున్నారు. బుచ్చిబాబు విచారణకు సహకరించడంలేదని, అడిగిన ప్రశ్నలకు దాటవేత ధోరణిని ప్రదర్శిస్తూ ఉండడంతో అరెస్ట్ చేసినట్టుగా బుధవారం సీబీఐ అధికారులు తెలిపారు. ఢిల్లీ కొత్త మద్యం విధానం 2021–22 రూపకల్పనలో గోరంట్ల బుచ్చిబాబు పాత్ర ఉందని హైదరాబాద్‌కు చెందిన పలు సంస్థలకు లబ్ధి చేకూరేలా ఆయన వ్యవహరించారని సీబీఐ ఆరోపిస్తోంది. ప్రత్యేక కోర్టులో ఆయనని హాజరుపరచగా న్యాయస్థానం ఈ నెల 11 వరకు కస్టడీకి అప్పగించింది. బుచ్చిబాబుని సీబీఐ గతేడాది ఆగస్టు, అక్టోబర్ మధ్య కాలంలో 15 సార్లు విచారించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు కూడా విచారణ జరిపింది.

ఉపాధి హామీ అమల్లో తెలంగాణ టాప్

అందుకనే కేంద్రం అక్కసు చూపిస్తోంది.. రాష్ట్ర మంత్రుల ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ పథకాన్ని అత్యధికంగా తెలంగాణ ఉపయోగించుకుంటుందన్న అక్కసు కేంద్రానికి ఉందని రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి విమర్శించారు. అందుకే అనేక నిబంధనలు పెట్టి నిధులు ఆపే కుట్ర చేస్తోందని ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ కమిటీ హాలులో పీఆర్ మంత్రి ఎర్రబెల్లి అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 8వ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉపాధి హామీలో 10.66 కోట్ల పనిదినాలు పూర్తి చేశామని, మళ్లీ పనిదినాలు కావాలని అడిగితే కేంద్రం అనేక షరతులు పెట్టి 11 కోట్ల పనిదినాలు కల్పించిందన్నారు. ఎన్ని షరతులు పెట్టినా వాటన్నింటిని పాటిస్తూ కూలీలకు పనిదినాలు కల్పిస్తున్నామన్నారు. 12 కోట్ల పనిదినాలు కల్పించే లక్ష్యంతో కేంద్రాన్ని మరిన్ని పనిదినాలు కావాలని కోరినట్లు తెలిపారు.

తెలంగాణలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయలేం

బీఆర్‌ఎస్ ఎంపీల ప్రశ్నకు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కుల పథకం (ఎస్ఐటీపీ) మార్గదర్శకాల ప్రకారం మంజూరు చేయలేమని కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోశ్ తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని పోచంపల్లిలో తెలంగాణ రాష్ట్రానికి ఐఐహెచ్‌టీని మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం 2017లో అభ్యర్థించిందని వెల్లడించారు. అయితే పోచంపల్లి చేనేత పార్కును ఉత్పత్తి కార్యకలాపాల కోసం ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కుల పథకం (ఎస్ఐటీపీ) కింద మంజూరు చేసినట్లు 2017లోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించిందన్నారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో శిక్షణా కేంద్రం కూడా మంజూరు చేశామని చెప్పారు. కాగా, ప్రస్తుతం దేశంలో కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఆరు చోట్ల, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో వెంకటగిరి సహా నాలుగు చోట్ల ఐఐహెచ్‌టీ ఉన్నాయన్నారు. దేశంలో నూతనంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ టెక్నాలజీ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని బీఆర్‌ఎస్ ఎంపీలు మాలోత్ కవిత, రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానంలో స్పష్టంచేశారు.



ఎవరు ఇతరులకు సంతోషాన్ని కల్పిస్తారో, వాళ్ల దగ్గరికి సంతోషం వస్తుంది.
- జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, ఫిబ్రవరి, 9

గాలిబుడగల నిఘానేత్రాలు

గాలిబుడగలు సైతం గందరగోళం సృష్టించి, దేశాల మధ్య సంబంధాల్లో ఊహించని మార్పులు తీసుకువస్తాయని ఇటీవలి పరిణామాలు తేటతెల్లం చేశాయి. చైనా దేశపు నిఘా నేత్రంగా అనుమానిస్తున్న భారీ బెలూన్ తన గగనతలంలో తిరగడం గమనించిన అమెరికా ఫిబ్రవరి 4న దాన్ని వివిధ యుద్ధ విమానాలతో చుట్టుముట్టి, క్షిపణి ప్రయోగంతో వ్యూహాత్మకంగా తన ప్రాదేశిక సముద్ర జలాలపై పేల్చివేసిన వైనం అంతర్జాతీయంగా ఒక సంచలనం. అంతకు మించి గత నవంబర్‌లో జీ–20 దేశాల బాలీ సదస్సు వేళ షీ జిన్‌పింగ్, బైడెన్‌ల భేటీతో ఇప్పుడిప్పుడే మెరుగవుతున్నాయని ఆశిస్తున్న చైనా – అమెరికా దౌత్య సంబంధాల్లో ఇది పెద్ద కుదుపు. డ్రాగన్ దొంగ ఎత్తులపై మిగతా ప్రపంచ దేశాలన్నిటికీ ఓ మేలుకొలుపు. చైనా సహా కట్టిదుటి ముప్పును గమనించిన ఏ సార్వభౌమ దేశమైనా చేసే పనినే అమెరికా చేసింది కాబట్టి తప్పు పట్టలేం. నిజానికి, చైనా గాలిబుడగ అనుమానాస్పదంగా కొద్ది రోజులుగా పయనిస్తోంది. కెనడా మీదుగా మోంటానా రాష్ట్రంలోకి ప్రవేశించింది. అమెరికా అణ్వస్త్ర క్షిపణి ప్రయోగ క్షేత్రాలు మూడింటిలో ఒకటి అక్కడే ఉంది. సైనిక, వ్యూహాత్మక స్థలాలను కనిపెట్టడానికి చైనా దీన్ని సాధనంగా వాడుతోందని భావించిన అమెరికా, అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశంతో అదను చూసి పేల్చేసింది. గతంలో అధ్యక్షుడు ట్రంప్ హయాంలోనూ ఈ గాలిబుడగల మూడో కన్ను పలుచోట్ల అగ్రరాజ్యపు వినువీధుల్లో విహరించింది. తెంపరిగా పేరున్న ట్రంప్ వాటిపై చర్యకు అప్పుడు తెగించలేదు. ఇప్పుడు దేశీయంగా అనేక ఒత్తిళ్ళలో ఉన్న బైడెన్ మటుకు 3 స్కూల్ బస్సుల పరిమాణంలోని ఆ గాలిబుడగను పేల్చేశారు.

మొదట అనిష్టంగా ఉన్నా, ఆఖరికి అది తమ బెలూనే అని చైనా విదేశాంగ శాఖ ఒప్పుకుంది. కాకపోతే, దాన్ని గూఢచరానికి వాడుతున్నామన్న వాదనను మాత్రం తోసిపుచ్చింది. అది వాతావరణ పరిశోధనకు వాడే పౌర వైమానిక నౌక అనీ, దారితప్పి పొరపాటున అటు వచ్చిందనీ బుకాయించింది. విచారం వ్యక్తం చేసింది. నమ్మలేని ఆ మాటలు అటుంచితే, డ్రాగన్ ఇలా నిఘా బెలూన్లను వాడినట్టు తైవాన్, 2020, 2021ల్లో జపాన్ లాంటి దేశాల నుంచి గతంలోనూ ఆరోపణలొచ్చాయి. భారత్‌పైనా ఇలాంటి ప్రయోగాలే సాగాయి. అవి చైనావేనన్న అధికారిక సాక్ష్యాధారాలు దొరక్కపోతేనేం... గత ఏడాది జనవరిలో అండమాన్, నికోబార్ దీవులపై గాలిబుడగలు తిరిగాయి. నిఘా ఉపగ్రహాలతో పోలిస్తే ఇవి చౌకే కాదు, లక్షిత భూ ఉపరితలానికి దగ్గరగా వెళ్ళి మరింత స్పష్టమైన ఛాయాచిత్రాలు తీయగలవు.

సాధారణంగా వాణిజ్య విమానాలు ప్రయాణించే మార్గం కన్నా రెట్టింపు ఎత్తు దాటి, 80 వేల నుంచి లక్షా 20 వేల అడుగుల ఎత్తున నిఘా సాధనాలతో ఈ నిఘా బెలూన్లు వెళుతుంటాయి. కీలక సమాచారాన్ని సేకరించడానికీ, ఇతర సైనిక కార్యకలాపాలు నిర్వహించడానికీ వీటిని వినియోగిస్తుంటారు. ఈ బెలూన్లలో సౌరవిద్యుత్‌తో నడిచే కెమెరా, రాడార్ లాంటివి ఉంటాయి. గాలి వీచే దిశ, వేగాన్ని బట్టి ఎంత ఎత్తులో ప్రయాణించాలనేది ఎప్పటికప్పుడు మారుస్తూ బెలూన్లను లక్షిత ప్రాంతానికి చేరేలా మార్గదర్శనం చేస్తారు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో చౌకగా గూఢచర్యం నిర్వహించే విధానంగా అమెరికా, సోవియట్ యూనియన్లు ఈ నిఘా గాలిబుడగల పద్ధతిని వాడాయి. ఇటీవల సైతం ఇలాంటి చైనా నిఘా బుడగలు అనేకం ప్రపంచపు పెద్దన్న వియత్తలంలో విహారం సాగించాయి. అయితే, తాజా బెలూన్ దీర్ఘకాలంగా అక్కడక్కడే తిరుగుతుండడంతో, పేల్చివేతకు గురైంది.

తప్పు చేసినా సరే తననెందుకు తప్పుపడుతున్నారన్నట్టుంది చైనా వైఖరి. అమెరికా గగనతలంపైనే అయినా, తమ బెలూన్‌ను పేల్చినందుకు సదరు అగ్రరాజ్యం ఇంతకింత ఫలితం అనుభవిస్తుందని బెదిరిస్తోంది. ఈ ఘటనతో అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ ఈ 6న జరగాల్సిన తన చైనా పర్యటనను రద్దు చేసుకున్నారు. గత కొన్నేళ్ళలో ఒక ఉన్నత స్థాయి అమెరికా దౌత్యవేత్త చైనాకు వెళ్ళడం ఇదే తొలిసారి. తీరా అదీ రద్దయింది. పర్యటనపై ఇరుపక్షాలూ ప్రణాళిక ఏదీ వేసుకోలేదని బీజింగ్ బింకంగా చెబుతోంది కానీ, జరగాల్సిన దౌత్యనష్టం జరిగిపోయింది. స్నేహానికి చేయి చాస్తూనే, చాటున చేయదలుచుకున్నది చేసేయడంలో చైనా జగత్ కిలాడీ అని మళ్ళీ బుజువైంది.

ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని తాము గౌరవిస్తామంటూ తాజా ఘటన అనంతరమూ చైనా ప్రకటించింది. కానీ, డ్రాగన్ గత చరిత్ర, నేటికీ మారని నైజం తెలిసినవారెవరూ ఆ మాటలను విశ్వసించలేరు. భారత్ సహా తన అగ్రరాజ్య హోదాకు అడ్డనుకున్న ప్రతి దేశంతో సున్నం పెట్టుకోవడం, తైవాన్ లాంటివి తనవేనంటూ దాడులకు దిగడం చైనాకు నిత్యం అలవాటే. అమెరికా లాగా తానూ ప్రపంచ పోలీసు పాత్ర పోషించాలనే తహతహ చైనాలో చిరకాలంగా కనపడుతున్నదే. ఆ దుగ్ధ లేకపోతే ఇలాంటి నిఘా నేత్రాల పనేమిటి? ఆర్థికంగా, సైనికంగా ప్రపంచంలో ఎంత బలమైన శక్తి రాజ్యమైనప్పటికీ, చైనా తన హద్దులు దాటి పరాయిగడ్డపై తన బెలూన్లను తిప్పాలనుకుంటే అది ఉపేక్షనీయం కాదు. ప్రపంచం అందుకు మౌనంగా అనుమతించాలనీ, అంగీకరించాలనీ బీజింగ్ కోరుకుంటే అంతకన్నా హాస్యాస్పదం లేదు. నిఘా సహా అనేక అంశాల్లో చైనా పాలకుల ఎలుక తోలు నైజం తెలిసిందే కాబట్టి, భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి నక్కజిత్తులను సహించేది లేదని మాటల్లోనూ, చేతల్లోనూ చూపాలి. ఎందుకంటే, సమయానికి ముకుతాడు వేయకుంటే డ్రాగన్ దూకుడు ఆగదని అమెరికా సహా అందరికీ తెలిసిందే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.చవితి తె.5.24 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తర రా.8.34 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** తె.5.24 నుండి 7.04 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.10.22 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.39 వరకు, **అమృతఘడియలు:** ప.12.54 నుండి 2.32 వరకు.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం: 5.54
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

చదువుతో జాతీయ భద్రతకు లంకె?

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

గ్రామీణ భారత్‌లో 3–16 సంవత్సరాల వారి చదువుల మీద వెలువడిన 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు –2022' (ఏఎస్ఈఆర్) ఒక విలువైన నివేదిక. 6–14 సంవత్సరాల మధ్య వయసు విద్యార్థులలో 98.4 శాతం మంది పాఠశాలల్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారన్న వాస్తవం ప్రశంసకు అర్హమైనది. అయితే విద్యావంతులైన యువత మాత్రమే సమ్మిళితమైన జాతీయ భద్రతా ఇమేజీని ప్రకాశవంతం చేయగలదు. ఏ అగ్ర రాజ్యమైనా సాంకేతికపరమైన వ్యక్తిత్వం సాధించడానికి అత్యున్నత నాణ్యతతో కూడిన జాతీయ విద్యా విధానం మాత్రమే వీలు కల్పిస్తుంది. ఉనికిలో ఉన్న విద్యావిధానం సాంకేతికంగా సన్నద్ధుడైన సైనికుడి స్వభావానికి ఆచరణీయమైన వ్యవస్థగా ఉంటుందా అనేది పరిశీలనాంశం.

గ్రామీణ భారత్‌లో 3–16 సంవత్సరాల వయో బృందపు విద్యా పరిస్థితిపై సర్వే చేసిన 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు –2022' (ఏఎస్ఈఆర్)ను ఒక విలువైన డాక్యుమెంట్‌గా పేర్కొనాలి. ప్రభుత్వేతర సంస్థ అయిన ప్రథమ్ ఫౌండేషన్ కు నిజంగానే కృతజ్ఞత చెప్పాలి.ఎందుకంటే ఇది విద్యా రంగంలో అసాధారణ సేవను అందిస్తున్న సంస్థ. జాతీయ సర్వేల శుష్కత్వం, విశ్వసనీయమైన హెచ్‌డీఐ (మానవాభివృద్ధి సూచిక) గణాంకాల దృష్ట్యా చూస్తే, ఈ సమగ్రమైన నివేదికను రూపొందించడంలో ప్రథమ్ ఫౌండేషన్ కీలకపాత్ర పోషించింది. ఏఎస్ఈఆర్ సర్వేను చివరిసారిగా 2018లో నిర్వహించారు. కోవిడ్ సంవత్సరాలు కలిగించిన అంతరాన్ని ఈ తాజా నివేదికతో పూరించినట్లయింది.



3–16 సంవత్సరాల వయో బృందంలోని దాదాపు 7 లక్షల మంది పిల్లలను పరిశీలిస్తూ, దేశవ్యాప్తంగా 616 జిల్లాలలో నిర్వహించిన సమగ్ర గృహ సర్వే నుంచి ఏఎస్ఈఆర్–2022 నివేదిక రూపొందింది. వరుస క్రమంలో అమర్చనప్పటికీ, కొంత డేటాను ప్రాథమికంగా విశ్లేషణ చేయడం ద్వారా, జాతీయ భద్రత అల్లికకు సంబంధించిన కొన్ని లంకెలను ఇది అందించింది. పైగా వస్తుగత పాలసీ సమీక్ష, చర్చకు ఇది హామీ ఇచ్చింది.

నమోదు పెరిగింది

ఈ రిపోర్టులోని పరిమాణాత్మక బుల్లెట్ పాయింట్లు ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయి. 6–14 సంవత్సరాల వయసున్న విద్యార్థులలో దాదాపు 98.4 శాతం మంది గ్రామీణ భారత్‌లోని పాఠశాలల్లో ఇప్పుడు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్న వాస్తవం నిజంగా ప్రశంసకు అర్హమైనది. ఈ ధోరణి సానుకూలమైనది. 2010 లోని 96.6 శాతంతో పోలిస్తే, 2014లో అది 96.7 శాతానికి పెరిగింది. 2018లో 97.2 శాతం నుంచి 2022లో 98.4 శాతానికి చేరడం అంటే విద్యార్థుల నమోదులో సత్వర పెరుగుదలనే ఇది సూచిస్తోంది.

అయితే యువ భారతానికి సంబంధించి ఏఎస్ఈఆర్–2022 లోని గుణాత్మక అంశం ప్రగాఢ ఆందోళనకు కారణమవుతుంది. ఇది బయట పెట్టిన విషయాలు ఉద్వేగభరితమైన జాతీయవాదం, తప్పుడు ధ్రువీకరణల మిశ్రమంతో దూకుడు ప్రదర్శిస్తూ, ఇప్పుడు తనను తాను విశ్వగురువుగా చెప్పుకొంటున్న దేశానికి అసంగతంగా కనిపిస్తాయి.

భారతదేశంలో విద్య రాష్ట్రాలకు చెందిన అంశంగా ఉంటున్నందున పిల్లలు నేర్చుకునే నైపుణ్యాలు వివిధ రకాలుగా ఉంటాయి. ఈ విషయంలో ఒక ఆసక్తి కలిగించే అంశం మహారాష్ట్రకు సంబంధించినది. తలసరి ఆదాయం, మానవ భద్రతా సూచికల రీత్యా అత్యంత పురోగామి రాష్ట్రాల్లో ఇదొకటి.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో గణిత శాస్త్ర నైపుణ్యాలు ప్రమాదకర స్థాయిలో తగ్గిపోతున్నాయని ఈ నివేదిక పేర్కొంది. 2018లో 3వ తరగతిలోని 28 శాతం మంది పిల్లలు మాత్రమే తీసివేతలను చేయగలిగారనీ; 5వ తరగతిలో 31 శాతం పిల్లలు, 8వ తరగతిలోని 41 శాతం పిల్లలు భాగహారాన్ని సంతృప్తికరంగా చేయగలిగారనీ తెలిపింది. అదే 2022లో 3వ తరగతిలో 18.5 శాతం, అయిదో తరగతి పిల్లల్లో 20 శాతం, 8వ తరగతిలో 38 శాతం మంది మాత్రమే వీటిని చేయగలిగారని నివేదిక పేర్కొంది.

ఒక రాష్ట్రం (మహారాష్ట్ర)లో ఈ పతనానికి అనేక అంశాలు కారణం కావచ్చు. బోధనా పద్ధతుల్లో, పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సామర్థ్యాలకు సంబంధించి కోవిడ్ మహమ్మారి కలిగించిన అంతరాయం దీనికి కారణం కావచ్చు. అయితే మరొక వర్గపు డేటా స్ఫూర్తిదాయకం కావచ్చు. ఈ నివేదిక భారతదేశ స్థాయిలో ప్రైవేట్ విద్యాసంస్థల్లోని ధోరణిని ఎత్తిచూపింది. అలాంటి ఎంపిక చేసుకున్న విద్యార్థుల శాతం 26.4 నుంచి 2022లో 30.5 శాతానికి పెరిగింది. ఈ జాబితాలో బిహార్ 71.7 శాతంతో అగ్రస్థానంలో ఉంది. అయితే ప్రైవేట్ చదువులో ఈ పెరుగుదలకు గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, త్రిపుర రాష్ట్రాలు మాత్రం మినహాయింపుగా ఉన్నాయి.

యుద్ధాల తీరు మారుతోంది

భారత్‌లో మొత్తం విద్యాపరమైన సూచిక, జాతీయ భద్రత మధ్య లంకెను రెండు మార్గాలలో సమీక్షించవచ్చు. జనవరి 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్రివిధ దళాలకు చెందిన అగ్నివీర్‌ల తొలి బ్యాచ్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. కొత్త నియామక పథకం ద్వారా మార్గదర్శకులు అవుతున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. 21వ శతాబ్దిలో జరుగుతున్న యుద్ధాల తీరు మారిపోతోందనీ, సాంకేతికంగా ముందంజలో ఉన్న సైనికులు మన సాయుధ బలగాల్లో కీలక పాత్ర పోషిస్తారనీ చెప్పారు.

ఏఎస్ఈఆర్– 2022 అంచనా ప్రకారం, ఉనికిలో ఉన్న విద్యావ్యవస్థ ప్రధాని మోదీ పేర్కొన్నట్లుగా, సాంకేతికంగా సన్నద్ధుడైన సైనికుడి తరహా స్వభావానికి అత్యంత ఆచరణీయమైన ఎకో సిస్టమ్‌గా ఉంటుందా అనేది పరిశీలనాంశం. అన్ని స్థాయుల్లో భారతీయ సైన్యంలో రిక్రూట్ కావడం అనేది తీవ్రమైన పోటీతో కూడి ఉంటుంది. ఉత్తమమైన, చురుకైన అర్హత కలిగిన వారే యూనిఫామ్ ధరించగలరు. రాబోయే దశాబ్దాల్లో, విద్యావంతులైన యువత మాత్రమే సమ్మిళితమైన జాతీయ భద్రతా ఇమేజీని ప్రకాశవంతం చేయగలదు. దీనికి వ్యతిరేకమైనది ఏమిటంటే, పెరుగుతున్న అవిద్యావంతులైన యువత శాతం; వీరు ఉత్పాదక భారత్ ఆకాంక్షను వెనక్కు లాగడమే. ఇది దేశంలో అంతర్గత భద్రతాపరమైన చిక్కులను కొనితేగలదు. నిరుద్యోగం, నిరాశా నిస్పృహలకు గురైన అఖిల భారత జనాభా సమూహం కచ్చితంగా అత్యంత ప్రమాదకర పరిస్థితిని తెచ్చిపెట్టగలదు.

పరిశోధనా పత్రాల్లో చైనా టాప్

విద్యను జాతీయ భద్రతతో అనుసంధానించే రెండో మార్గం భారతీయ విధాన నిర్ణేతలకు సముచితమైనదిగా ఉంటుందని అమెరికాలోని ఒహాయో స్టేట్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్త కరోలిన్ వాగ్నర్ చేసిన సర్వే ద్వారా అర్థమవుతుంది. 2019లో ఆమె వెల్లడించిన సర్వే ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన 8,422 శాస్త్రీయ పత్రాలను చైనా ప్రచురించింది. కాగా తర్వాతి స్థానంలో అమెరికా 7,959 పత్రాలు, యూరోపియన్ యూనియన్ 6,074 శాస్త్రీయ పత్రాలను ప్రచురించాయి. ఇక 2022లో కృత్రిమ మేధపై అమెరికా పరిశోధకుల కంటే మూడు రెట్లు అధికంగా శాస్త్రీయ పత్రాలను చైనా పరిశోధకులు ప్రచురించారని వాగ్నర్ అధ్యయనం తెలిపింది. పరిశోధన ఎంత నాణ్యతతో జరుగుతున్నదో తేల్చడానికి ఉపకరించే ఉటంకింపుల దృష్ట్యా చూసినా కూడా– అనేక శాస్త్ర సాంకేతిక విభాగాల్లో ప్రచురించిన పత్రాల్లో చైనా పరిశోధకులు టాప్ 1 శాతంతో అగ్రస్థానంలో ఉంటున్నారు.

20వ శతాబ్దిలో కీలకమైన దేశ సమ్మిళిత సైనిక సామర్థ్యాన్ని... దృఢమైన జాతీయ పరిశోధన, అభివృద్ధి, పారిశ్రామిక, వస్తూత్పత్తి పునాది నిర్ణయించిందని భావిస్తున్నారు. అయితే ప్రస్తుత యుగంలో ఏ ప్రముఖ అగ్రరాజ్యమైనా సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటితో వ్యవహరించేందుకు అవసరమైన సాంకేతికపరమైన వ్యక్తిత్వం సాధించడానికి అత్యున్నత నాణ్యతతో కూడిన జాతీయ విద్యా విధానం మాత్రమే వీలు కల్పిస్తుంది. అందుకే భారత్ ముందు కఠిన ప్రయాసతో కూడిన మార్గం ఉందని ఏఎస్ఈఆర్–2022 సర్వే ఎత్తి చూపింది.

వ్యాసకర్త సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మహాప్రసాదం



ప్రతియేటా నాకు చిత్తూరులోని ఒక అడ్వకేట్ నుంచి తిరుపతి లడ్డు వస్తుంది. పదిహేనేళ్ల క్రితం ఆయనకు ఆంజియోప్లాస్టీ చేశాను. తన వైద్యుడిని గుర్తు పెట్టుకోవడానికి ఆయన ఎంచుకున్న మార్గం ఇది.
- పి. కామత్, కార్డియాలజిస్ట్

ఎందుకలా?



రసాయనిక ఆయుధాలు వాడటం ద్వారా ఉక్రెయిన్ ఏం సాధించాలనుకుంటున్నదో అర్థం కావడం లేదు. అణ్వాయుధాల వైపు రష్యాను రెచ్చగొట్టేలా తగిన కారణాన్ని ఇవ్వడమా?
- అభిజిత్ అయ్యర్ మిత్రా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

గోతుల్లేని నగరం లేదా?



రెండు నెలల క్రితం నేను చెడ్డ ట్రాఫిక్‌తో బాగా తవ్వేసిన ముంబయి నుంచి, చెడ్డ ట్రాఫిక్‌తో బాగా తవ్వేసిన బెంగళూరుకు, అటుపైన చెన్నైకి ప్రయాణించాను. ఇప్పుడు ఇది కూడా చెడ్డ ట్రాఫిక్‌తో బాగా తవ్వేసిన నగరమే. అసలు ఇలా లేని నగరం ఏదైనా ఉందా?
- రాధికా సంతానం, జర్నలిస్ట్

చేయడమే మన పని



ఫర్‌ఫెక్టుగా ఉండటం గురించి మరీ అంత పట్టింపుతో ఉండొద్దు. మనం అందరమూ పరిపూర్ణంగా అపరిపూర్ణంగా ఉన్నాం. పురోగతి జరుగుతూ ఉంటుంది. మీ పని అత్యుత్తమంగా చేసి, మిగతాది దేవుడికి వదిలేయండి.
- ముఫ్తీ మెంక్, మత గురువు

అమర్యాదకర సంబోధన



ఏ మాత్రం పరిచయం లేని వాళ్లు కూడా 'తూ(నువ్వు)' అనడం నాకు అసౌకర్యం కలిగిస్తుంది. చాలా ఏళ్ల క్రితం బొంబాయిలో నాతో అలా అమర్యాదగా మాట్లాడారు. నేను కండక్టర్‌ను దిక్కుల కోసం అడిగితే, ఆయన 'నువ్వు ముందుకెళ్లి అక్కడ నిలబడు' అని జవాబివ్వడం ఇబ్బంది కలిగించింది. నాకు బొంబాయి ఎప్పుడూ నచ్చలేదు.
- మణిముగ్ధ శర్మ, జర్నలిస్ట్

దగ్గరి పిలుపు



మేము మా చిన్నాన్నలను కూడా 'తూ' (నువ్వు) అనే సంబోధిస్తాం. అసలు దేవుడిని కూడా నువ్వు అంటామన్న సంగతి మరిచిపోదాం. ఆప్(మీరు) అనేదానికన్నా 'తూ' అనేది హృదయానికి దగ్గరగా ఉంటుంది. ఇది చాలామంది ఉత్తర భారతీయులకు అర్థం కాదు.
- రోహిత్ బాపత్, పుణె రచయిత

ద్వేషమే బలమైనదా?



టర్కీ 1974 నుంచి అక్రమంగా సైప్రస్‌లోని 36 శాతం భూభాగాన్ని ఆక్రమించుకుంది. అయినప్పటికీ టర్కీ భూకంప బాధితులకు సైప్రస్ సాయాన్ని ప్రకటించింది. ఈ మానవతా సాయాన్ని నిరాకరించడం ద్వారా తన పౌరుల పట్ల ఉన్న ప్రేమ కన్నా, సైప్రస్ పట్ల ఉన్న ద్వేషమే ఎక్కువని టర్కీ ప్రభుత్వం నిరూపించింది.
- ఉజయ్ బులూత్, టర్కీ ఫెలో

గొప్ప సంస్కరణవాది

తన సినిమాల్లో సంగీత, సాహిత్యాలకు పెద్దపీట వేసిన ప్రముఖ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ గొప్ప సంస్కరణవాది. మెగాస్టార్ చిరంజీవితో తీసిన 'స్వయంకృషి' సినిమా అందుకు తిరుగులేని నిదర్శనం. రోడ్డుపక్కన చెప్పులు కుట్టే పాత్రను హీరో చేసి సినిమా తీయటమే ఒక విప్లవమైతే, ఆ పాత్రలో మెగాస్టార్‌ను నటింపజేయటం అపూర్వం. హైస్కూలు రోజుల్లో 'స్వయంకృషి' సినిమాను చూశాను. చెప్పులు కుట్టే వృత్తిదారుల ఆత్మగౌరవాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ ఈ సినిమా ద్వారా పెంచారాయన. అప్పుడే అంత గొప్ప దర్శకుడిని ఒక్కసారైనా కలవాలని ఆశ పడ్డాను. 2017లో నేను రాసిన 'చెరగని జ్ఞాపకం' పుస్తకంతో ఆ భాగ్యం దక్కింది. విశ్వనాథ్ స్వగ్రామమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పెదపులివర్రుకు పక్కనే మా ఊరు. నేనూ చెప్పులు కుట్టి జీవనం సాగించే కులం నుంచే వచ్చాను.



కె. విశ్వనాథ్‌తో వ్యాసకర్త

తెనాలిలో లాయర్‌గా స్థిరపడిన నేను, కొన్నేళ్లకు ప్రముఖ మాటల రచయిత మోదుకూరి జాన్సన్ కృషిని 'చెరగని జ్ఞాపకం' పేరుతో పుస్తకంగా తెచ్చాను. హైదరాబాద్ వెళ్లి, సూపర్‌స్టార్ కృష్ణచే ఆవిష్కరింపజేశాను. అక్కడే ఉండి సినీప్రముఖులకు ఆ పుస్తకాన్ని అందజేశాను. కె. విశ్వనాథ్‌ను కలవాలంటే అదే సందర్భమని చెప్పనక్కరలేదు. ఫోన్ నంబరు సంపాదించి ఫోన్ చేసి, 'తెనాలి నుంచి వచ్చాను... కలవాలి' అనగానే రమ్మన్నారు.

ఇంటికి వెళ్లగానే భార్యతో కలిసి టీవీ చూస్తున్న ఆయన చేతికర్ర సాయంతో నడుచుకుంటూ వచ్చారు. సోఫాలో కూర్చొని, నన్నూ కూర్చోమన్నారు. మోదుకూరి జాన్సన్‌పై పుస్తకం తెచ్చాను... అంటూ ఇవ్వగానే, 'మంచి రచయితను గుర్తించావు. మేమిద్దరం ఆదుర్తి సుబ్బారావు దగ్గర పనిచేశాం. నేను డైరెక్ట్ చేసిన 'నేరము – శిక్ష' సినిమాకు జాన్సన్‌గారు మాటల రచయితగా చేశారు' అని గుర్తుచేసుకున్నారు.

'మిమ్మల్ని కలవాలన్న నా జీవితాశయం నెరవేరింది' అన్నాను. 'చెట్టు కింద చెప్పులు కుట్టే సాంబయ్య పాత్రను చిరంజీవితో చేయించి ఆ పాత్రకే గౌరవం తెచ్చారు... నేను కూడా ఆ వృత్తి చేసే కులానికి చెందిన వాడిని' అని చెప్పాను. 'ఇందులో నా గొప్పదనం ఏమీ లేదు. మనిషిని మనిషిగా చూడాలి, వారు చేస్తున్న వృత్తిని గౌరవించాలి, అదే ఆ సినిమాలో చూపించా. తన ఇమేజ్‌ని పక్కనపెట్టి ఒప్పుకున్న చిరంజీవిదే గొప్పతనం' అన్నారాయన. దర్శకుడు మీరైనందునే చిరంజీవి అంగీకరించారని నేను చెబుతుంటే, 'నీలో చాలా విశ్లేషణ ఉంది' అన్నట్టు మెచ్చుకోలుగా చూశారు. పెదపులివర్రు దగ్గరే మా గ్రామమనీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చినపుడు సొంతూరు లోనూ, అదేరోజు కృష్ణాజిల్లా అవనిగడ్డలోనూ సత్కరించిన విషయాలను గుర్తుచేశాను. 'నా గురించి చాలా తెలుసునే' అన్నారు విశ్వనాథ్. ప్రాంతీయ అభిమానం సార్... అంటూ నమస్కరించి వచ్చేశాను. వారి ఆత్మకు శాంతి కలగాలి.

– గుంటూరు కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షులు, మోదుకూరి జాన్సన్ కల్చరల్ సొసైటీ, తెనాలి। 93476 56300

మన గౌరవాన్ని పెంచే సదస్సు

అభిప్రాయం



యాతం వీరాస్వామి

భారత్ అధ్యక్షతన ఢిల్లీలో ఈ ఏడాది సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జీ–20 ప్రపంచ శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. ఇప్పటికే ఢిల్లీతో పాటు దేశంలోని పలు నగరాల్లో జీ–20 సన్నాహక సదస్సులు మొదలయ్యాయి. భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు ఇది సరైన వేదిక. అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య పరస్పర ఆర్థిక సహకారాన్నీ, సాంకేతికతనూ ఇచ్చిపుచ్చుకునేందుకు... ప్రపంచ దేశాల ఉమ్మడి సమస్యలకు సరైన పరిష్కార మార్గాలను సూచించే శక్తివంతమైన వేదిక ఇది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన, చెందుతున్న అత్యంత బలమైన 20 అతి పెద్ద దేశాల జట్టుకు ఏడాది పాటు భారత్ నాయకత్వ బాధ్యతలను చేపట్టే అవకాశం ఇది. భారత దేశాభివృద్ధికి అవసరపడే పెట్టుబడులు, టెక్నాలజీ లాంటి పలు అంశాలపైనా; పర్యావరణం, పర్యాటకం, అంతర్జాతీయ ఉగ్రవాదం, సరిహద్దు సమస్యలు వంటి విషయాలపైనా చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోగల వేదిక ఇది.

ఈ సదస్సులో భారత్‌తో పాటూ అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, యూకే, అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు పాల్గొంటాయి. వీరితో పాటు భారత్ నేతృత్వంలో ఎంపిక చేయబడే జీ–20లో లేని పలు దేశాల ముఖ్య నేతలు, అధికారులు కూడా ఈ సదస్సుకు అతిథులు.

1999 సెప్టెంబర్ 25న ఆవిర్భవించిన ఈ జీ–20 గ్రూప్ దేశాల్లో... ఏదో ఒక దేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 1 నుంచి మరుసటి ఏడాది నవంబర్ 30 వరకు ఏడాది పొడవునా ప్రపంచ శిఖరాగ్ర సదస్సులు నిర్వహిస్తారు. అంతర్జాతీయ వేదికలపై తరచుగా జీ2, జీ4 జీ7, జీ8, జీ10, జీ15, జీ20 వంటి పేర్లు వింటుంటాం. వీటిలో అత్యంత శక్తిమంతమైన గ్రూపే జీ-20. ప్రపంచ జనాభాలో మూడొంతుల్లో రెండొంతుల జనాభా దీనిదే. ప్రపంచ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తిలో) లో 85 శాతం వాటా, ప్రపంచ మార్కెట్లో 75 శాతం వాటా ఈ జట్టుదే! దీంతో ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థలు అన్నీ ఈ వేదికపైనే కనిపిస్తాయి. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు ప్రపంచం మొత్తాన్నీ ప్రభావితం చేస్తాయి. కానీ, చట్టబద్ధం కావు. దీనికి శాశ్వత ఆఫీసు సిబ్బంది ఉండరు. ఖర్చులు నిర్వాహకులే భరించాలి. జీ–20 ఢిల్లీ సదస్సుకు ముందుగా... దేశంలో పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వంచే ఎంపిక చేయబడిన 56 నగరాలు, పట్టణాల్లో 32 రంగాలకు చెందిన అంశాలపై దాదాపు 200 సన్నాహక సదస్సులు జరుగుతాయి. ఇందులో భాగంగానే బెంగళూరు, ముంబయి, జైపూర్, విశాఖపట్నం వంటి పలు నగరాల్లో సన్నాహక సదస్సులను నిర్వహించ నున్నారు. 2022 డిసెంబర్ 13న బెంగళూరులో మొదటి సమావేశం ప్రారంభం కావడంతో... దేశమంతా సదస్సు సన్నాహాలు వేగవంతమయ్యాయి. 2023 మార్చి 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే సన్నాహక సదస్సుకు 40 దేశాల నుంచి దాదాపు 300 మంది అంతర్జాతీయ, జాతీయ ప్రతినిధులు హాజరు కానున్నారు. జీ–20 విదేశాంగ మంత్రులు, రాయబారులతో పాటు మన కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటారు. దీనిలో భాగంగా మార్చి 3, 4 తారీఖుల్లో విశాఖ సాగరతీరం వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ జరపాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించి, కీలక మైన 12 రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఈ సదస్సుకు అంతర్జాతీయ ప్రముఖులను ఆహ్వానించడం విశేషం. దీంతో విశాఖలో మార్చి తొలి వారంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్, ఆఖరి వారంలో జీ–20 సన్నాహక సదస్సు వేడుకలు జరగనున్నాయి.



ఈ సందర్భంగా దేశంలోని అన్ని రాష్ట్రాలూ తమ దగ్గర ఉన్న పెట్టుబడి అవకాశాలు, వనరుల గురించి వివరించే అవకాశం దక్కుతుంది. తద్వారా భారత్‌ను ప్రపంచ దర్పణంలో 'మేరా భారత్ మహాన్'గా చూపించినట్లే! భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు ఇది సువర్ణ అవకాశం. రాజకీయాలకు అతీతంగా.. మనందరం ఈ సదస్సును జయప్రదం చేసి మన ఐక్యతను చాటుదాం.

వ్యాసకర్త రచయిత, విశ్లేషకులు
మొబైల్: 95816 76918

క్లుప్తంగా...

నకిలీ పత్తి విత్తనాలపై చర్యలు తీసుకోరా?: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వర్షాధార పంట అయిన పత్తి సాగు చేసే రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో కల్తీ విత్తనాలపై స్వయంగా తానే ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నకిలీ విత్తనాలను కట్టడి చేయడంలో విఫలమైన ప్రభుత్వం కనీసం పంటల కొనుగోలు వ్యవస్థలను కూడా సరిగా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వరి, పత్తి పంటల కొనుగోలు విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 24 గంటల కరెంటు సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్న కోదండరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ రైతు వ్యతిరేక ప్రభుత్వాలని వ్యాఖ్యానించారు.

13న జాతీయ రహదారి దిగ్బంధం



భానుపురి(సూర్యాపేట): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో ఈనెల 13 న హైదరాబాద్ – విజయవాడ జాతీయరహదారిని దిగ్బంధం చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ వెల్లడించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...2014 ఎన్నికలకు ముందు ప్రధాని అభ్యర్థిగా మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సమయంలో వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డి తదితర నాయకుల సమక్షంలో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంటామని చెప్పారని గుర్తు చేశారు. నాటినుంచి ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీలు కూడా వర్గీకరణకు మద్దతుగా ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కావాలనే వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం లేదని ఆరోపించారు. తెలంగాణలో కేంద్రమంత్రులు, ప్రధాని పర్యటనలో తప్పకుండా తమ నిరసన తెలుపుతామన్నారు. 13న చేపట్టే హైవే దిగ్బంధంలో వర్గీకరణకు మద్దతు తెలిపే అన్నివర్గాల ప్రజలు, పార్టీలు, సంఘాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్, జాతీయ నాయకుడు మంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో ఆదిమానవుల ఆధారాలు



పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తిలో 5వేల ఏళ్ల కిందట ఆదిమానవులు జీవించినట్లు ఆధారాలున్నాయని చరిత్ర పరిశోధకుడు, రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిసరాలను పరిశీలించారు. ఆలయం ఎదురుగా ఉన్న చెరువు కట్టపైన ఒక పరుపుబండపై కొత్త రాతి యుగానికి చెందిన రాతి పనిముట్లు తయారు చేసుకున్న ఆధారాలను గుర్తించారు. ఒకే చోట 17 లోతైన, పొడవైన గ్రూప్స్ కనిపించాయి. ఇవి తెలంగాణలో సిర్రగోనె ఆటలో తవ్వుకునే బద్దుల మాదిరిగా ఉన్నాయి. వీటిని బట్టి ఇక్కడ చరిత్ర పూర్వ యుగం నాటి నుంచి మానవులు వ్యవసాయం చేసుకున్నట్లు తెలుస్తోందని రత్నాకర్‌రెడ్డి అన్నారు. ఈ ఆధారాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

భారీగా యాసంగి వరి నాట్లు

ఇప్పటివరకు 48.86 లక్షల ఎకరాల్లో నాట్లు
- వచ్చే వారాల్లో రికార్డు బద్దలయ్యే అవకాశం
- 5.97 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- వేరుశనగ పంటల సాగు 2.38 లక్షల ఎకరాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సాగు గణనీయంగా పెరుగుతోంది. ఈ సీజన్‌లో సాధారణ పంటల సాగు 47.85 లక్షల ఎకరాలుకాగా, ఏకంగా 63.79 లక్షల ఎకరాల్లో అన్ని పంటలు కలిపి సాగయ్యాయి. అంటే సాధారణ విస్తీర్ణంలో 133 శాతం సాగయ్యాయి. ఇక వరి గతేడాది యాసంగిలో 35.84 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా, ప్రస్తుతం 48.86 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. 2020–21 యాసంగి సీజన్‌లో ఏకంగా 52.28 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. ఆ రికార్డు ఈసారి దాటుతుందని అంటున్నారు. రానున్న వారాల్లో వరి సాగు విస్తీర్ణం ఆల్‌టైం రికార్డు దిశగా వెళ్లనుందని వ్యవసాయ వర్గాలు అంటున్నాయి. ఇదిలావుండగా మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 4.63 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 5.97 లక్షల ఎకరాల్లో సాగైంది. జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 88 వేల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.07 లక్షల ఎకరాల్లో సాగైంది. శనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3.56 లక్షల ఎకరాల్లో సాగైంది. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.02 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.38 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే 78.65 శాతానికి పరిమితమైంది.

నాలుగు జిల్లాల్లో వంద శాతంలోపు సాగు...

రాష్ట్రంలో 32 జిల్లాల్లో కేవలం నాలుగు జిల్లాల్లో మాత్రమే వంద శాతం లోపు పంటలు సాగయ్యాయి. మంచిర్యాల జిల్లాలో 92.40 శాతం, ములుగు 83.84 శాతం, రంగారెడ్డి జిల్లాలో 76.16 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యంత తక్కువగా 57.97 శాతం సాగయ్యాయి. మిగిలిన అన్ని జిల్లాల్లో వంద శాతం దాటింది. ఏడు జిల్లాల్లో 150 శాతానికి మించి పంటలు సాగయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 159.12 శాతం, మెదక్ జిల్లాలో 158.25 శాతం, సంగారెడ్డి జిల్లాలో 156.38 శాతం, సిద్దిపేట జిల్లాలో 163.43 శాతం, జనగాం 151.51 శాతం, మహబూబ్‌నగర్ 150.57 శాతం, యాదాద్రి జిల్లాలో 167.66 శాతం పంటలు సాగయ్యాయి. పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేస్తున్నామని, ఎక్కడా ఇబ్బంది కావడంలేదని ఆగ్రోస్ ఎండీ కె.రాములు తెలిపారు.

నేను తెలంగాణ బిడ్డనే

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



స్టేషన్‌ఘన్‌పూర్ బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

స్టేషన్‌ఘన్‌పూర్: తాను తెలంగాణలోనే పుట్టానని, ఇక్కడే పెళ్లి చేసుకున్నానని, ఇక్కడే బిడ్డల్ని కన్నానని, కాబట్టి తాను తెలంగాణ బిడ్డనేనని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల మరోమారు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ వెన్నుపోటు పొడిస్తే ఈ గడ్డకు సేవ చేయాలని పార్టీ పెట్టానని, కుటుంబాన్ని పక్కన పెట్టి 3,600 కి.మీ. పాదయాత్ర చేశానని ఆమె తెలిపారు. షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర బుధవారం జనగామ జిల్లా జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల్లో సాగింది. సాయంత్రం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ...స్థానిక ఎమ్మెల్యే రాజయ్యకు, ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి ప్రజాసమస్యలపైనా, అభివృద్ధిపైనా ఏమాత్రం సోయిలేదని విమర్శించారు. రాజయ్యను రాసలీలల రాజయ్య అని కడియం, శ్రీహరిని ఎన్‌కౌంటర్ల కడియం అని రాజయ్య అనుకుంటారని ఎద్దేవా చేశారు. వీరిద్దరు దళిత నేతలై ఉండి దళితులకు అన్యాయం జరిగితే నోరు కూడా విప్పరని, ప్రజలకు సేవ చేయకుండా గాడిదలు కాస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను కమీషన్ల రూపంలో కొల్లగొట్టిన దొంగ సీఎం కేసీఆర్ అని, మిగులు రాష్ట్రాన్ని రూ.నాలుగున్నర లక్షల కోట్ల అప్పులకుప్పగా మార్చేశారని విమర్శించారు.

34 మంది విద్యార్థులకు అస్వస్థత

వాతావరణ మార్పులతోనే అని నిర్ధారించిన వైద్యులు
- 10 మంది ఆస్పత్రిలో చేరిక..
- 24 మందికి వైద్యం అందించి హాస్టల్‌కు తరలింపు



నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

నర్సంపేట రూరల్: హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న 34 మంది విద్యార్థులు మూకుమ్మడిగా అస్వస్థతకు గురైన ఉదంతం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వల్లభ్‌నగర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు ఒకేసారి అస్వస్థతకు గురికావడంతో పీఈటీ ప్రేమ్‌చంద్ వారిని అంబులెన్స్‌లలో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందన్న వదంతులు షికారు చేయడంతో కలకలం రేగింది. కాగా పరీక్షించిన వైద్యులు 24 మందికి జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలు తక్కువగా ఉండడంతో మందులు అందించి తిరిగి హాస్టల్‌కు పంపించారు. పది మందికి జ్వర తీవ్రత ఎక్కువగా ఉండడంతో వారిని ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీనిపై వైద్యులను వివరణ కోరగా.. వాతావరణంలో మార్పులు రావడంతో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకాయని చెప్పారు. ఒకరి ద్వారా మరొకరికి జ్వరాలు వచ్చాయే తప్ప విద్యార్థులకు ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని స్పష్టం చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

రాత్రి విద్యుత్... రైతు ప్రాణం తీసింది..!

- మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన
- అటవీ చెక్‌పోస్టు కార్యాలయం ధ్వంసం



మల్లేశ్ (ఫైల్)

కడెం: రాత్రి వేళల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా... నిర్మల్ జిల్లా కడెం మండలం పాండ్వపూర్ గ్రామంలోని ఓ రైతు ప్రాణం తీసింది. రాత్రి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడంతో పాండ్వపూర్ గ్రామానికి చెందిన రైతు మల్లేశ్(40) బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై గ్రామ సమీపంలోని వరి పంటకు నీరు పారించేందుకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేసి ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో పాండ్వపూర్ అటవీ చెక్‌పోస్టు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. మల్లేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి గ్రామస్తులు చెక్‌పోస్టు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. అటవీ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆగ్రహించి అటవీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కంప్యూటర్, సీసీ కెమెరా తదితర సామగ్రిని తగులబెట్టారు. అటవీ అధికారులు ఎంట్రీ ఫీజు పేరుతో డబ్బులు వసూలు చేయడంతో వాహనాలు రోడ్డుపై నిలిచి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆరోపించారు. చెక్‌పోస్టును ఎత్తివేయాలని పెద్ద ఎత్తున నినదించారు. గ్రామస్తుల ఆందోళనతోనిర్మల్–మంచిర్యాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. అటవీ అధికారులు వచ్చేవరకూ ఆందోళన విరమించేదిలేదని రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన కొనసాగించారు.

పెద్దగట్టులో 'నెలవారం'



దేవరపెట్టెను కేసారం గ్రామానికి తరలిస్తున్న మెంతనబోయిన, మున్న వంశస్తులు

సూర్యాపేట: చివ్వెంల మండలం దురాజ్‌పల్లి లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరలో భాగంగా నాలుగో రోజు బుధవారం యాదవులు భక్తిశ్రద్ధలతో నెలవారం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం చంద్రపట్నం వేసి కేసారం గ్రామానికి వెళ్లిన పూజారులు మెంతనబోయిన, గొర్ల వంశీయులు తిరుగు పయనమై బుధవారం గట్టుకు చేరుకున్నారు. వారు తమ వెంట తెచ్చిన పాలు, నెయ్యి, పూజా సామగ్రితో బోనం వండి లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లికి సమర్పించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం తమ వెంట తెచ్చిన తొలి గొర్రెను బలి ఇచ్చి భక్తులతో పాటు బైకాన్లు, మున్న వంశీయులకు పంచిపెట్టారు. ఈ తంతు పూర్తయ్యాక చంద్రపట్నం ఎత్తి పుట్టలో పోశారు. అనంతరం దేవరపెట్టెతో కేసారం గ్రామానికి బయల్దేరి వెళ్లడంతో నెలవారం కార్యక్రమం ముగిసింది.

పాము కాటుతో విద్యార్థిని మృతి

పర్వతగిరి: పాముకాటుతో ఓ ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన బుధవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో చోటుచేసుకుంది. చింతనెక్కొండ శివారు భట్టుతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని భట్టు మన్విత (6) ఒకటో తరగతి చదువుతోంది. మన్విత పాఠశాలకు వచ్చి చెప్పులు విడుస్తున్న క్రమంలో తన కాలు నాగుపాముపై పడింది. దీంతో పాము వెంటనే కాటు వేసింది. గమనించిన ఉపాధ్యాయుడు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించగా.. మన్వితను వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. అనంతరం పామును చంపేశారు.

మున్సిపల్ కమిషనర్‌ను అరెస్టు చేయాలి

- కమిషనర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన ఆయన భార్య తరఫు బంధువులు
- బాలకృష్ణ భార్య మృతికి భర్త, అత్త వేధింపులే కారణమని ఆరోపణ



బాలకృష్ణ ఇంటిముందు జ్యోతి బంధువుల ఆందోళన

కూసుమంచి/మంచిర్యాల క్రైం: మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ నల్లమల బాలకృష్ణ స్వస్థలమైన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురంలోని ఆయన ఇంటి ఎదుట బుధవారం ఉద్రిక్తత నెలకొంది. కమిషనర్ భార్య జ్యోతి (32) మంగళవారం మంచిర్యాలలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బుధవారం సాయంత్రం కేశ్వాపురం తీసుకొచ్చిన మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు బాలకృష్ణ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. జ్యోతిని బాలకృష్ణ, ఆయన తల్లి వేధించారని.. ఆమె ఆత్మహత్యకు వారే కారణమని ఆరోపించారు. ఈ క్రమంలో బాలకృష్ణ బంధువులు, మృతురాలి బంధువులకుమధ్య వాగ్వాదం జరిగింది. తలుపులు వేసుకుని లోపల ఉండిపోయిన బాలకృష్ణ తల్లిని బయటకు రావాలని డిమాండ్ చేస్తూ బంధువులు ఇంట్లోకి దూసుకెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. బాలకృష్ణ కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకోవడంతో పిల్లలు అనాథలుగా మారారని, ఆయనను సస్పెండ్ చేయాలని మృతురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈక్రమంలో కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యాన భారీ బందోబస్తు ఏర్పాటుచేసి ఇరుపక్షాలు చర్చించుకోవాలని నచ్చచెప్పారు. కాగా, అటు తల్లి మృతదేహం, ఇటు బంధువుల రోదనలతో ఏం జరుగుతుందో తెలియక బాలకృష్ణ – జ్యోతి పిల్లలు రుత్విక్, భవిష్య అమాయకంగా చూస్తుండటం అందరినీ కన్నీరు పెట్టించింది. అయితే జ్యోతి మృతదేహం కేశ్వాపురంలోనే ఉండగా, గురువారం ఉదయం ఆమె స్వగ్రామమైన కొణిజర్ల మండలం సీతారాంపురంలో అంత్యక్రియలు నిర్వహించే అవకాశముందని తెలుస్తోంది.

బాలకృష్ణ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

మున్సిపల్ కమిషనర్ నల్లమల బాలకృష్ణను పోలీసులు బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఆయన భార్య జ్యోతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేశారు. మంచిర్యాల కోర్టులో హాజరు హాజరుపర్చగా 14రోజుల రిమాండ్ విధించారు. కాగా, బాలకృష్ణ తల్లిదండ్రులు మురళి, కన్నమ్మ, సోదరుడు హరికృష్ణ, అక్కాచెల్లెళ్లు కృష్ణకుమారి, జ్యోతిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

సామర్థ్యానికి మించి విద్యుదుత్పాదన

- రికార్డు నెలకొల్పిన నాగార్జునసాగర్ జల విద్యుత్ ఉత్పాదన కేంద్రం

ప్రధాన జలవిద్యుత్ ఉత్పాదన కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన ఇలా..

సంవత్సరం	ఉత్పత్తి లక్ష్యం	ఉత్పత్తి చేసినది
2018-19	1220 మి.యూ	339.04 మి.యూ
2019-20	1289	1512
2020-21	1290	1248
2021-22	1535	2262
2022-23	1500	2264.531 (ఫిబ్రవరి 7వ తేదీ నాటికి)



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జల విద్యుదుత్పాదన కేంద్రంలో సామర్థ్యాన్ని మించి రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ఈ ఏడాది కృష్ణానదికి భారీగా వరదలు రావడం, జూలై మూడవ వారం నుంచే వరదనీరు చేరడం, చివరి వారం నుండే ఎడమకాల్వకు నీటిని విడుదల చేయడంతో తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొదటిసారి రికార్డు స్థాయిలో విద్యుదుత్పాదన చేశారు. విద్యుత్ ఉత్పాదనను ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఒక సంవత్సరంగా పరిగణిస్తారు. ప్రాజెక్టు డిజైన్ ప్రకారం జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2,237 మిలియన్ యూనిట్లు కాగా.. మంగళవారానికే (7 ఫిబ్రవరి 2023) విద్యుత్ ఉత్పాదన 2,264.531 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. మార్చి 31వరకు మరో 150మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. గతయేడాది 21మార్చి 2022 నాటికి 2262.5273 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో 2022–23 సంవత్సరానికి గాను 1500 మిలియన్ యూనిట్లు లక్ష్యం నిర్ణయించుకోగా.. అక్టోబర్ 14 నాటికి అధికారులు ఆ లక్ష్యాన్ని చేరుకున్నారు. ఆ తర్వాత నుంచి కూడా విద్యుత్ ఉత్పాదన జరగడంతో లక్ష్యాన్ని మించడమే కాకుండా సామర్థ్యాన్ని కూడా దాటింది.

సామర్థ్యాన్ని మించి ఉత్పాదన: జెన్‌కో సీఈ

నాగార్జునసాగర్‌లోని జలవిద్యుత్ కేంద్రాల ద్వారా 2014 తర్వాత సామర్థ్యాన్ని మించి రికార్డు స్థాయిలో విద్యుదుత్పాదన చేశాం. 2022 జూలై 16న వరద రావడం మొదలైంది. రోజుకు 18–19 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పాదన జరిగింది. 30 జనవరి 2023 నాటికి 2,237 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరుకున్నాం. 7 ఫిబ్రవరి 2023 నాటికి 2,264.531మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశాం. 31 మార్చి 2023 నాటికి మరో 150 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరుగుతుంది.

క్లుప్తంగా...

పోలీసు దళాల్లో మహిళల ప్రాతినిధ్యం 11.75%

న్యూఢిల్లీ: పోలీసు బలగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని ఇప్పటికే ఆరుసార్లు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు, సలహాలు ఇచ్చామని కేంద్రం తెలిపింది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా బుధవారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ విషయం చెప్పారు. 'మహిళా పోలీసుల ప్రాతినిధ్యం 33 శాతానికి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించాం. దేశవ్యాప్తంగా పోలీసు బలగాల్లో కేవలం 11.75 శాతం మంది మహిళలు ఉన్నారు. లద్దాఖ్‌లో అత్యధికంగా 28.3 శాతం మంది మహిళా పోలీసులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 21.7 శాతం మంది ఉన్నారు' అని మంత్రి అన్నారు.

భారత్‌పై బెలూన్ల నిఘా!

వాషింగ్టన్: డ్రాగన్ దేశం చైనా నిఘా బెలూన్ల ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. చైనా ఈ బెలూన్లతో కేవలం అమెరికా పైనే కాదు, ఇంకా చాలా దేశాలపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. చైనా బెలూన్లు భారత్‌ను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికాకు చెందిన 'ద వాషింగ్టన్ పోస్టు' పత్రిక ఒక కథనంలో వెల్లడించింది. భారత్‌తోపాటు జపాన్, వియత్నాం, తైవాన్, ఫిలిప్పీన్స్‌లో ఉన్న కీలక వ్యూహాత్మక ప్రాంతాలను చైనా బెలూన్లు టార్గెట్ చేసినట్లు కథనంలో బహిర్గతం చేసింది. చైనా వైమానిక దళం నిఘా బెలూన్లను నిర్వహిస్తోందని, ఇవి ఐదు ఖండాలపై కనిపించినట్లు తెలియజేసింది. తన గగనతలంపై ఎగురుతున్న చైనా బెలూన్‌ను ఇటీవలే అమెరికా పేల్చేసిన సంగతి తెలిసిందే. ఇతర దేశాలపై నిఘా కోసం చైనా ఈ బెలూన్లను తయారు చేసిందని, తద్వారా ఆయా సార్వభౌమత్వానికి విఘాతం కలిగించిందని అమెరికా రక్షణ శాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

రోడ్డు ప్రమాదంలో 30 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఖైబర్ పఖ్తూంఖ్వా ప్రావిన్స్‌లోని కోహిస్తాన్ జిల్లా షితియాల్ ప్రాంతంలో ఘోర ప్రమాదం సంభవించింది. బస్సు, కారు ఒకదానికొకటి ఢీకొని, పక్కనే ఉన్న లోయలో పడిపోయాయి. ఈ దుర్ఘటనలో 30 మంది మరణించారు. మరో 15 మంది గాయాలపాలయ్యారు. గిల్గిత్ నుంచి రావల్పిండి వైపు వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి, సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. 30 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రజలే రక్షణ కవచం

- లోక్‌సభలో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- దూషణలు, అబద్ధాలు, ఆరోపణలు నన్నేమీ చేయలేవు
- 140 కోట్ల మంది నాపై చూపుతున్న విశ్వాసాన్ని దెబ్బతీయలేరని వ్యాఖ్య



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై మరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో 140 కోట్ల మంది ప్రజల విశ్వాసాన్ని రక్షణ కవచంగా ధరిస్తున్నానని ఉద్ఘాటించారు. విమర్శకుల దూషణలు, అబద్ధాలు, ఆరోపణలు తననేమీ చేయలేవని తేల్చిచెప్పారు. ప్రజలు తన పట్ల చూపుతున్న విశ్వాసాన్ని ఎవరూ దెబ్బతీయలేరని అన్నారు. జీవితంలో ప్రతి క్షణం దేశం కోసమే పని చేస్తున్నానని చెప్పారు. స్థిరమైన, నిర్ణయాత్మక ప్రభుత్వం వల్ల అంతర్జాతీయ సంస్థలకు భారత్‌పై నమ్మకం పెరిగిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ప్రధాని మోదీ 85 నిమిషాలపాటు ప్రసంగించారు. కోవిడ్–19 మహమ్మారి, సంఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో సంక్షోభం, అస్థిరత కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచం మొత్తం ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో భారత్ వైపు చూస్తోందని వివరించారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే..

తిట్లు, ఆరోపణలను జనం అంగీకరిస్తారా?

"140 కోట్ల మంది భారతీయులు సాధించిన విజయాలను కొందరు(విపక్ష నేతలు) చూడలేకపోతున్నారు. భారత్ సాధించిన ప్రగతిని ఒప్పుకోవాలంటే వారికి కష్టంగా ఉంది. సంక్షోభ సమయంలో నేను అందించిన సాయం ఏమిటో ప్రజలకు తెలుసు. మీరు (ప్రతిపక్షాలు) నన్ను తిడుతున్న తిట్లు, నాపై చేస్తున్న ఆరోపణలను జనం అంగీకరిస్తారా? కేవలం పత్రికలు, టీవీల్లోని వార్తలను చూసి జనం నాపై నమ్మకం పెంచుకోలేదు. ప్రజాసేవ పట్ల చాలా ఏళ్లుగా నా అంకితభావాన్ని చూసి నన్ను విశ్వసిస్తున్నారు. నిర్మాణాత్మక విమర్శలు చేయాల్సింది పోయి పనికిమాలిన ఆరోపణలతో ప్రతిపక్షాలు గత తొమ్మిదేళ్ల కాలాన్ని వృథా చేశాయి. కొందరు వ్యక్తులు కేవలం వారి కుటుంబం కోసమే జీవిస్తున్నారు. 25 కోట్ల భారతీయ కుటుంబాల కోసం నేను జీవిస్తున్నా.

2030వ దశాబ్దం 'భారతదేశ దశాబ్దం'

మీరు ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలను తప్పుపడుతున్నారు. ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తున్నారు. మీకు అనుకూలమైన తీర్పులు ఇవ్వకపోతే సుప్రీంకోర్టును ఆక్షేపిస్తున్నారు. దేశ ఆర్థికాభివృద్ధి సాధిస్తోందన్న మాట వినపడితే చాలు ఆర్‌బీఐపై నిప్పులు కక్కుతున్నారు. 2014 కంటే ముందున్న దశాబ్దం మనం 'కోల్పోయిన దశాబ్దం'. కానీ, 2030వ దశాబ్దం 'భారతదేశ దశాబ్దం'. మొబైల్ ఇంటర్నెట్ డేటా ఖర్చు గతంలో రూ.250 ఉండేది. ఇప్పుడు అది రూ.10కి దిగివచ్చింది. దేశంలో 70 ఏళ్లలో 70 ఎయిర్‌పోర్టులు నిర్మించారు. కానీ, గత తొమ్మిదేళ్లలోనే 70కిపైగా ఎయిర్‌పోర్టులు నిర్మించాం.

'తయారీ కేంద్రం'గా భారత్

2008లో దేశంలో జరిగిన ఉగ్రవాద దాడులను ఎవరూ మర్చిపోలేరు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే దమ్ము అప్పటి ప్రభుత్వానికి లేకుండాపోయింది. అందుకే రక్తపాతం జరిగింది, అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. యూపీఏ దుష్పరిపాలనకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి. ముంబైలో ఉగ్రదాడి జరిగినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. 2జీ, బొగ్గు గనుల కేటాయింపు, కామన్వెల్త్ క్రీడల కుంభకోణాలు యూపీఏలో పాలనలోనే చోటుచేసుకున్నాయి. 2004–2014 దశాబ్దం కుంభకోణాలమయంగా మారింది. దేశవ్యాప్తంగా ఉగ్రదాడుల వల్ల ప్రజల్లో అభద్రత నెలకొంది. 2014 నుంచి ఎన్డీయే సర్కారు పాలనలో మన దేశంలో స్టార్టప్‌ల బూమ్ పెరిగింది. ఉగ్రవాదాన్ని దీటుగా ఎదుర్కొంటున్నాం. మౌలిక సదుపాయాల కల్పన వేగంగా సాగుతోంది. మన దేశం ఇప్పుడు 'తయారీ కేంద్రం'గా ఎదుగుతోంది. ప్రపంచం తన భవిష్యత్తు, సౌభాగ్యాన్ని భారతదేశ అభివృద్ధిలో వెతుక్కుంటోంది. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం" అని ప్రధాని మోదీ వివరించారు. ప్రధాని ప్రసంగం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్, వామపక్షాల సభ్యులతోపాటు కొందరు కాంగ్రెస్ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు.


ఈడీకి కృతజ్ఞతలు తెలియజేయండి

ఎన్నికల ఫలితాలు చేయలేనని పనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చేసింది. ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది. అవినీతి వ్యవహారాలపై ఈడీ ముమ్మరంగా దర్యాప్తు చేస్తుండడంతో ప్రతిపక్షాలన్నీ చేతులు కలిపి, ఒకే వేదికపైకి వచ్చాయి. అందుకే విపక్ష నేతలు ఈడీకి కృతజ్ఞతలు తెలియజేయాలి. ప్రభుత్వ పథకాలతో కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకం విపక్షాలకు అర్థం కాదు. పొరుగు దేశాలతోపాటు చాలా దేశాల్లో ధరలు, నిరుద్యోగం, ఆహార సంక్షోభం వల్ల అల్లాడిపోతున్నా భారత్ మాత్రం ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా పురోగమించింది.

దృష్టికోణాన్ని బట్టే చూస్తారు

హిందీ వ్యంగ్య రచయిత కాకా హత్రాసీ, కవి దుష్యంత్ కుమార్ చెప్పిన ద్విపదలను మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. "అటూ ఇటూ ఎందుకు చూస్తారు. ఎవరైనా ఏదైనా వారి దృష్టికోణాన్ని బట్టే సన్నివేశాన్ని చూస్తారు" అని ప్రతిపక్షాలను ఉద్దేశించి చెప్పారు. అలాగే "మీ పాదాల కింద భూమి లేదు. ఆశ్చర్యం ఏమిటంటే మీరు ఇప్పటికీ ఆ విషయం నమ్మడం లేదు" అని అన్నారు.

'ప్లాస్టిక్' జాకెట్‌లో మోదీ



న్యూఢిల్లీ: బుధవారం రాజ్యసభ సమావేశంలో ప్రధాని మోదీ రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌తో తయారుచేసిన 'సద్రీ' జాకెట్‌తో కనిపించారు. లేత నీలిరంగులో హుందాగా కనిపిస్తున్న ఈ జాకెట్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) సంస్థ వారు సోమవారం బెంగళూరులో జరిగిన ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమంలో ప్రధానికి బహూకరించారు. ఐఓసీ వారు అన్‌బాటిల్డ్ కార్యక్రమంలో భాగంగా ఇలా ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి యూనిఫామ్‌లను తయారుచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులకు చెక్ పెట్టాలని గతంలో ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తమ సంస్థ రిటైల్ కస్టమర్ అటెండెంట్లకు, ఎల్‌పీజీ డెలివరీ సిబ్బందికి రీసైకిల్డ్ పాలీస్టర్(ఆర్‌పెట్), పత్తితో తయారైన యూనిఫామ్‌లను అందజేయనున్నట్లు ఐఓసీ తెలిపింది. 'వాతావరణ మార్పులకు తగ్గట్లు, సుస్థిరాభివృద్ధి కృషిచేసే మోదీ లేటెస్ట్ స్టైల్ ఇది' అంటూ పలువురు కేంద్ర మంత్రులు ట్వీట్లతో పొగిడారు. 28 వాడి పడేసిన పాలీఎథిలీన్ టెరెఫ్తాలేట్ పెట్ బాటిళ్లతో ఒక జత యూనిఫామ్ తయారుచేయొచ్చు. 'ఇది పర్యావరణహిత లైఫ్‌స్టైల్ మాత్రమేకాదు. అధునాతన ఫ్యాషన్ కూడా' అంటూ కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ ట్వీట్‌చేశారు.

కోరమ్ లేక వాయిదా

న్యూఢిల్లీ: సభలో కోరమ్ లేకపోవడంతో లోక్‌సభ బుధవారం సాయంత్రం మరుసటి రోజుకు వాయిదా పడింది. కేంద్ర బడ్జెట్‌పై డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు మాట్లాడిన తర్వాత సభలో కోరమ్ లేదన్న విషయాన్ని అదే పార్టీ ఎంపీ దయానిధి మారన్ లేవనెత్తారు. దీనిపై స్పీకర్ ఓంబిర్లా స్పందించారు. కోరమ్ బెల్లు మోగించాలని సిబ్బందికి సూచించారు. తగిన సంఖ్యలో సభ్యులను సమీకరించడంలో ప్రభుత్వ ఫ్లోర్ మేనేజర్లు విఫలమయ్యారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు.

కోరమ్ అంటే?

లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో కనీసం 10 శాతం మంది ఉంటేనే సభను నిర్వహించాలి. అంటే కనిష్టంగా 55 మంది సభ్యులు సభలో ఉండాలి. దీన్నే కోరమ్ అంటారు.

బీజేపీ చలవతోనే అదానీకి ఆస్తులు

- లోక్‌సభలో రాహుల్ ధ్వజం
- ఆధారాల్లేని ఆరోపణలు చేయొద్దన్న బీజేపీ



న్యూఢిల్లీ: అదానీపై హిండెన్‌బర్గ్ రిపోర్టు వ్యవహారం అధికార, ప్రతిపక్షాల నడుమ అగ్గిరాజేసింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో ఈ అంశాన్ని మరోసారి లేవనెత్తారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే గౌతమ్ అదానీ ఆస్తులు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రపంచ సంపన్నుల జాబితాలో 609వ స్థానం నుంచి ఎకాఎకిన రెండో స్థానానికి చేరుకున్నారని, ఇదంతా బీజేపీ చలవేనని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అదానీ గత 20 ఏళ్లలో ఎంత సొమ్ము ఇచ్చాడో బీజేపీ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యాపారం, రాజకీయం కలిస్తే ఏం జరుగుతుందో బిజినెస్ స్కూళ్లలో ఒక కేసు స్టడీగా అధ్యయనం చేయాలన్నారు. అదానీ సంపద 2014 నుంచి 2022 దాకా 8 బిలియన్ డాలర్ల నుంచి 140 బిలియన్ డాలర్లకు ఎలా పెరిగిందంటూ జోడో యాత్రలో జనం తనను అడిగారని అన్నారు. అక్రమాలకు పాల్పడిన అదానీని ప్రధాని నరేంద్రమోదీ కాపాడుతున్నారని ఆరోపించారు. అదానీపై వచ్చిన ఆరోపణలపై ఎందుకు దర్యాప్తు జరిపించడం లేదని అన్నారు.

అదానీ షెల్ కంపెనీల గుట్టు తేల్చండి

హిండెన్‌బర్గ్ నివేదికను సభలో రాహుల్ గాంధీ ప్రస్తావించారు. అదానీకి విదేశాల్లో షెల్ కంపెనీలు ఉన్నట్లు ఈ నివేదికలో పేర్కొన్నారని వెల్లడించారు. ఈ కంపెనీల గుట్టుమట్లను ప్రభుత్వం వెలికితీయాలని, ఇది దేశ భద్రతకు సంబంధించిన వ్యవహారమని స్పష్టం చేశారు. అదానీకి మేలు చేయడానికి నిబంధనలను సైతం ప్రభుత్వం మార్చేసిందని దుయ్యబట్టారు. లాభాల్లో ఉన్న ఎయిర్‌పోర్టులను అదానీకి అక్రమంగా కట్టబెట్టిందని ఆరోపించారు. ఎల్‌ఐసీ సొమ్మును నిలకడ లేని అదానీ కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టారని ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అగ్నివీర్ పథకాన్ని రాహుల్ తప్పుపట్టారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి కీలక అంశాలను రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావించకపోవడం దారుణమని రాహుల్ పేర్కొన్నారు.

ఆధారాలు చూపించండి: బీజేపీ

లోక్‌సభలో రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరోపణలు చేయడం కాదు, ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు.

రాహుల్ వ్యాఖ్యలు తొలగించాం..

లోక్‌సభలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ డిమాండ్ చేశారు. రాహుల్ మంగళవారం సభలో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించినట్లు చెప్పారు.

ఆగని మరణమృదంగం

11,200 దాటిన భూకంప మరణాల సంఖ్య

గజియాన్‌టెప్(తుర్కియే): భూకంప శిథిలాలను తొలగించేకొద్దీ వెలుగుచూస్తున్న విగత జీవులు.. ప్రాణాధార వ్యవస్థలు అందుబాటులోలేక రక్తమోడుతూ సాయం కోసం ఎదురుచూస్తున్న క్షతగాత్రులు..శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు కాలంతో పోటీపడుతూ నిర్విరామంగా శ్రమిస్తున్న సహాయక సిబ్బంది, స్థానికులు.. ఎటుచూసినా ఆప్తుల ఆక్రందనలు, మిన్నంటిన రోదనా దృశ్యాలతో తుర్కియే, సిరియా భూకంప ప్రభావ ప్రాంతాలు భయానకంగా తయారయ్యాయి. దశాబ్దకాలంలో ఎన్నడూలేనంతటి ఘోర మృత్యుకంపం ధాటికి ఇరుదేశాల్లో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య తాజాగా 11,200 దాటేసింది.

భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఎర్డోగన్ పర్యటన

సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ హతే ప్రావిన్స్, కహ్రామన్‌మరాస్ పట్టణం, భూకంప కేంద్రం గుర్తించిన పజార్‌సిక్ పట్టణాల్లో పర్యటించారు. క్షతగాత్రులతో నిండిన తాత్కాలిక 'టెంటుల సిటీ'లో బాధితులతో మాట్లాడారు. 'ఎవరినీ ఇలా వీధుల్లో వదిలేసి వెళ్లిపోము. అందరినీ ఆదుకుంటాం' అని హామీ ఇచ్చారు. భూకంపం మిగిల్చిన విషాదం మొదలై రెండ్రోజులైన తర్వాత కహ్రామన్‌మరాస్‌పట్టణంలో శిథిలాల నుంచి మూడేళ్ల బాలుడు ఆరిఫ్ ఖాన్‌ను సురక్షితంగా బయటకు తీయగలిగారు. అదియామన్ సిటీలో పదేళ్ల బాలిక బీటల్ ఎడీస్‌ను కాపాడారు. కుప్పకూలిన వేలాది భవంతుల కింద చిక్కుకున్న వారి కోసం కొనసాగుతున్న అన్వేషణకు గడ్డకట్టే చలి, మంచు పెద్ద అవరోధంగా మారాయి. తుర్కియేలోని మలాట్యా సిటీలో వీధి పొడవునా మృతదేహాలు ఉంచి మార్చురీ వాహనాల కోసం జనం ఎదురుచూస్తున్న దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. మైనస్ ఆరు డిగ్రీ సెల్సియస్ వాతావరణంలో శిథిలాల్లో కొందరు చలికే గడ్డకట్టుకుని చనిపోయి ఉంటారని సహాయక సిబ్బందిలో ఒకరైన పికల్ వ్యాఖ్యానించారు. టర్కీ అత్యవసర సిబ్బందికి దాదాపు డజను దేశాల నుంచి ఆగమేఘాల మీద వచ్చేసిన సహాయక బృందాలు జతకలిసి బాధితుల అన్వేషణలో బిజీగా మారాయి.



తుర్కియేలోని అంటాక్యాలో ఆహారం కోసం పోటీ

సిరియాలో పరిస్థితి దారుణం

తుర్కియేతో సత్సంబంధాల కారణంగా చాలా దేశాలు తమ బృందాలను ఆ దేశానికి పంపి సాయపడుతున్నాయి. కానీ, అంతర్యుద్ధం, ద్వైపాక్షిక సంబంధాలు బొత్తిగాలేని సిరియాకు ఇతర దేశాల నుంచి సాయం సరిగా అందట్లేదు. దీంతో అక్కడ సహాయక చర్యలు చాలా తక్కువగా జరుగుతున్నాయి. దీంతో శిథిలాల్లో బాధితుల ఆక్రందనలు అరణ్యరోదనలయ్యాయి. సిరియాను ఆదుకునే మార్గాలను అన్వేషిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి తెలిపింది. భూకంపంతో ఆ దేశాల్లో 2.3 కోట్ల ప్రజల బ్రతుకులు దుర్భరంగా మారనున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది.

భారత్ నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

ఇప్పటికే రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పంపిన భారత్ మరో బృందాన్నీ తుర్కియేకి పంపనుంది. 'తుర్కియేలో 11 మంది భారతీయులు చిక్కుకున్నారు. వారిలో ఒకరి జాడ తెలియాల్సిఉంది. మిగతావారు క్షేమం' అని భారత విదేశాంగ శాఖ బుధవారం తెలిపింది. మరోవైపు ఆరు టన్నుల సహాయక సామగ్రిని సిరియాకు భారత్ అందజేసింది.

నాలుగు హైకోర్టులకు సీజేలను సిఫార్స్ చేసిన కొలీజియం

న్యూఢిల్లీ: పట్నా, హిమాచల్ ప్రదేశ్, గువాహటి, త్రిపుర హైకోర్టులకు నూతన ప్రధాన న్యాయమూర్తులను ఎంపికచేస్తూ కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులు పంపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియంలో జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్ సభ్యులుగా ఉన్నారు. కేరళ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ను పట్నా హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా, జస్టిస్ సబీనాను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుకు సీజేగా, త్రిపుర హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ను, జస్టిస్ సందీప్ మెహతాను గువాహటి హైకోర్టు సీజేగా ఎంపికచేయాలంటూ కొలీజియం.. కేంద్రప్రభుత్వానికి తాజాగా సిఫార్సుచేసింది.

45 మంది కోటీశ్వరులు, 41 మందిపై క్రిమినల్ కేసులు

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులపై ఏడీఆర్ నివేదిక

అగర్తాలా: త్రిపుర అసెంబ్లీకి ఈ నెల 16న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న 259 మంది అభ్యర్థుల్లో 45 మంది కోటీశ్వరులని, 41 మంది క్రిమినల్ కేసులున్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. కోటీశ్వరుల్లో అధికార బీజేపీకి చెందిన అభ్యర్థులు 17 మంది ఉంటే, టిప్రామోతాకి చెందిన వారు తొమ్మిది మంది, సీపీఐ(ఎం) అభ్యర్థులు ఏడుగురు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆరుగురు కోట్లకు పడగలెత్తితే, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన వారు నలుగురు ఉండగా, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా కోటీశ్వరులేనని ఆ నివేదిక చెప్పింది. త్రిపుర ఉప ముఖ్యమంత్రి జిష్ణు దేవ్ వర్మ రూ.15.58 కోట్ల ఆస్తులతో అత్యంత ధనికుడిగా ఉంటే రూ.13.90 కోట్ల ఆస్తిపాస్తులతో రాష్ట్ర ముఖ్యమంత్రి , డాక్టర్ కూడా అయిన మాణిక్ సాహ నిలిచారు. ఇక 41 మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులున్నాయని అఫిడవిట్లో దాఖలు చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన 13 మంది అభ్యర్థుల్లో ఏకంగా ఏడుగురిపై క్రిమినల్ కేసులున్నాయి.

రష్యా యుద్ధంలో ఓడిపోతుంది

బ్రిటన్ పార్లమెంటులో జెలెన్‌స్కీ ప్రసంగం



సునాక్‌తో జెలెన్‌స్కీ కరచాలనం

లండన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం ఆకస్మికంగా బ్రిటన్ పర్యటనకు వచ్చారు. పార్లమెంటునుద్దేశించి ప్రసంగించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలు పెట్టిన తర్వాత ఆయన బ్రిటన్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ యుద్ధంలో రష్యా ఓడిపోతుందని జెలెన్‌స్కీ జోస్యం చెప్పారు. యుద్ధం మొదలైన మొదటి రోజు నుంచి తమకు అండదండగా ఉన్న బ్రిటన్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "ధైర్యసాహసాలు కలిగి ఉన్న మా సైనికుల తరఫున నేను మీ ఎదుట నిలబడి ఉన్నాను. ప్రస్తుతం మా సైన్యం శతఘ్నుల కాల్పుల మధ్య పోరాటం చేస్తోంది" అని జెలెన్‌స్కీ వెస్ట్‌మినిస్టర్ హాలులో సమావేశమైన బ్రిటన్ ప్రజాప్రతినిధుల సమక్షంలో చెప్పారు. అంతకు ముందు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌కి అన్ని విధాలా అండగా ఉంటామని సునాక్ స్పష్టం చేశారు.

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని పునరుద్ధరిస్తేనే భారత్‌తో పాక్ సంబంధాలు: ఇమ్రాన్


లాహోర్: భారత్–పాకిస్తాన్ మధ్య చర్చలు మొదలై, సంబంధాలు మెరుగుపడాలంటే కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని పునరుద్ధరించాలని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ స్పష్టం చేశారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం 2019లో అన్యాయంగా రద్దు చేసిందని అన్నారు. ప్రతిపత్తిని పునరుద్ధరించే దిశగా మోదీ ప్రభుత్వం చర్చలు తీసుకోవాలని సూచించారు.

మనకు ముప్పు ఎంత?

- 60% భూభాగానికి భూకంప ప్రమాదం ఎక్కువే
- హిమాలయాల్లో ఎప్పుడైనా భూకంపం వచ్చే ఛాన్స్

హిమాలయాల్లో భూమి పొరల్లో పెరిగిపోతున్న ఒత్తిడి మనల్ని భయపెడుతోంది. ఢిల్లీ పరిసర ప్రాంతాలకు ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన నెలకొంది. తుర్కియే, సిరియాల్లో భూకంపం మన దేశంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, భారత్‌లను త్వరలోనే పెను భూకంపం అతలాకుతలం చేస్తుందన్న అంచనాలున్నాయి. ఇంతకీ భారత్‌కి ఉన్న ముప్పు ఎంత ?

నేలకింద భూమి ఉన్నట్టుండి కదిలిపోతే, మిన్ను విరిగి మీదపడినట్టు ఆకాశన్నంటే భవనాలు కుప్పకూలిపోతే, మన నివాసాలే సమాధులుగా మారి మనల్ని మింగేస్తే ఆ ప్రకృతి విలయం ఎంత భయంకరం..? తుర్కియే, సిరియాల్లో కుదిపేసిన పెను భూకంపంతో భారత్‌కు భూకంపం ముప్పు ఎంత అనే చర్చ జరుగుతోంది. తుర్కియే భూకంపాన్ని ముందే అంచనా వేసిన డచ్ అధ్యయనకారుడు ఫ్రాంక్ హూగర్‌బీట్స్ భారత్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లలో త్వరలో భూకంపం వస్తుందని హెచ్చరించడం గుబులు రేపుతోంది. మన దేశంలో 60శాతం భూభాగం భూకంపం ముప్పు జోన్‌లో ఉన్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ 2022 డిసెంబర్‌లో పార్లమెంటులో వెల్లడించింది. మన దేశంలో భూకంప ముప్పు వచ్చే ప్రాంతాలను



నాలుగు జోన్లుగా విభజించారు. ఇందులో జోన్ అయిదులో ఉంటే అత్యంత ప్రమాదకరమని, రెండో జోన్‌లో ఉంటే ముప్పు అత్యంత స్వల్పంగా ఉంటుంది.

తీవ్ర ముప్పులో ఢిల్లీ

ఢిల్లీ, దాని పక్కనే ఉన్న గురుగ్రామ్‌కు భూకంప ముప్పు అత్యంత ఎక్కువని భూగర్భ శాస్త్రవేత్తలు ఎప్పట్నుంచో హెచ్చరిస్తున్నారు. నేషనల్ కేపిటల్ రీజియన్ హిమాలయాలకు దగ్గరగా ఉండడంతో ప్రమాదం ఎక్కువగా ఉంది. అంతేకాకుండా భూపొరల్లో ఫలకాల రాపిడికి ఏర్పడే ఫాల్ట్ లైన్లు యాక్టివ్‌గా ఉన్న సోహనా, మథుర, ఢిల్లీ–మొరాదాబాద్ వల్ల కూడా ఢిల్లీ ప్రమాదంలో ఉంది.

హిమాలయాలు యమడేంజర్

ప్రపంచంలో వివిధ ఖండాల్లో ఉన్న దేశాలను పెను భూకంపంతో అతలాకుతలం చేసే భూకంప కేంద్రం హిమాలయాలేనని శాస్త్రవేత్తలు ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచ దేశాల్లో భూకంప ముప్పు అధికంగా ఉండే ప్రాంతం హిమాలయాలే అని ఎన్నో ఘటనలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో 2,400 కి.మీ. పొడవునా హిమాలయాల్లో ఎక్కడైనా భూకంప కేంద్రం ఉండే అవకాశం ఉంది. హిమాలయ భూమి పొరల్లో టెక్టానిక్ ప్లేట్స్‌పై 700 ఏళ్లుగా అత్యంత ఒత్తిడి ఉంది. ఫలకాలు కదులుతూ ఉండడం వల్ల అంచులపై ఒత్తిడి పెరిగిపోతూ వస్తోంది. దీంతో ఏ క్షణంలోనైనా భూకంపం రావొచ్చు లేదంటే 200 ఏళ్ల తర్వాత తర్వాతైనా రావచ్చునని, ఇది మధ్య హిమాలయాలపై పెను ప్రభావం చూపిస్తుందని 2016లోనే శాస్త్రవేత్తలు హెచ్చరించారు. హిమాలయాల్లో కంగారాలో 1905లో భూకంపం వచ్చింది. 1934లో హిమాలయ కేంద్రంగా నేపాల్, బిహార్‌లో భూకంపానికి 10 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 1991లో ఉత్తరకాశిలో వచ్చిన భూకంపంలో 800 మంది మరణించారు. ఇక 2005లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సంభవించిన భూకంపానికి 80 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. హిమాలయాలు కాకుండా 2001లో గుజరాత్‌లో కచ్‌లో వచ్చిన భూకంపంలో 20 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదం. భారత్, యూరోషియన్ ప్లేట్స్ తరచూ రాపిడి కారణంగా చిక్కుకుపోతూ ఉండడంతో హిమాలయాలకు ముప్పు ఎక్కువగా ఉంటోందని వాడియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియోలజీలో జియోఫిజిసిస్ట్ అజయ్ పాల్ వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

జోన్ 5

- వెరీ హై రిస్క్ జోన్ : రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 9 అంతకంటే ఎక్కువ వచ్చే ఛాన్స్
- దేశ భూభాగంలో ఇది 11%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** కశ్మీర్‌లో కొన్ని ప్రాంతాలు హిమాచల్ ప్రదేశ్ పశ్చిమ భాగం , ఉత్తరాఖండ్ తూర్పు ప్రాంతం, గుజరాత్‌లో రణ్ ఆఫ్ కచ్, ఉత్తర బిహార్, ఉత్తరాది రాష్ట్రాలు, అండమాన్ నికోబర్ దీవులు

జోన్ 4

- **హైరిస్క్ జోన్ :** భూకంప తీవ్రత 8 వరకు నమోదయ్యే అవకాశం
- ఈ జోన్‌లో ఉన్న ప్రాంతాల్లో రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 8 వరకు వచ్చే ఛాన్స్
- దేశ భూభాగంలో ఇది 18%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** కశ్మీర్‌లో మిగిలిన ప్రాంతం, లద్దాఖ్, హిమాచల్‌లో మిగిలిన భాగాలు పంజాబ్, హరియాణాలో కొన్ని భాగాలు, ఢిల్లీ, సిక్కిమ్, యూపీ ఉత్తర ప్రాంతం, బిహార్‌లో కొన్ని ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్రలో కొన్ని భాగాలు, పశ్చిమ రాజస్తాన్

జోన్ 3

- **మధ్య తరహా ముప్పు:** ఈ జోన్‌లో భూకంప తీవ్రత 7 వరకు వచ్చే అవకాశం
- దేశ భూభాగంలో ఇది 31%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** కేరళ, గోవా, లక్షద్వీప్ దీవులు, ఉత్తరప్రదేశ్, హరియాణాలో కొన్ని ప్రాంతాలు, గుజరాత్‌లో మిగిలిన ప్రాంతాలు, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ప్రాంతాలు, పశ్చిమ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలు, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశాలో కొన్ని ప్రాంతాలతో పాటు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ. తమిళనాడు, కర్ణాటకలో కొన్ని ప్రాంతాలు కూడా జోన్ 3లోకి వస్తాయి

జోన్ 2

- **లో రిస్క్ జోన్ :** భూకంప తీవ్రత 6 అంతకంటే తక్కువగా నమోదయ్యే ప్రాంతాలు
- దేశ భూభాగంలో ఇది 40%
- **ఈ జోన్‌లోని ప్రాంతాలు:** రాజస్థాన్, హరియాణా, ఎంపీ, మహారాష్ట్ర, ఒడిశా, ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో మిగిలిన ప్రాంతాలకు ముప్పు పెద్దగా లేదనే చెప్పొచ్చు.

సాక్షి
కరీంనగర్
గురువారం, 9, ఫిబ్రవరి, 2023



గోదావరిలో పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురిలోని పవిత్ర గోదావరిలో బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు.



ధర్మగుండానికి మరో మార్గం

వేములవాడ: రాజన్న ఆలయ ధర్మగుండంలోకి భక్తులు వచ్చేందుకు గుడిచెరువు ఖాళీ స్థలం నుంచి కొత్తగా రోడ్డు వేశారు. ఈ మార్గాన్ని బుధవారం ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
32.0/17.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

కరీంనగర్: మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎం ఖుస్రో షా ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ శైవక్షేత్రాలకు సైతం బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈనెల 17,18,19 తేదీల్లో కరీంనగర్ నుంచి 80 బస్సులు, కోరుట్ల నుంచి 60, మెట్‌పల్లి నుంచి 60, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి 42, కొండగట్టు/జగిత్యాల నుంచి 37, సిరిసిల్ల నుంచి 11, వరంగల్–హుజూరాబాద్ నుంచి 45 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వేములవాడ బస్టాండ్ నుంచి గుడి వరకు 14 మినీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

- వేలాల జాతరకు గోదావరిఖని, మంథని డిపోల నుంచి, కాళేశ్వరానికి మంథని, కరీంనగర్, గోదావరిఖని డిపోల నుంచి రద్దీని బట్టి బస్సులు నడుపుతామని తెలిపారు. జగిత్యాలలోని దుబ్బరాజన్న, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి జాతరకు, మంథని నుంచి సిరొంచకు ఆరు బస్సులు భక్తుల రద్దీని బట్టి నడుపుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆర్మూర్, నర్సంపేట, వరంగల్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి నుంచి కూడా వేములవాడ దేవస్థానానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,650



వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తిమార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,650 పలికింది. బుధవారం మార్కెట్‌కు 103 వాహనాల్లో 1,340 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,650, మోడల్ ధర రూ.7,450, కనిష్ట ధర రూ.7,000 పలికింది. గన్నీసంచుల్లో 21మంది రైతులు 26 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400, మోడల్ ధర రూ.7,250, కనిష్ట ధర రూ.6,000 ఖరీదుకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ క్రయ విక్రయాలను పర్యవేక్షించారు.



కొండగట్టుకు మాస్టర్‌ప్లాన్

కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు మంజూరు చేశారు. గత డిసెంబరు 7న జగిత్యాల సభలో స్వామివారికి రూ.100 కోట్లు ఇస్తామన్న సీఎం.. సరిగ్గా 50 రోజులకు తన మాట నిలబెట్టుకున్నారు. రానున్న 50 ఏళ్లలో భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాల్సి ఉందని, ప్రత్యేక ప్రణాళికతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు.



నాంపల్లి గుట్టకు రోప్‌వే

వేములవాడను తీర్చిదిద్దే క్రమంలో మంత్రి కేటీఆర్ సూచనల మేరకు నాంపల్లిగుట్టపై రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం జరగనుంది. వేములవాడకు వచ్చే కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వేట్రాక్ నాంపల్లి గుట్టను ఆనుకుంటూ వెళ్లనుంది. దీంతో హైదరాబాద్, మేడ్చల్, గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదకరంగా ఉండేలా ఇక్కడి పరిసరాలను తీర్చిదిద్దనున్నారు. ఈ పనులపై కేటీఆర్ ఇప్పటికే సమీక్షించారు కూడా.

రాజన్నకు 50 కోట్లు.. అంజన్నకు 100 కోట్లు..



బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని రెండు ప్రధాన ఆలయాలకు నిధుల కేటాయింపు

- నాంపల్లి గుట్టపై త్వరలో రోప్‌వే ఏర్పాటు
- కోటిలింగాల, గోదావరిఖని, ఎల్‌ఎండీలలో మరిన్ని పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న ఆలయాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం దక్కినట్లయ్యింది. మొన్న రాజన్న ఆలయానికి రూ.50 కోట్లు కేటాయించిన సర్కారు.. తాజాగా కొండగట్టుకు రూ.100 కోట్లు ప్రకటించింది. దీంతో ఆలయాల అభివృద్ధికి ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న ఘడియలు వచ్చినట్లయ్యింది.


ఎములాడ జంక్షన్ల సుందరీకరణ..

రాజన్న గుడి అభివృద్ధిపై సీఎం కేసీఆర్ 18 జూన్ 2015న స్వయంగా గుడి, పట్టణం కలియ తిరిగారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఇందుకు ఏటా రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని ప్రకటించారు.

- ముందుగా రూ.71 కోట్లు మంజూరు చేశారు. అనంతరం వీటీడీఏ ఏర్పాటు చేసి కమిటీనీ ప్రకటించారు. చైర్మన్‌గా సీఎం కేసీఆర్, వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పురుషోత్తంరెడ్డిని నియమించారు. నిధులను వీటీడీఏ ద్వారానే ఖర్చు చేయాలని జీవో విడుదల చేశారు.
- ఆ మేరకు ఆలయ అధికారులు రూ.410 కోట్లతో భక్తుల సౌకర్యాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. గతేడాది, ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు.
- తాజా నిధులతో బద్దిపోచమ్మ గుడి వద్ద సేకరించిన భూమికి ప్రహరీ, బోనాల మంటపం నిర్మిస్తామని వీటీడీఏ వైస్ చైర్మన్ వెల్లడించారు. నగరమంతా ఫుట్‌పాత్‌ల నిర్మాణం, గుడి ట్యాంక్‌బండ్‌పై వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ పనులు చేపడతామని, నందికమాన్ నుంచి వేములవాడకు చేరుకునే రోడ్డు సుందరీకరణ, జంక్షన్లు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

కాళేశ్వరం టూరిజం సర్క్యూట్

రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక కాళేశ్వరం.. దాని అనుబంధ ప్రాజెక్టుల వద్ద పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ పేరిట బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించింది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ, గోదావరిఖని వంతెన, కోటిలింగాల బ్యాక్ వాటర్, లోయర్, మధ్య, ఎగువ మానేరు డ్యామ్‌ల వద్ద పర్యాటక అభివృద్ధికి ఈ నిధులు వెచ్చించనున్నారు. అయితే ఉమ్మడి జిల్లాను పర్యాటక క్షేత్రంగా మలచాలన్న ప్రభుత్వ లక్ష్యం ఎప్పటిలోగా నెరవేరుతుందోనన్న విషయం ఆసక్తికరంగా మారింది.



వేములవాడ రాజన్న ఆలయం



గోదావరినదిలో పడవల పోటీ(ఫైల్)

కాసులిస్తే సై.. లేదంటే నై..

- ఎంసీహెచ్‌లో సిబ్బంది ఇష్టారాజ్యం



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది తీరు మారడం లేదు. నిన్నామొన్నటి వరకు అడ్డగోలుగా వసూళ్లకు తెగబడిన సిబ్బందికి.. ఇటీవల తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ ఇబ్బందిగా మారింది. వసూళ్లకు పాల్పడితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఆదేశాలు జారీ చేయడమే కాకుండా.. కింది స్థాయి సిబ్బంది వసూళ్లకు పాల్పడితే ఉన్నతాధికారులను బాధ్యులను చేస్తానని కమిషనర్ హెచ్చరించారు. దీంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. డబ్బులు ఎవరికి ఇవ్వవద్దని ఆసుపత్రిలో పేషెంట్లకు తెలిసేలా ప్రచారం చేయడం.. వసూళ్లపై అధికారులు నిఘా పెట్టడంతో వసూలు రాజాలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతోంది. ఇన్నాళ్లు పేషెంట్లను ఇబ్బందులు పెట్టి డబ్బులు వసూలు చేసి సేవలు అందించిన సిబ్బంది.. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకపోవడంతో ఆ ప్రభావం సేవలపై చూపిస్తున్నారు. గర్భిణులు, బాలింతలను పట్టించుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గర్భిణులు, బాలింతల సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

ఫిర్యాదుదారులకు సంతృప్తికర సేవలందించాలి



కరీంనగర్‌క్రైం: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులు సంతృప్తిచెందేలా రిసెప్షన్ అధికారులు సేవలందించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్లలోని రిసెప్షన్ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి బుధవారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీపీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులకు కనీస మర్యాదనిచ్చి వారికి కేటాయించిన సీట్లలో కూర్చోబెట్టి సమస్యలను ఓపికగా విని, సత్వరం పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏరోజుకు సంబంధించిన వివరాలను ఆరోజు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. సమర్థవంతమైన సేవల ద్వారానే గుర్తింపు లభిస్తుందని అన్నారు. అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్, ఏసీపీ కాశయ్య, కరీంనగర్ రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు పాల్గొన్నారు.

ఏసీబీ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు అందించారు. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య 91543 88954, సీఐ పి.రవీందర్ 91543 88957, సీఐ జె.రాము 91543 88956, సీఐ ఏ.తిరుపతి 91543 88955 ఈ నంబర్లలో అందుబాటులో ఉండనున్నారు.

> 'ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ కెమికల్ కంపెనీ విద్యార్థులకు రూ.16వేల జీతంతో ఉద్యోగాలు ప్రకటించగా.. కరీంనగర్‌కు చెందిన విద్యార్థులకు టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారమందించారు. ఇందులో చాలా మంది ఇంటర్వ్యూలకు హాజరవగా నలుగురు కూడా రిపోర్టు చేయలేదు. డిగ్రీ పూర్తి చేసినవారికి రూ.16 వేల జీతమిచ్చినా ఉద్యోగాల్లో చేరడం లేదు.'

> 'ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఓ విద్యార్థినికి ఒక కంపెనీల్లో ఉద్యోగం వచ్చింది. ఇంటర్వ్యూకు పంపించిన తల్లిదండ్రులు వివిధ కారణాలు చెప్పి ఉద్యోగానికి పంపించలేదు. దీంతో కంపెనీవారు సదరు ఉద్యోగం వేరే వారికి కేటాయించారు. అయితే ఇన్ని రోజులు స్కిల్స్ నేర్చుకొని ఉద్యోగం సాధించిన విద్యార్థిని ఇంటివద్దే ఉండిపోయింది. ఇలాగే చాలా మంది ఏళ్ల తరబడి శిక్షణ పొంది పలు ఇంటర్వ్యూలకు హాజరవడం లేదు. మరికొందరు ఉద్యోగం వచ్చినా వెళ్లడం లేదు'.

ఉద్యోగాలు వద్దట..!

- నైపుణ్యాల మెరుగుదిద్దుతున్న టాస్క్
- శిక్షణ వరకే పరిమితమవుతున్న విద్యార్థులు
- ఉద్యోగాల ఇంటర్వ్యూలపై అనాసక్తి
- తల్లిదండ్రులు పంపకపోవడమే ప్రధాన కారణం
- వేతనాలు చాలవని మరికొందరి వెనుకంజ
- ప్రభుత్వ తపన వృథా అంటున్న నిపుణులు
- కొలువులతోనే బంగారు భవిత అంటున్న వైనం



టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుదిద్ది ఉద్యోగాలు సాధించే దిశగా తయారు చేయాలని ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ని రూపొందించింది. ఇందులో భాగంగా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్‌తో పాటు వివిధ కోర్సుల విద్యార్థులను, కళాశాలలను టాస్క్‌లో నమోదు చేయించి ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నమోదైన ప్రతీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. కాగా శిక్షణ తీసుకున్న విద్యార్థులు అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రుల అనాసక్తి అని తెలుస్తోంది.

ఉద్యోగాలపై అనాసక్తి...

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 62 కళాశాలలు టాస్క్‌లో నమోదు చేసుకున్నాయి. వీటిలో గతేడాది దాదాపు 2 లక్షల మంది నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 4,300 మంది నమోదు చేసుకున్నారు. టాస్క్ ప్రతినిధులు విడతల వారీగా కమ్యూనికేషనల్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, రెజ్యూమ్ సెట్టింగ్, ప్రజెంటేషన్ స్కిల్స్, అపిటిట్యూడ్, టీం వర్క్, గ్రూప్ డిస్కషన్, ప్రోగ్రామింగ్ టెక్నిక్స్‌తో పాటు విద్యార్థుల కోర్సులను బట్టి అవసరమయ్యే వివిధ రకాల నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. కంపెనీలకు, విద్యార్థులకు అనుసంధానం చేస్తూ కార్పొరేట్ కంపెనీలు కోరుకునే స్కిల్స్‌లో పటిష్టంగా శిక్షణ ఇస్తున్నారు. కానీ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్వ్యూల వరకు వెళ్లడం లేదు. టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారం అందించినా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇందులో ముఖ్యంగా డిగ్రీ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం. జీతభత్యాలు లెక్కించి ఏమీ మిగలవని చెప్పి తల్లిదండ్రులే ఇంటి వద్దే ఆపేస్తుండగా, డిగ్రీతోనే లక్షల ప్యాకేజీ ఊహించుకున్న విద్యార్థులు కంపెనీలు అందిస్తున్న అవకాశాలను వదులుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగాటాస్క్‌లో నమోదైన కళాశాలల వివరాలు

జిల్లా	ఇంజినీరింగ్	డిగ్రీ	డిగ్రీ, పీజీ	డిప్లొమా	మొత్తం
కరీంనగర్	7	11	8	3	29
పెద్దపల్లి	3	4	5	1	13
రాజన్నసిరిసిల్ల	1	3	1	1	6
జగిత్యాల	1	7	5	1	14
మొత్తం	12	25	19	6	62

ఉద్యోగాల్లో చేరితేనే ఉజ్వల భవిష్యత్తు



టాస్క్‌లో నమోదైన విద్యార్థులకు ఎప్పటికప్పుడు శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలకు కావాల్సిన మెలకువలు నేర్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఇంట ర్వ్యూలకు దూరం కాగా మరికొందరు ఉద్యోగాల్లో ఎంపికైనా జాయిన్ కావడం లేదు. తల్లిదండ్రులు పంపించకపోవడమూ ఒక కారణమే. డిగ్రీ తర్వాత వేతనాలు మొదట్లో కొన్ని సంస్థల్లో తక్కువగా ఉండి తర్వాత పెరుగుతాయి. ఉద్యోగం చేస్తూ పోతే అనుభవం పెరిగిన కొద్ది వేతనాలు పెంచుతారు. ఉద్యోగం చేస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి.

– గంగాప్రసాద్, టాస్క్ రీజనల్ కోఆర్డినేటర్

లక్షల్లో ప్యాకేజీలని ఊహలు

డిగ్రీ, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు కంపెనీలు ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇందులో భాగంగా కంపెనీలు మొదట్లో తక్కువ వేతనాలు ప్రకటిస్తుండగా, జీతాలు రూ.లక్షల్లో ఊహించుకుంటున్న విద్యార్థులు అటువైపు వెళ్లడంలేదు. పోటీ పడి స్కిల్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంపై ఆసక్తి చూపడం లేదు. తద్వారా రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు. యువతరానికి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా కల్పించాలనే ప్రభుత్వ తపన వృథా అవుతుందని బాధపడుతున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు వారి పంతా మార్చుకొని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్నారు.

నేడు, రేపు సుకన్య సమృద్ధి యోజన ప్రత్యేక మేళా

విద్యానగర్ (కరీంనగర్): బేటి బచావో, బేటి పఢావో నినాదంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన ఖాతా (ఎస్ఎస్‌వైఏ) ప్రత్యేక మేళాను గురు, శుక్రవారాల్లో అన్ని పోస్టాఫీసుల్లో నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. అమ్మాయిల భవిష్యత్తుకు కొండంత అండగా నిలుస్తున్న ఈ పథకం అప్పుడే పుట్టిన పాప నుంచి పదేళ్లలోపు వయస్సు ఉన్న అమ్మాయిలకు వర్తిస్తుందని, అమ్మాయి పేరున రూ.250తో ఖాతా ప్రారంభించి తరువాత నెలకు వీలైనంత డబ్బును సంవత్సరానికి లక్ష యాభై వేల వరకు 15 సంవత్సరాలు జమ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తరువాత ఆరు సంవత్సరాల వడ్డీతో కలిపి అమ్మాయికి 21 సంవత్సరాలు వచ్చిన తరువాత పూర్తి మెచ్యూరిటీ డబ్బు చెల్లించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

సహకారశాఖ డైరీ ఆవిష్కరణ



కరీంనగర్ అర్బన్: జిల్లా సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డైరీని బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని సంఘ కార్యాలయంలో డీసీవో శ్రీమాల, జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి దారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా.. జిల్లా ఆడిట్ అధికారి మనోజ్‌కుమార్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్, కార్యదర్శి ప్రీతిపాల్‌సింగ్, కోశాధికారి ఎస్.మనోజ్, నేతలు తిరుమల్‌రావు, రాజమౌళి, రామచంద్రు, కరణ్‌కుమార్, జమునారాణి, శైలజ, స్వర్ణలత, బి.రాములు, లక్ష్మణచారి, ప్రతాప్‌రావు, అహ్మద్ అలీ, నిర్మల, కావ్య, మహ్మద్ అలీం, సయ్యద్ సాజిద్‌పాషా, వనజ, లత, సుధా, హసీనా, తాసీన్ సుల్తానా, సైదాబేగం, రమ్య, రూపేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక యాజమాన్యంపై నేడు అవగాహన

కరీంనగర్ అర్బన్: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య పద్ధతులు, యాంత్రీకరణపై గురువారం కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్‌సీ)లో మేళా నిర్వహిస్తున్నట్లు ఏఆర్‌సీ హెడ్ డీన్ డా.మంజులత తెలిపారు. పరిమిత రైతులతో సదస్సు నిర్వహిస్తుండగా కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. కేంద్రం 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని.. పౌష్టికాహారం, ఆరోగ్య ప్రయోజనాలపై విశ్లేషణ ఉంటుందని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ వ్యక్తి బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ముకరంపుర ప్రాంతానికి చెందిన తుమ్మ గగన్ (32) గతంలో ప్రైవేటు ఫైనాన్స్‌లో పని చేశాడు. కరోనా సమయంలో ఉద్యోగం పోవడంతో మద్యానికి బానిసయ్యాడు. దానికి తోడు ఆర్థిక ఇబ్బందులు తీవ్రతరం అయ్యాయి. తీవ్ర మనోవేదనకు గురైన గగన్ బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలానికి టూ టౌన్ పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు.

మందుబాబులపై పోలీసుల కొరడా

- కమిషనరేట్ వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లు
- పట్టుబడిన 60 మంది వాహనదారులు
- ప్రత్యక్షంగా తనిఖీలు చేసిన సీపీ సుబ్బారాయుడు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను పర్యవేక్షిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా సీపీ ఎల్.సుబ్బారాయుడు నేతృత్వంలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ టౌన్, ట్రాఫిక్, కరీంనగర్‌రూరల్, హుజూరాబాద్ డివిజన్లలో జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 60 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరికి కుటుంబసభ్యుల సమక్షంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టుల హాజరుపరిచారు.

సీపీ ప్రత్యక్షంగా తనిఖీలు

మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన తనిఖీల్లో సీపీ ఎల్.సుబ్బారాయుడు రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో తిరిగారు. ప్రత్యక్షంగా తనిఖీలను పర్యవేక్షించారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి విగ్రహం, అంబేద్కర్ స్టేడియం, ఆర్టీసీ ఆసుపత్రి, వివేకానందనగర్, మంచిర్యాల చౌరస్తాలో తనిఖీలను పరిశీలించారు. కమిషనరేట్‌లోని కరీంనగర్ రూరల్ డివిజన్‌లో 22, ట్రాఫిక్ డివిజన్‌లో 31, హుజూరాబాద్ డివిజన్‌లో ఏడుగురు వాహనదారులను పట్టుకున్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు బృందాలుగా ఏర్పడి ఏక కాలంలో ఈ తనిఖీలను నిర్వహించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కినవారికి కౌన్సెలింగ్

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుపడిన వారికి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఏసీపీ జి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి.. కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. ఇకనుంచి రేయింపగలు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు. ఈనెలలో ఇప్పటి వరకు 110 మందిని కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. సీఐ తిరుమల్, సిబ్బంది ఉన్నారు.

ప్రమాదాల నియంత్రణకు తనిఖీలు

మద్యం సేవించి వాహనాలు నడుపుతుండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని నియంత్రించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలకు అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారం అందజేస్తున్నారు.

– ఎల్.సుబ్బారాయుడు, కరీంనగర్ సీపీ

జెడ్పీ సీఈవోకు అభినందనలు



జెడ్పీ సీఈవోను అభినందిస్తున్న డీపీవో, అధికారులు

కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ జిల్లా పరిషత్ సీఈవో ప్రియాంకకు ప్రభుత్వం ఐఏఎస్ హోదా కల్పించడంతో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కె.విజయ, జెడ్పీ డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్, డీఎల్‌పీవో హరికిషన్, ఎంపీవోలు జగన్మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రాజగోపాల్, సురేందర్, వెంకటేశ్వర్లు ఉన్నారు. అదేవిధంగా ఎంపీడీవో అధికారుల సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలగిరి దివ్యదర్శన్ రావు, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఈసీ సభ్యుడు చింతల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానం, డీజేలపై నిషేధం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమలులో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 15వరకు పొడిగించినట్లు సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా డీజేసౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 15వరకు పొడిగించినట్లు వివరించారు. కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఏయిర్ క్రాఫ్టుల వినియోగాన్ని నిషేధించినట్లు సీపీ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదని హెచ్చరించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



రాజయ్య మృతదేహం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓ వ్యక్తి పాము కాటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగారపు రాజయ్య (55) స్థానికంగా కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం కోళ్లఫారంలో కూలీపనికి వెళ్లాడు. అక్కడ పాటుకాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందాడు. రాజయ్యకు భార్య ఈశ్వరమ్మ, నలుగురు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



రాజయ్య మృతదేహం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలోని హుజూరాబాద్–జమ్మికుంట ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి చెందిన కొలిపాక రాజయ్య(50) గ్రామంలో శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను దాటుతున్నాడు. ఈ క్రమంలో హుజూరాబాద్ పట్టణానికి చెందిన పైవర్తి కనుకయ్య జమ్మికుంటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. డివైడర్ మధ్యలో ఉన్న చెట్ల సందుల నుంచి రాజయ్య రోడ్డు దాటుతుండటంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పైవర్తి కనుకయ్య ఢీకొట్టాడు. కొలిపాక రాజయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కనుకయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. కనుకయ్యను చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

సర్పంచ్‌కు గాయాలు

హుజూరాబాద్‌రూరల్: పట్టణశివారులోని కొత్తపల్లి వ్యవసాయ మార్కెట్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాందాడిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ ఎల్లయ్య తన ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో వెనుక నుంచి ఓగూడ్స్ వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భార్య కోసం వెళ్లిన భర్త దారుణ హత్య

- భార్య అమ్మమ్మ ఇంట్లో కిరాతకం
- నర్సింగాపూర్‌లో హత్య..రుద్రంగిలో విషాదం
- విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తాం : డీఎస్పీ



గణేశ్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్య జాడ కోసం వెళ్లిన భర్త దారుణహత్యకు గురైన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని నర్సింగాపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. రుద్రంగికి చెందిన రణవేణి గణేశ్ (27), వేములవాడరూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన సింగరవేణి స్వప్న రెండున్నరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గణేశ్ గ్రామంలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. 18 నెలలపాటు అన్యోన్యంగా ఉన్న జంటకు ఏడాదిగా కాపురంలో కలహాలు ప్రారంభమయ్యాయి. గత 15 రోజుల క్రితం భర్త గణేశ్ భార్యపై చెయ్యి చేసుకోవడం తోపాటు విద్యుత్‌షాక్ పెట్టాడు. దీంతో స్వప్న తప్పించుకుని వట్టెంల గ్రామంలోని తల్లిగారింటికి వెళ్లింది. భర్త గణేశ్‌పై వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇద్దామనే క్రమంలో స్వప్న పోలీస్‌స్టేషన్‌కు రాకపోవడంతో వాయిదాపడింది. నాలుగు రోజుల క్రితం భార్య కోసం అత్తగారింటికి, ఇల్లంతకుంట మండలం వంతడుపులలోని భార్య అక్క ఇంటికెళ్లి వాకబు చేశారు. అక్కడ స్వప్న లేకపోవడంతో రుద్రంగికి తిరిగొచ్చాడు. తన ఆచూకీ కోసం భర్త తిరుగుతున్నాడని తెలుసుకున్న స్వప్న చందుర్తి మండలం నర్సింగపూర్‌లోని అమ్మమ్మ గారింట్లో తలదాచుకుంటోంది. ఈ విషయం తెలుసుకున్న గణేశ్ మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో రుద్రంగి నుంచి బయలుదేరి వెళ్లాడు. గణేశ్ రాకను గమనించిన ఇంట్లో ఉన్న మహిళలే కంట్లో కారం చల్లి గొడ్డలితో దాడి చేశారని డీఎస్పీ నాగేంద్రాచారి తెలిపారు. హత్యలో ఎవరి ప్రమేయం ఎంత ఉందనే వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని వివరించారు. సంఘటన స్థలాన్ని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్ పరిశీలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

హత్య చేసి.. 100కు డయల్ చేసి

గణేశ్ హత్య జరిగిన విషయం 100కు డయల్ చేసి చెప్పడంతోనే చందుర్తి పోలీసులకు తెలిసింది. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట ఎస్సైలు రమేశ్, ప్రభాకర్, రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గణేశ్ మృతిచెంది ఉన్నాడు. తెల్లవారేసరికి గ్రామంలో పోలీస్ వాహనాలు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామంలో హత్య జరిగినట్లు తెలియడంతో ఉలిక్కిపడ్డారు.

హత్య చేస్తాడని.. భయపడే హతమార్చారా?

వారం రోజులుగా భార్య ఆచూకీ కోసం తిరుగుతున్న గణేశ్ ఆవేశంతో ఉన్నాడని భార్య తరఫున బంధువులు భావించారు. తమను ఎక్కడ హత్య చేస్తారనే ముందస్తుగానే హతమార్చారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. మృతుడి తండ్రి చంద్రయ్య ఆరోపణలతో గతంలో శతృత్వం ఉన్న రుద్రంగికి చెందిన వ్యక్తి గణేశ్‌ను హత్య చేశాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. అక్రమ సంబంధమే హత్యకు కారణమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి మాట్లాడుతూ ప్రాథమిక విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

అగ్నిప్రమాదం



కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రంలో బుధవారం రోహిత్ కిరాణ దుకాణంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో నిత్యవసర వస్తువులు కాలి పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని దుంపేట రోడ్డులో ఉన్న విద్యుత్‌స్తంభంపై వైర్లు తెగి పడిపోవడంతో కిరాణం దుకాణంలోకి మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.70 వేల విలువ గల నిత్యవసర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు చిలుక సురేందర్ తెలిపారు. కాగా అగ్నిప్రమాదం జరిగిన వెంటనే బాధితుడు, గ్రామస్తులు స్పందించి పైపులతో నీళ్లు చల్లడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.

విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. శాతవాహన యూనివర్సిటీలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా సరిపడా నిధులు కేటాయించకపోవడం చాలా బాధాకరమన్నారు.. సంక్షేమ హాస్టల్ విద్యార్థులు అద్దె భవనాల్లో అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన నిధులు యూనివర్సిటీలో ఉన్న ఉద్యోగుల జీతాలకు సరిపోవన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గజ్జెల శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి కాంపెల్లి అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు నాగుల శివ , శ్రీవాణి ఉన్నారు.

ప్రొఫెసర్ ఖాసీం అరెస్టు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న మాలోతు రాజేశ్ నాయక్

కరీంనగర్: ప్రొఫెసర్ ఖాసీం అరెస్టు అప్రజాస్వామికమని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాజేశ్ నాయక్ అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన యుఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో యూనివర్సిటీలను అభివృద్ధి పథంలో నడుపుతామని, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పటివరకు ఖాళీగా ఉన్న 1,034 పోస్టులను భర్తీ చేయకుండా కాలయాపన చేయడం ఏంటని ప్రశ్నించారు. ఖాళీల భర్తీ కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీలో రెండు రోజులుగా శాంతియుత పద్ధతిలో నిరసన కార్యక్రమం కొనసాగిస్తున్న ఖాసీమ్‌ను అరెస్టు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. గవర్నర్ యూనివర్సిటీల అభివృద్ధి కోసం బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతి, రాము, మనీ, లోకేష్, సందీప్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'శ్రీచైతన్య' సత్తా



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడో, ఐదోసెమిస్టర్ ఫలితాల్లో శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు సత్తా చాటారు. బీఎస్సీ విభాగంలో ఎం.ప్రణయ 9.2, సయ్యద్ సారా 9.2, ఎల్.అఖిల 9.1, ఎస్.పవిత్ర 9.1, కే.సాత్విక 9.1, వి.అంజలి 9.0, బిందు శ్రీ 9.0, వై.దీపిక 9.0, ఏ.రశ్మిత 9.0.. బీకాం, మేనేజ్మెంట్ విభాగంలో బి.రాహుల్ 9.2, కే.సౌమ్య 9.1, బిందు శ్రీ 9.0 జీపీఏ సాధించారని, చాలామంది విద్యార్థులు 8.5 జీపీఏకు పైగా సాధించి యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్.ఎల్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

వాణినికేతన్ డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ దీపిక

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో వాణినికేతన్ డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు శాతవాహన ఈసీ మెంబర్, కళాశాల కరస్పాండెంట్ ఐ.దీపిక తెలిపారు. టి.నవ్య 9.08, సుహానా 8.78, డి.శ్రావణి 8.68, డి.సౌమ్య మిశ్రా 8.6, జె.దర్శిని8.57, కామర్స్ విభాగంలో కే.పూజిత 8.65, ఎం.శ్రావణి 8.63, ఏ.ఉమాదేవి 8.52, ఆర్ట్స్ విభాగంలో నందుకుమార్ 8.5 జీపీఏ సాధించారు. ఎం.వైష్ణవి 9.14 ,టి.శిల్ప 8.89, ఈ.అర్చన 8.7, ఏ.హర్షిని 8.44, ఎం.మొహసిన్ అహ్మద్ 8.34, అభిలాష్ 8.27, ఐ.అనూష 8.13,ఆర్ట్స్ విభాగంలో కె.మౌనవ్య 9.58, డి.శ్రీవర్ష 8.86, ఈ.శివాని 8.2 ఎస్‌జీపీఏ సాధించారు. 146 మంది 8.0ఆపైన అధిక ఎస్‌జీపీఏలు యూనివర్సిటీస్థాయిలో సాధించారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం కళాశాల కరస్పాండెంట్ ఐ.దీపిక, ప్రిన్సిపల్ డి.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.

కనుకులగిద్దెలో వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మీనారాయణ మృతదేహం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్ర లక్ష్మీనారాయణ(56) గ్రామంలో కిరాణాదుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడికి ఇద్దరు కొడుకులు విష్ణువర్ధన్, వంశీకృష్ణ ఉన్నారు. వంశీకృష్ణ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తుండగా.. ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతడి వైవాహిక జీవితంలో ఇబ్బందులు ఎదురు కావడంతో ఎర్ర లక్ష్మీనారాయణ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఈ నెల 7న సాయంత్రం ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్న కుమారుడి వైవాహిక జీవితంలో వచ్చిన ఇబ్బందుల మూలంగానే తన భర్త మృతి చెందినట్లు లక్ష్మీనారాయణ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం.. ఉత్కంఠకు తెర

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని బుధవారం ఉపాధ్యాయుల కళ్లుగప్పి పాఠశాల నుంచి వెళ్లిపోయింది. దీంతో పాఠశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థిని జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడే ఉన్న పూజారి గ్రామ సర్పంచ్ గొడిశెల గంగాధర్, ఆలయ చైర్మన్ గోనెల బక్కన్న, వైస్ చైర్మన్ గంగాధర్‌లకు సమాచారం అందించాడు. దీంతో వారు విద్యార్థిని చేరదీసి వివరాలు అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పింది. ఈక్రమంలో సర్పంచ్ పట్టణ సీఐ కిశోర్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి విద్యార్థిని తీసుకువచ్చి సీఐ సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో అదృశ్యమైన విద్యార్థిని సంఘటన ఉత్కంఠకు తెరపడింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొడిమ్యాల(చొప్పదండి): పూడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. మండలంలోని వెంకటాయిపల్లికి చెందిన నాగెల్లి తిరుపతిరెడ్డి(59) పని నిమిత్తం పూడూరు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. తీవ్రగాయాలపాలైన తిరుపతిరెడ్డిని స్థానికులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్– అంబారిపేట గ్రామాల మధ్య బైపాస్‌రోడ్‌లో మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి బోనగిరి గంగాధర్ (30) మృతిచెందాడు. పోలీసుల వివరాలు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బోనగిరి గంగాధర్ మంగళవారం తాటిపల్లి గ్రామంలో తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని సోదరుడు గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

396 కేసులు పరిష్కారం

జగిత్యాలక్రైం: జగిత్యాల ట్రాఫిక్ పోలీసులు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో బుధవారం వరకు 396 డ్రంకెన్ డ్రైవ్ కేసులు పరిష్కరించినట్లు ట్రాఫిక్ ఎస్సై రాము తెలిపారు. కేసుల పరిష్కారం ద్వారా రూ.4.40 లక్షలు జరిమానా రూపంలో వసూలు చేయడం జరిగిందన్నారు. ఈనెల 10వ తేదీ వరకు లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

క్లుప్తంగా

యూత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాంలో మన కళాకారులు


బంజారా నృత్యం చేస్తున్న కళాకారులు

కరీంనగర్ కల్చరల్: భారత సాంస్కృతిక శాఖ సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని పయనూర్‌లో నిర్వహిస్తున్న యూత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాంలో రాష్ట్ర కళాకారులు బుధవారం పాల్గొన్నారు. బంజారా, బతుకమ్మ, బోనాల నృత్యాలతో ఆకట్టుకున్నారు. జిల్లాకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత కళింగ శేఖర్ సారథ్యంలో గంగాధర్ నాయక్ ఇన్‌చార్జిగా డోలక్ రాజు, ప్యాడ్ వెంకటేశ్, డప్పు స్వామి, డప్పు అజయ్, దేవరకొండ డ్యాన్సర్లు, మాస్టర్ డ్యాన్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు లావణ్య, సంతోష్, సుశాంత్, ప్రత్యూష, సంధ్య, మహేశ్వరి, లక్ష్మి, గౌతమి, అబితలు ప్రదర్శనలు ఇవ్వగా పలువురు అభినందించారు.

విద్యార్థినికి ఎస్‌యూ వీసీ అభినందన


తేజస్వినిని అభినందిస్తున్న వీసీ మల్లేశ్

శాతవాహన యూనివర్సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయం 2020–2022 బ్యాచ్ ఎమ్మెస్సీ ఫిజిక్స్(ఎలక్ట్రానిక్స్) విభాగం వార్షిక పరీక్షల ఫలితాల్లో తోగటి తేజస్విని ప్రథమ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సంకసాల మల్లేశ్ బుధవారం ఆమెను అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాగే రాణించాలని ఆకాంక్షించారు.

సీసీరోడ్ల తనిఖీ


రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుబ్బపల్లి, మందులపల్లి, ఇరుకుల్ల గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మించిన సీసీరోడ్లను క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఎంబీ రికార్డు ప్రకారం రోడ్ల పొడవు, వెడల్పు, మందం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ వెంకటరమణ, ఏఈలు విష్ణువర్ధన్‌రాజు, రమణారెడ్డి, దుబ్బపల్లి సర్పంచు దుర్గారమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం


సన్మానిస్తున్న మేనేజర్ మల్లయ్య, అధికారులు

కరీంనగర్: జనవరి నెలలో అత్యుత్తమ పనితీరు కనబర్చి, ఆదర్శంగా నిలిచిన ఉద్యోగులు పి.సుధాకర్, ఎ.మంజుల, ఎం.కొమురయ్యలను కరీంనగర్–2 డిపో మేనేజర్ వి.మల్లయ్య బుధవారం ఘనంగా సన్మానించి, అభినందించారు. సూపరింటెండెంట్ ఎం.కమల, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ఎంబీ.కుమార్, ఏఈసీఎం నాగభూషణం, సీఆర్‌సీ జి.లక్ష్మణ్, సీహెచ్‌సీకే రావు తదితరులు పాల్గొన్నారు.

యాదవ నాయకుల ముందస్తు అరెస్టు


మల్లయ్యను అరెస్టు చేసిన పోలీసులు

కరీంనగర్‌రూరల్: యాదవుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివెళ్తున్న పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సమితి జిల్లా అధ్యక్షుడు, కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌కు చెందిన బండి మల్లయ్య యాదవ్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు యాదవుల ఉద్యమాన్ని ఆపలేవని, రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి తమ సత్తా చూపిస్తామన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పరీక్షల సమయం | ఆత్మవిశ్వాసమే ఆయుధం

- ఈ నెల 15 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్
- మార్చి 15 నుంచి ఇంటర్, ఏప్రిల్ రెండో వారంలో టెన్త్ ఎగ్జామ్స్
- ఒత్తిడిని అధిగమించి చదివితే ఉత్తమ ఫలితాలు



కరీంనగర్: విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేవి పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు. ఈ నెల 15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్, మార్చి 15 నుంచి ఇంటర్మీడియట్, ఏప్రిల్ రెండోవారంలో పదోతరగతి ఫైనల్ ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలలు విద్యార్థులకు పరీక్షా కాలం. ఎస్సెస్సీ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 12,767 మంది, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలను 32,643 మంది రాయనున్నారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ అంటే సహజంగానే ఒత్తిడి ఉంటుంది. దాన్ని అధిగమించి, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

ఈ సూచనలు పాటించాలి..

- పరీక్షల సమయంలో ఆయా సబ్జెక్టులను చదివేందుకు సీనియర్లు, ఉపాధ్యాయులను సంప్రదించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- నచ్చిన ప్రదేశాల్లో, ఇష్టమైన వ్యక్తుల సమక్షంలో చదవాలి.
- పరీక్షల సమయంలో మాంసాహారానికి దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలు తినడం వల్ల మెదడు చురుగ్గా పని చేస్తుంది.
- ఒక క్లిష్టమైన సబ్జెక్టు తర్వాత సులువుగా ఉన్న సబ్జెక్టు రెండేసి గంటలు చదవాలి. ఇతరులు తయారు చేసిన ప్రశ్నపత్రాలకు కూడా సమాధానాలు రాయాలి.
- పరీక్షల్లో చేతిరాత బాగుండాలి. అక్షరదోషాలు, కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.
- పరీక్ష ముందు రోజు హాయిగా నిద్రపోవడం మంచిది.
- ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నలన్నింటినీ క్షుణ్ణంగా చదివి, బాగా రాయగలననుకున్న ప్రశ్నలను ఎంచుకొని, జవాబులు రాయాలి.

ప్రజెంటేషన్ కీలకం



విద్యార్థుల జ్ఞాపకశక్తి కంటే పరీక్షల్లో ప్రజెంటేషన్ కీలకం. చాలా మంది విద్యార్థులు ఒత్తిడికి గురై, తెలిసిన ప్రశ్నలకు సైతం జవాబులు రాయలేరు. తల్లిదండ్రులు, టీచర్లు పిల్లలను స్వేచ్ఛగా చదవనివ్వాలి. ఏ సమయంలోనైనా పరీక్ష సులభంగా రాయగలిగేలా తీర్చిదిద్దాలి.

– అట్ల శ్రీనివాస్‌రెడ్డి, సైకాలజిస్ట్, ఫ్యామిలీ కౌన్సెలర్

ప్రశాంతంగా ఉండాలి



పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక సంఘర్షణకు లోనైతే ఏడాది చదివిన చదువు వృథా అవుతుంది. ప్రశాంతంగా ఉండి, తెలిసిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రాయాలి. పరీక్షల కోసం చదివేటప్పుడే లక్ష్యం ఉండాలి. రాసేటప్పుడు పెట్టుకుంటే ఒత్తిడి పెరుగుతుంది.

– గాజుల రవీందర్, ఉపాధ్యాయుడు

టీవీలు కట్టేయాలి



తల్లిదండ్రులు ఎక్కువ సమయం టీవీల ముందు కాలక్షేపం చేస్తే విద్యార్థుల దృష్టి వాటిపై పడుతుంది. పరీక్షలు ముగిసేవరకు ఇంట్లో టీవీలు కట్టేయడమే మంచిది. బయట ఆహారానికి ఫుల్‌స్టాప్ పెట్టి, ఇంటి వంటలే చేసి పెట్టాలి. పిల్లలు ఫోన్లకు దూరంగా ఉండాలి.

– యాదగిరి శేఖర్‌రావు, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు

వల్లంపహాడ్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర కాంగ్రెస్ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ విలీన గ్రామం వల్లంపహాడ్‌లో చేపట్టారు. పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి, రాహుల్ గాంధీ సందేశం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై చార్జిషీట్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శివారు ప్రాంతాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. అభివృద్ధి దేవుడెరుగు కార్పొరేషన్‌లో విలీనం చేయడం వల్ల ఉపాధిహామీ పథకం వర్తించకుండా పోయిందని, పనిలేక ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇంటి పన్ను రెండింతలయ్యిందని, అభివృద్ధి మాత్రం శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కూన దామోదర్, ఒడ్నాల సురేందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, దండి రవీందర్, పొరండ్ల రమేశ్, ఎండీ.చాంద్, ముక్క భాస్కర్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, అగ్గడి శారద, మెతుకు కాంతయ్య, కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ వెంకన్న

కరీంనగర్‌క్రైం: గ్యాస్ వాడకం విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, కొన్ని మెళకువలు పాటిస్తే వంట గ్యాస్ ప్రమాదాల నుంచి దూరం కావొచ్చని కరీంనగర్ డివిజన్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో ఇండేన్ గ్యాస్ డెలివరీ సిబ్బందికి నిర్వహించిన ×మెగా నవ చేతన్ల శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో జాతీయ విపత్తు నివారణ సంస్థ ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. గ్యాస్ లీకేజీ వల్ల జరిగే అగ్ని ప్రమాదాలపై సమాచారం అందగానే ప్రాణనష్టం జరగకుండా క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని అన్నారు. అనంతరం గ్యాస్ లీకేజీ వల్ల మంటలు వ్యాపించినప్పుడు వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఐవోసీఎల్ కరీంనగర్ విక్రయ అధికారి అలోక్‌రెడ్డి, రాష్ట్ర ఎల్పీజీ సంఘం కార్యదర్శి శ్రీ చరణ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్, సీనియర్ ఇండేన్ డీలర్లు బొమ్మ రాధాకృష్ణ, రాంరెడ్డి, గట్టు రాజయ్య, ప్రవీణ్, భాగ్యలత, భాస్కర్, గడ్డం వేణు, మిరాజ్, ప్రదీప్, భవాని, మేనేజర్లు రాము, దేవేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థుల ఔదార్యం


నాగరాజు కుటుంబానికి నగదు అందిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

శాతవాహన యూనివర్సిటీ: ఎస్సారార్ కళాశాలకు ఓ విద్యార్థి మృతిచెందగా అదే కళాశాలకు చెందిన విద్యార్థులు అతని కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న బొంకూరు నాగరాజు గత డిసెంబర్ 11న గుండెపోటుతో మృతిచెందాడు. అతని తండ్రి రెండేళ్ల క్రితం కేన్సర్‌తో చనిపోయారు. దీంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయాన్ని అధ్యాపకుడు కేఎస్.ప్రణీత్ చౌదరి ద్వారా తెలుసుకున్న ఎంపీసీఎస్ మొదటి సంవత్సర విద్యార్థులు రూ.10 వేలు జమ చేసి, బుధవారం నాగరాజు తల్లి రాధకు కళాశాలలోనే ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుడు చంద్రశేఖర శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రశాంత్‌శర్మ, ప్రవీణ్‌శర్మలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. సర్పంచు వెంకటమ్మ, ఉపసర్పంచు సంపత్‌రావు, ఎంపీటీసీ సభ్యురాలు రాజ్యలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి, నర్సయ్య తదితరులున్నారు.

కొండగట్టుకు నిధుల కేటాయింపుపై హర్షం

కరీంనగర్ కల్చరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించడంపై శ్రీహనుమాన్ సేవాసమితి బాధ్యులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏప్రిల్‌లో జరిగే చిన్న హనుమాన్ జయంతి వరకు కొన్ని అభివృద్ధి పూర్తి చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. సమితి బాధ్యులు భోగ శ్రీనివాస్, జి.సూర్యనారాయణ, ఆర్.నాగరాజు, ఆర్.రవీంద్రాచారి, డి.అవినాశ్, వినేశ్ తదితరులున్నారు.

'బీసీ కార్పొరేషన్ నిధులు దారి మళ్లింపు'

కరీంనగర్: జిల్లాలో బీసీ కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.4 కోట్లను అధికారులు గతంలో దారి మళ్లించారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆ మొత్తాన్ని తిరిగి బీసీ కార్పొరేషన్ ఇచ్చి, అర్హులైన లబ్ధిదారులకు రుణాల రూపంలో అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 2018 ఆగస్టు నుంచి 2021 ఆగస్టు వరకు అప్పటి ఏవో హయాంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపితే నిజాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

గోడ పైనుంచి పడి వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం: గోడపై నిలబడి పోస్టర్ తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గోదాంగడ్డకు చెందిన ఎండీ.జహంగీర్‌పాషా(51) వెంకటేశ్వర థియేటర్‌లో కాపలా ఉండటంతోపాటు పోస్టర్లు అంటిస్తూ ఉంటాడు. బుధవారం సాయంత్రం థియేటర్ గోడపై గల పోస్టర్ తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయమైంది. థియేటర్ సిబ్బంది, కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీ–13 ఉపకాలువ నిర్మాణం నిలిపివేయాలి


తహసీల్దార్ బాప్‌సింగ్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

గన్నేరువరం(మానకొండూర్): గునుకులకొండాపూర్ గ్రామంలో చేపట్టే డీ–13 ఉపకాలువ నిర్మాణం నిలిపివేయాలని కోరుతూ గ్రామ రైతులు బుధవారం తహసీల్దార్ బాప్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఉపకాలువకు నీటి విడుదలతో పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతోందని, భూగర్భజలాలు గణనీయంగా పెరగడంతో భూములు జాలువారి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాల్వ నిర్మాణంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, అధికారులు నిర్మాణం విరమించుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాజయ్య, రమేష్, రాజవీరు, శ్రీనివాస్, వీరేశం, నర్సయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ క్రైం: మానవ హక్కుల పరిరక్షణ సంస్థ కరీంనగర్ టౌన్ సెక్రటరీగా అన్నాడి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం నియమించినట్లు సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ గునుకుల కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజసేవ చేస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రాంప్రసాద్, వైస్ చైర్మన్ రమేశ్, టౌన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ అనిల్ పాల్గొన్నారు.

'అగ్నిపథ్'ను సద్వినియోగం చేసుకోండి


అభ్యర్థులతో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఎస్‌వీజేసీ యాజమాన్యం

కరీంనగర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. కరీంనగర్‌లోని ద్రోణాచార్య డిఫెన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఎస్‌వీజేసీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిఫెన్స్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అగ్నిపథ్ స్కీంలో వచ్చిన మార్పులపై బుధవారం అవగాహన సదస్సు, మెడికల్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో దేశభక్తిని పెంపొందించడానికి, వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోడానికి అగ్నిపథ్ స్కీం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రంలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, విజయం సాధించాలని ఆకాంక్షించారు. సుమారు 180 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్, జిల్లా కార్యదర్శి దానం శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ డిస్ట్రిక్ట్ కానిస్టేబుల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పులి నగేశ్‌గౌడ్, ఎస్‌వీజేసీ కళాశాలల యాజమాన్యం మహిపాల్ రెడ్డి, రాంరెడ్డి, సంతోష్ రెడ్డి, హరికృష్ణ, వరప్రసాద్, ద్రోణాచార్య అకాడమీ డైరెక్టర్లు లెంకల మహిపాల్ రెడ్డి, పల్లె రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో స్క్రాప్ టెండర్


టెండర్‌ను పరిశీలిస్తున్న కమిటీ చైర్మన్ మధు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో స్క్రాప్‌కు బుధవారం టెండర్ నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు అధ్యక్షతన ఈ ప్రక్రియ సాగగా మొత్తం 11 మంది హాజరయ్యారు. తొలుత సీక్రెట్ టెండర్ బాక్స్ ద్వారా కిలో స్క్రాప్‌ను రూ.34కు బిడ్డింగ్ వేశారు. ఆ తర్వాత ఓపెన్ యాక్షన్ ద్వారా బిడ్డింగ్ ఏర్పాటు చేయగా కిలోకు రూ.36 ధర పలికింది. మార్కెటింగ్ సంచాలకులు రీజినల్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రీజినల్ అజ్మీర్ రాజు, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, కార్యదర్శి పురుషోత్తం, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు శ్రీసహస్ర, సహస్రరెడ్డిలు జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ గౌతం రెడ్డి తెలిపారు. ఇటీవల బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 18వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు అత్యంత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, కోచ్ గౌతంరెడ్డి, పీఈటీలు శ్రీకాంత్, అనిల్, రహీం, సుప్రజ తదితరులు బుధవారం అభినందించారు.

సైలెంట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో టీచర్లు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ముంబయిలో జరిగిన సైలెంట్ ఒలింపియాడ్–2023లో ప్రతిభ కనబర్చారు. 8 బంగారు, 5 రజత, ఒక కాంస్య పతకాలు గెలుపొందారు. ఈ క్రీడల్లో వివిధ రాష్ట్రాల బధిర పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కరీంనగర్ ఆశ్రమ పాఠశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకొని, అత్యధిక విభాగాల్లో పతకాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ లావణ్యకు బెస్ట్ ఫిమేల్ ప్రిన్సిపాల్ అవార్డు అందించారు. ఈ క్రీడాపోటీలను ఏటా ఫిబ్రవరి నెలలో బాంబే రౌండ్ టేబుల్‌వారు ముంబయిలో నిర్వహిస్తారు. పతకాలు సాధించిన విద్యార్థులను టీచర్లు బుధవారం అభినందించారు.

'అల్ఫోర్స్'లో స్పోర్ట్స్ కార్నివాల్



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెసిస్‌లో బుధవారం అల్ఫోర్స్ స్పోర్ట్స్ కార్నివాల్‌ను ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి క్రీడాజ్యోతి వెలిగించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. విద్యతోపాటు ఆటలకు తగిన ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలతో పోటీతత్వం పెరిగి, ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, ఫుట్‌బాల్, నెట్‌బాల్, మ్యూజికల్ చైర్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, పరుగు పందెం, టెన్నికాయిట్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలి

చొప్పదండి: పట్టణంలోని గృహ యజమానులు ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని, పన్ను తగ్గుతుందనే అపోహలు వీడాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కొందరు ఎమ్మెల్యే రవిశంకర్‌ను కలిసి ఆస్తిపన్ను తగ్గించాలని కోరడంతో సిబ్బంది పన్నుల వసూల్ వెళ్తే పన్నులు తగ్గుతాయని ప్రశ్నిస్తున్నారని, 2022–23 ఆర్థిక సంవత్సరానికి పన్నులు సకాలంలో చెల్లించకపోతే 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలన్నారు. పట్టణవాసులు ఆస్తిపన్ను తగ్గించాలని ఇచ్చిన దరఖాస్తు చైర్‌పర్సన్, కౌన్సిలర్ల పరిశీలనలో ఉందని, ఒకవేళ తగ్గినా వచ్చే ఆర్థిక సంవత్సరంలో తగ్గుతాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించాల్సిందేనని సూచించారు. ఆస్తి, వాణిజ్య పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా చెల్లించాలని లేదంటే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఆస్తులు జప్తు చేయడానికి తగు చర్యలు తీసుకోవాల్సి వుస్తుందని హెచ్చరించారు. తమ సిబ్బందికి ప్రస్తుత, బకాయిలకు చెందిన ఇంటి పన్నులు చెల్లించాలని, అపోహలు వీడాలని విజ్ఞప్తి చేశారు.

'రైతు బాంధవుడు సీఎం కేసీఆర్'

గన్నేరువరం(మానకొండూర్): సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తూ రైతు బాంధవుడిగా మారారని రైతుబంధు సమితి జిల్లా కో–ఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి అన్నారు. బుధవారం గుండ్లపల్లిలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి రూ. 6,300 కోట్లు, రైతుబంధుకు రూ. 15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. మాజీ ఎంపీపీ మల్లారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు మహ్మమద్ రఫీ, నాయకులు రవి, నర్సయ్య, కిట్టు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జూన్ కల్లా 76 మెగావాట్ల నిర్మాణం

నిర్మాణ ఏజెన్సీలతో సింగరేణి చైర్మన్ శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: 76 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించి సింగరేణి సంస్థ నిర్మిస్తున్న ఐదు ప్లాంట్లను మే నెల కల్లా పూర్తి చేసి.. జూన్ నెలలో తెలంగాణ ట్రాన్స్‌కోకు అనుసంధానం చేయాలని సంస్థ చైర్మన్ ఎన్.శ్రీధర్ నిర్మాణ ఏజెన్సీలను ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో బుధవారం నిర్వహించిన సోలార్ విద్యుత్ సమీక్ష సమావేశంలో ఆయన కొత్త ప్లాంట్ల నిర్మాణాలపై లోతుగా చర్చించారు. సంస్థ చేపట్టిన మొత్తం 300 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లలో ఇప్పటికే 224 మెగావాట్ల సామర్థ్యం గల 9 ప్లాంట్లను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన ఆ 76 మెగావాట్ల సోలార్ నిర్మాణం నిర్ణీత సమయానికి పూర్తి చేయాలన్నారు. డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి సత్యనారాయణరావు ముందుగా నిర్మాణంలో ఉన్న ప్లాంట్ల గురించి వివరించారు. దీనిపై నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులతో శ్రీధర్ నేరుగా చర్చించారు. కాలపరిమితులు నిర్ణయించుకొని, రోజుకు రెండు షిఫ్టులలో పనులు పూర్తి చేయాలన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.100 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఉన్న ఈ దేవాలయ అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ దేవాలయ అభివృద్ధి కోసం నిధులు ఇస్తానని సీఎం కేసీఆర్ గతేడాది డిసెంబర్‌లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

కొత్తగా 2 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 3,688 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరు వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో ఇద్దరు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 27 మంది చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

పెళ్లికి పెద్ద సాయం

- రేపు 'వైఎస్సార్ కల్యాణ మస్తు'.. 'షాదీ తోఫా'
- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఏపీ సర్కారు సాయం
- కొత్తగా తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం
- ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



సాక్షి, అమరావతి: నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కారాదనే ఉద్దేశంతో 'వైఎస్సార్ కల్యాణ మస్తు', 'షాదీ తోఫా'పథకాల అమలుకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నెల 10వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు భవన నిర్మాణ కార్మికులు, విభిన్న ప్రతిభావంతుల్లో దరఖాస్తు చేసుకున్న 4,536 కుటుంబాలకు ఆర్థిక సాయం కింద రూ.38.18 కోట్లు పంపిణీ చేయనుంది. గతంతో పోలిస్తే సాయం మొత్తాన్ని భారీగా పెంచింది. ఈ క్రమంలో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వధూవరులకు 10వ తరగతి ఉత్తీర్ణతను తప్పనిసరి చేసింది. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకు జరిగిన వివాహాలకు సంబంధించి అందిన దరఖాస్తులను జనవరిలో తనిఖీ చేసి ఫిబ్రవరిలో ఆర్థిక సాయం చెల్లించనుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి దరఖాస్తులను పరిశీలించి నాలుగో నెలలో లబ్ధి అందించనుంది. మరోవైపు చంద్రబాబు తన హయాంలో నమ్మించి నట్టేట ముంచిన పొదుపు సంఘాల్లోని 79 లక్షల మంది అక్కచెల్లెమ్మలను ఆదుకుంటూ 3వ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.6,500 కోట్ల పంపిణీకి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మంత్రివర్గం సమావేశమైంది. సంక్షేమం, విద్య, పరిశ్రమలకు ప్రోత్సాహకం, ఆరోగ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వాటిని మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..

- ఫిబ్రవరి 24న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్.
- అక్టోబరు - డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన ద్వారా ఫిబ్రవరి 28న పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించనుంది.
- ఉగాది సందర్భంగా మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 10-04-2019 నాటికి పొదుపు సంఘాల మహిళలకు చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలు రూ.25 వేల కోట్లు చెల్లిస్తానని పాదయాత్రలో సీఎం జగన్ ప్రకటించారు. మాట ప్రకారం ఇప్పటికే దాదాపు రూ.13 వేల కోట్లకు పైగా అందించారు. తాజాగా మరో రూ.6,500 కోట్లు ఇవ్వనున్నారు.
- జగనన్న వసతి దీవెన కింద ఈ ఏడాదికి సంబంధించి దాదాపు 10.50 లక్షల మంది విద్యార్థులకు మేలు చేస్తూ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.20 వేల వరకూ సాయం అందించనుంది. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఇప్పటివరకు క్యూఎస్ ర్యాంకింగ్ టాప్ 200 విశ్వవిద్యాలయాలను పరిగణనలోకి తీసుకోగా తాజాగా 320కి పెంచారు. ఇకపై దాదాపు 21 సబ్జెక్టులకు సంబంధించి టాప్ 50 కాలేజీలు లేదా విద్యాసంస్థల్లో సీటు సాధించిన వారికి జగనన్న విదేశీ విద్యాదీవెన వర్తించనుంది.
- కర్నూలులో 50 ఎకరాల్లో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(ఎన్ఎల్‌యూ) ఏర్పాటు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



హైదరాబాద్‌లో బుధవారం జరిగిన జడ్చర్ల ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి కుమారుడు స్వరణ్ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, సీహెచ్ మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఎ. జీవన్‌రెడ్డి, గణేశ్ బిగాల, కాలె యాదయ్య తదితరులు.

'ఎర' కేసు విచారణ 17న

హైకోర్టు ఆదేశాలపై స్టే, స్టేటస్‌కోకు నిరాకరించిన సీజేఐ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎమ్మెల్యేల ఎర కేసు విచారణ ఈ నెల 17న చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా బుధవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఇదే అంశాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాది దవే ప్రస్తావించారని గుర్తుచేశారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే లేదా స్టేటస్‌కో విధించాలని అభ్యర్థించారు. కేసు దర్యాప్తు సీబీఐకు అప్పగిస్తే నీరుగారిపోతుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్.. స్టే లేదా స్టేటస్‌కో ఇవ్వడానికి నిరాకరించారు. ఈ నెల 17న విచారణ చేపడతామని ఆ సమయంలో అన్ని అంశాలు పరిశీలిస్తామన్నారు. అయితే విచారణ ఈనెల 13న చేపట్టాలని లూత్రా పలుమార్లు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 17నే విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

అది ట్యాపింగ్ కాదు..

రికార్డింగ్ వాయిస్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లంకా రామశివారెడ్డి


- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే
- నాకు వచ్చే ప్రతి ఫోన్ కాల్ ఆటోమేటిక్‌గా రికార్డ్ అవుతుంది
- చెన్నైలో ఉన్నప్పుడు ఆ రికార్డింగ్ వాయిస్‌ను నా స్నేహితుడికి పంపాను
- అది వైరల్ అయ్యి.. ఇంత రాద్ధాంతం అవుతుందని అనుకోలేదు
- కోటంరెడ్డి ఆరోపణలను కొట్టిపారేసిన స్నేహితుడు లంకా రామశివారెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తన ఫోన్‌ను ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన స్నేహితుడు లంకా రామశివారెడ్డి కొట్టిపారేశారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదని.. ఫోన్‌లో తాను రికార్డ్ చేసిన వాయిస్ మాత్రమేనని స్పష్టం చేశారు. రామశివారెడ్డి బుధవారం నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. 'నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే. డిసెంబర్‌లో నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోటంరెడ్డి ప్రభుత్వ అధికారుల మీద, ఆయనకు కలిగిన ఇబ్బందుల మీద సుదీర్ఘంగా మాట్లాడారు. అదే రోజు రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాకు ఫోన్ చేశాడు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశం విషయాలపై చర్చించుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల విషయంలో తొందరపాటుగా మాట్లాడకుండా ఉంటే బాగుండేదని సలహా ఇచ్చాను. నియోజకవర్గ నిధులు, కాంట్రాక్టు పనులు, ఇతర పరిణామాలన్నీ సుదీర్ఘంగా చర్చించుకున్నాం. అవన్నీ కూడా నా ఫోన్‌లో ఆటోమెటిక్‌గా రికార్డయ్యాయి. నేను చెన్నై వెళ్లినప్పుడు.. కోటంరెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన వాయిస్ రికార్డును నా స్నేహితుడికి పంపాను. అది యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప.. కావాలని చేసింది కాదు. ఆ తర్వాత అది కాస్తా వైరల్ అయ్యింది. ఇంత పెద్ద వివాదం అవుతుందని ఊహించలేదు. కోటంరెడ్డి అనవసరంగా చిన్న విషయంపై ఇంత రాద్ధాంతం చేస్తాడని అనుకోలేదు. రెండు, మూడు రోజుల్లో సమసిపోతుందనుకున్నా. అందుకే ఇంతకాలం బయటకు రాలేదు. కానీ కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో నాకు కొంత ఆందోళన కలిగింది.

ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఇప్పుడు బయటకు వచ్చా. కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేసినా ఫర్వాలేదు. నాది ఆండ్రాయిడ్ ఫోన్. ప్రతి ఫోన్ కాల్ రికార్డ్ అవుతుంది. గత 5 నెలలుగా నేను వాడుతున్న ఫోన్‌ను చెక్ చేసుకోండి. అన్ని కాల్స్ రికార్డ్ అయిన విషయం తెలుస్తుంది. ఎవరు వచ్చినా.. నా ఫోన్ ఇస్తా.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి నిజాలు తెలుసుకోవచ్చు. నేను వాయిస్ రికార్డు పంపిన నా స్నేహితుడి పేరును విచారణ అధికారులకు చెబుతా. ఆయన పేరు ఇప్పుడు బహిరంగంగా చెప్పి.. ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లేదు'అని లంకా రామశివారెడ్డి వివరణ ఇచ్చారు.

ప్రభుత్వ వినతి తిరస్కృతి

- ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరిస్తూ హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని, సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసే వరకు హైకోర్టు తీర్పును యథాతథంగా ఉంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. సింగిల్ జడ్జి వద్ద దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను విచారణకు అనుమతించాలని కోరుతూ ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనాన్ని కోరింది. ఈ అభ్యర్థనను తిరస్కరిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సింగిల్ జడ్జి వద్ద ఉన్న పిటిషన్‌ను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ప్రభుత్వం తరఫున ఏజీ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ, ఇప్పటికే సుప్రీంకోర్టులో ప్రస్తావించామని, సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసే వరకు సింగిల్ జడ్జి యథాతథస్థితి మధ్యంతర ఉత్తర్వులు జారీ అంశంపై విచారణ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ధర్మాసనం, ఒకసారి సింగిల్ జడ్జి తీర్పు చెప్పిన తర్వాత దానిపై అప్పీల్ కూడా దాఖలైనప్పుడు మళ్లీ ఆ అంశాన్ని సింగిల్ జడ్జి విచారణ చేసే ఆస్కారమే లేదని చెప్పింది. సాంకేతికంగా ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పిందనే కారణంగా సింగిల్ జడ్జి విచారణకు అనుమతించాలని ఏజీ కోరగా అందుకు అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. సిట్ నుంచి కేసు ఫైళ్లు ఇవ్వాలని సీబీఐ ఒత్తిడి చేస్తోందని, సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసే నేపథ్యంలో సీబీఐ అత్యుత్సాహం సరికాదని ఏజీ చెప్పారు. తమ తీర్పుపై అభ్యంతరాలు ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలేగానీ ఇదే హైకోర్టులో అప్పీల్‌కు ఆస్కారమే లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది.

వేసవిలో వన్యప్రాణుల సంరక్షణ

- వేసవితాపం నుంచి ఉపశమనానికి ఉప్పుగడ్డలు
- డివిజన్‌లో 62 నీటికుంటల వద్ద ఏర్పాటు



ఉప్పుగడ్డను నాకుతున్న చుక్కల దుప్పులు



నీటికుంట వద్ద ఏర్పాటు చేసిన ఉప్పుగడ్డ

జన్నారం(ఖానాపూర్): వేసవిలో వన్యప్రాణులు ఎండ తీవ్రతకు డీహైడ్రేషన్‌తో నీరసించి పోకుండా ఉండేందుకు అటవీశాఖ అధికారులు సంరక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో మట్టితో కూడిన ఉప్పుగడ్డలు ఏర్పాటు చేస్తున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్‌లో మూడు అటవీ రేంజ్‌లు, 14అటవీ సెక్షన్‌లు, 40 అటవీ బీట్‌లు ఉన్నాయి. గత రెండేళ్లుగా డివిజన్‌లో గడ్డి క్షేత్రాలు, నీటి వనరులను పెంచడంతో ఇక్కడ వన్యప్రాణుల సంఖ్య రెట్టింపైంది. చుక్కల దుప్పులు, సాంబార్లు, నీలుగాయి, అడవి బర్రెలు, దున్నలు, కుందేళ్ల తదితర వన్యప్రాణుల సంఖ్య పెరుగుతోంది. దీంతో వన్యప్రాణులు నీటి సమస్య, ఎండదెబ్బ బారిన పడకుండా అటవీ శాఖ ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటోంది. ఎఫ్‌డీవో మాధవరావు ఆదేశాల మేరకు జన్నారం అటవీ డివిజన్‌లో నీటి కుంటలు, సాసర్‌వెల్స్ వద్ద ఉప్పుగడ్డలు ఏర్పాటు చేశారు. నీరు తాగేందుకు వచ్చిన వన్యప్రాణులు ఉప్పుగడ్డలను నాకడంతో వాటిలో శక్తితోపాటు మినరల్స్ అందుతాయని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. డివిజన్‌లో 102 చోట్ల ఉప్పుగడ్డలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎలా తయారు చేస్తారు

నల్లమట్టిని తీసుకుని అందులో ఉప్పు కలుపుతారు. నీటికుంటల సమీపంలో ఉప్పుతో కలిపిన నల్లమట్టిని గుట్ట వలే తయారు చేస్తారు. గడ్డపైనా కల్లుప్పును చల్లుతారు. నీటి తడికి చల్లిన ఉప్పు గడ్డకు ఇంకిపోతుంది. నీరు తాగిన వన్యప్రాణి ఉప్పు గడ్డను నాకుతుంది. ఇలా అన్ని రకాల వన్యప్రాణులకు ఎండకాలంలో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉంటుంది. దీంతోపాటు మినరల్స్ కూడా వన్యప్రాణులకు అందుతాయని, మన శరీరానికి ఉప్పు ఎంత అవసరమో, వన్యప్రాణులకు కూడా సోడియం అవసరం ఉంటుందని అధికారులు తెలిపారు.

ముఖ్యంగా వేసవిలో దృష్టి

ప్రతీకాలంలో ఉప్పుగడ్డలను ఏర్పాటు చేస్తాం. వర్షకాలంలో కరిగిపోతున్నందున అవి అంతగా ఉపయోగ పడవు. చలికాలంలో అవసరం ఎక్కువగా ఉండదు కాబట్టి వాటిని వన్యప్రాణులు తక్కువగా ఉపయోగిస్తాయి. వేసవిలో వీటి అవసరం చాలా ఉంటుంది. నీటి కుంటలు, గడ్డి క్షేత్రాల ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశాం. వేసవిలో ఎండ తీవ్రతతో నీరసానికి గురి కాకుండా ఉప్పు గడ్డలు ఉపయోగ పడుతాయి. డివిజన్‌లోని అన్ని బీట్‌ల పరిధిలో ఏర్పాటు చేశాం.

– సిరిపురం మాధవరావు, ఎఫ్‌డీవో

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు





మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లకు ట్రోఫీలు అందిస్తున్న కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంక

- ఓవరాల్ కేడెట్ చాంపియన్ మహబూబ్‌నగర్ జట్టు
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరంగల్ అర్బన్, కరీంనగర్ జట్లు
- ట్రోఫీలు అందించిన కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంక

కరీంనగర్ స్పోర్ట్స్: ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడే జూడో వంటి యుద్ధ క్రీడల్లో అమ్మాయిలు రాణించాలని కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంక అన్నారు. రెండు రోజులుగా జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో జరుగుతున్న 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, కేడెట్ జూడో చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. గెలుపోటములకు క్రీడలే నాందిగా నిలుస్తాయన్నారు. మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏటా రాష్ట్రస్థాయి జూడో పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డిలు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన క్రీడాకారులను ఈ నెల 17 నుంచి 22 వరకు చెన్నైలో జరిగే జాతీయ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరైనట్లు చెప్పారు. అనంతరం కేడెట్ బాలబాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన మహబూబ్‌నగర్ జట్టుకు, ద్వితీయ స్థానంలో నిలిచిన వరంగల్ అర్బన్ జట్టుకు, తృతీయ స్థానంలో నిలిచిన కరీంనగర్ జట్టుకు జెడ్పీ సీఈవో ప్రియాంక ట్రోఫీలను అందజేశారు. తొలిసారి ఐఏఎస్ హోదాలో మానేరు విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆమెను ఘనంగా సత్కరించారు. జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు, కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, భారత జూడో సమాఖ్య కోశాధికారి కైలాస్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం కోశాధికారి బాలరాజు, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేతారెడ్డి, జూడో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి.. ప్రజాప్రతినిధుల లొల్లి

- సర్కారు జాగా కబ్జాపై ఒకరిపై ఒకరు ఆరోపణలు
- తాండూరు మండలం రేచినీ భూమి అన్యాక్రాంతం



తాండూరు మండలం రేచినీలో కబ్జాకు గురవుతున్న సర్కారు భూమి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ భూమి కబ్జా చేయడంలో కొందరు ప్రజాప్రతినిధులు పోటీ పడుతున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా ఎక్కడ సర్కారు భూమి దొరికితే అక్కడ వాలిపోతూ ఆ భూములు తమ వెనకేసుకుంటున్నారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచినీలో ప్రభుత్వ భూమి వందల ఎకరాల్లో ఉన్న సర్వే నంబరు 612లో స్థానికంగా ఉన్న కొందరు ప్రజాప్రతినిధులు తలా ఇంత గతంలోనే కబ్జా చేశారు. బుధవారం ఒకరినొకరు ఫిల్లర్లు ఎందుకు వేశావంటూ వాగ్వాదం చేసుకున్నారు. 'ప్రభుత్వ భూమి నువ్వు కబ్జా చేశావంటే. నువ్వు చేశావు..' అటూ ఆరోపించుకున్నారు. గత కొంతకాలంగా ఇక్కడి భూమిపై కన్నేసిన కొందరు కబ్జా చేస్తూ తమ పరం చేసుకునే పనిలో ఉన్నారు. గతంలో స్థానిక పాత్రికేయుల కోసం ఈ సర్వే నంబరులోనే ఇళ్ల స్థలాల కోసం ఇచ్చారు. జాతీయ రహదారి 363లో నాలుగు వరసల రోడ్డు నిర్మాణంలో కేటాయించిన భూమిని కోల్పోయారు. ఆ మేరకు భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించారు. అయితే అందులో కొంత మేర మిగిలిన ప్రభుత్వ జాగాను ఆక్రమించుకునేందుకు ప్రణాళిక వేశారు. గతంలో ప్లాట్లు కేటాయించిన వారి అంగీకారంతో ఆ పక్కనే ఉన్న భూమి సైతం కబ్జా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అమ్మడం, కొనడం నిషేధం అయినప్పటికీ క్రయ విక్రయాలు జరిగిపోయాయి. స్థానికంగా ఉన్న ముగ్గురు ప్రజాప్రతినిధులు ఓ ఒప్పందం కుదుర్చుకుని వ్యవహారం నడిపిస్తున్నారు. మిగిలిన భూమిని ఒక్కొక్కరు ఆరు గుంటల చొప్పున పంచుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ పంపకాల్లో ఒకరు ఎక్కువగా చొచ్చుకుని రావడంతో ఆగ్రహంతో బహిరంగంగానే కబ్జాల బండారం బయటపెట్టుకున్నారు. ఇప్పటికే ఈ జాగాలో నిర్మాణాలు వెలుస్తున్నాయి. హైవే రోడ్డుకు అనుకుని, రైల్వేస్టేషన్ సమీపంలోనే ఉన్న ఈ భూమి బహిరంగ మార్కెట్‌లో భారీగా డిమాండ్ ఉంది. ఇంతా జరుగుతున్నా కూడా ఇక్కడి రెవెన్యూ యంత్రాంగం కబ్జాలపై పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం


- మంత్రి ఈశ్వర్‌తో నియోజకవర్గానికి ఒరిగిందేం లేదు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



అమరవీరుల స్తూపానికి నివాళి అర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో ప్రత్యేక అభివృద్ధి నిధి పేరుతో రూ.10 వేల కోట్లు ముఖ్యమంత్రి వద్ద ఉంచుకున్నారని, బీఆర్ఎస్ పార్టీని ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసేందుకు వేల కోట్లు ఖర్చు చేయనున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బహుజన రాజ్యాధికార యాత్ర రెండో విడతలో భాగంగా 176వ రోజు వెల్గటూర్ మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ వనరులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని, ఇసుక దందాతో కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారికి ఉన్నత పదవులిచ్చి, రాణి కుముదిని సీఎస్ కాకుండా కుట్ర చేశారన్నారు. బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం చేశారని, రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేవలం రూ.6వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. గతేడాది దళితబంధుకు రూ.17 వేల కోట్లు కేటాయించి రూపాయి కూడా ఖర్చుచేయలేదన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో ధర్మపురి నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇళ్లు కూడా ఇవ్వలేదని, పేదల సంక్షేమం గాలికొదిలేశారని విమర్శించారు. పేదల బతుకులు మారాలంటే బహుజనులకు రాజ్యాధికారం రావాలన్నారు. యాత్రలో జిల్లా ఇన్‌చార్జి నారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్, మండల అధ్యక్షుడు స్వామి, షాహీన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

కరీంనగర్: ట్రాఫిక్ విభాగం నుంచి డిపో మేనేజర్లుగా పదోన్నతి పొందిన వారికి బుధవారం ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మెయింటనెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రజలకు అందుబాటులో ఉంచడంతోపాటు లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు సమష్టి కృషి అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెక్రెటరీ కె.యుగంధర్ రెడ్డి, వరంగల్ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ఏఎంఈ మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయ మెకానికల్ సూపర్‌వైజర్ గోపాల్ రెడ్డి, వివిధ డిపోల మేనేజర్లు వి.జ్యోత్స్న, ఐ.విజయమాధురి, కె.పరిమళ, యు.రాజ్యలక్ష్మి, టి.స్వామి, ఎన్.మనోహర్, జి.కవిత, టి.ఎస్ స్వామి, కె.కవిత, ఎం.అమృత, వి.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఈసారి ఎంసెట్‌కు 70% సిలబస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌లో ఈసారి 70% సిలబస్ మాత్రమే ఉంటుందని ఉన్నత విద్యా మండలి వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరంలో 70% సిలబస్ అమలు చేశారు. ఈ కారణంగా ప్రాక్టికల్స్‌లోనూ ఇదేస్థాయిలో సిలబస్‌ను ఇంటర్ బోర్డు నిర్ణయించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎంసెట్‌లోనూ ఈ ఏడాదికి 70% సిలబస్‌తో పరీక్ష ఉండాలని మండలి భావించింది. మే 7వ తేదీ నుంచి ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు మొదలవుతాయి. ఇందుకు సంబంధించిన తేదీలను ప్రకటించినప్పటికీ, పూర్తి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఇంటర్ హాల్ టికెట్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎంసెట్ తేదీలను ఖారారు చేయాలని భావిస్తున్నారు. మరోవైపు ఇంటర్ మార్కుల వెయిటేజీపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. జేఈఈ ఇతర జాతీయస్థాయి పరీక్షలకు అకడమిక్ వెయిటేజ్ తీసుకోవడం లేదు. మన రాష్ట్రంలో జరిగే ఎంసెట్ కూడా కరోనా సమయం నుంచి ఇంటర్ వెయిటేజ్ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇక నుంచి ఇదే విధానం అమలు చేయాలని భావిస్తున్నారు. దీనికి ఉత్తర్వులు విడుదలవ్వాల్సి ఉంది.

డిపాజిట్లు క్లెయిమ్ చేయని వారు దరఖాస్తు చేయండి

కృషి బ్యాంక్ డిపాజిటర్లకు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ సూచన

సాక్షి, హైదరాబాద్: కృషి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, సికింద్రాబాద్ నుంచి తమ అన్‌క్లెయిమ్ డిపాజిట్ మొత్తాలను పొందని ఖాతాదారులు వారి వివరాలను కృషి బ్యాంక్ లిక్విడేటర్‌కు సమర్పించి వారి ఖాతాలను సెటిల్మెంట్ చేసుకోవాలని సీఐడీ విభాగం అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్‌లోని కృషి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాదారులకు చెల్లింపులు చేయకుండా 2001 ఆగస్టు 11 మూత వేయడంపై హైదరాబాద్‌లోని మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైందని, ఈ కేసు దర్యాప్తు సీఐడీ పోలీసులు చేపట్టినట్టు మహేశ్ భగవత్ పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు కృషి బ్యాంక్, దాని డైరెక్టర్ల ఆస్తులను జప్తు చేశారన్నారు. ఈ ఆస్తులను విక్రయించి డిపాజిటర్లకు డబ్బులు పంచే బాధ్యత కోర్టు లిక్విడేటర్‌కు అప్పగించిందని తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఇప్పటి వరకు 700 మందికిపైగా డిపాజిటర్లకు డబ్బు పంపిణీ చేశారని వెల్లడించారు. డబ్బు అందని మరో వందకు పైగా ఖాతాదారులు వారి సెటిల్మెంట్‌కు ముందుకు రావాలని మహేశ్ భగవత్ కోరారు. డబ్బులు పొందని ఖాతాదారులు వారి క్లెయిమ్ దరఖాస్తు, గుర్తింపు చిరునామా రుజువులు అందించాలన్నారు. ఇందుకోసం కృషి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ లిక్విడేటర్‌ను 9100115627 నంబర్‌లో లేదా నాంపల్లిలోని గాంధీభవన్ ఎదురుగా ఉన్న గృహకల్ప కాంప్లెక్స్‌లోని సీసీ, ఆర్‌సీఎస్ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని సూచించారు. లకీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయం మూడో అంతస్తులో సీఐడీ డీఎస్పీ జె.వెంకట్ రెడ్డిని 9440700870 నంబర్‌లో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

నవీన్ మిట్టల్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన ట్రెసా



సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి శాఖ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా).. రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌ను కోరింది. ఈ మేరకు ట్రెసా ప్రతినిధి బృందం బుధవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేసింది. జూనియర్ అసిస్టెంట్ల నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు అన్ని కేడర్లలో పదోన్నతులు కల్పించాలంది. తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్ ప్రమోషన్లు ఇప్పించాలని, జిల్లా కలెక్టరేట్లలోని డీఆర్‌వో, సీసీఎల్ఏ కార్యాలయంలోని డిప్యూటీ కమిషనర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఆ వినతిపత్రంలో కోరింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన 15 మంది డిప్యూటీ కలెక్టర్లను రిలీవ్ చేయాలని, రెవెన్యూ శాఖలో కేడర్ స్ట్రెంగ్త్ నిర్ధారించి కొత్తగా ఏర్పాటైన జిల్లాలు, డివిజన్లు, మండలాలకు సిబ్బందిని మంజూరు చేయాలని, తహసీల్దార్ల బదిలీలను నిర్వహించాలని వినతిపత్రంలో ట్రెసా విన్నవించింది. నవీన్ మిట్టల్‌ను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మన్నె ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్‌రావు, కార్యదర్శి చల్లా శ్రీనివాస్, షఫీయుద్దీన్ ఉన్నారు.

ఇంటర్ బోర్డుకు కార్యదర్శి కావాలి: ఏఐఎస్ఎఫ్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ బోర్డు, సాంకేతిక విద్య, కాలేజీ విద్యకు వెంటనే పూర్తిస్థాయి కమిషనర్లను నియమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో ఆరు నెలల్లో ఇంటర్ పరీక్షలతో పాటు, పలు ప్రవేశ పరీక్షలు జరుగుతాయని, కీలకమైనఈ సమయంలో ఇన్‌చార్జులతో నెట్టుకురావడం సరికాదని తెలిపారు.

ఏబీకేకు 'రాజా రామ్మోహన్‌రాయ్ జాతీయ అవార్డు'

ప్రకటించిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ● ఈనెల 28న న్యూఢిల్లీలో ప్రదానం

సాక్షి, హైదరాబాద్: ప్రసిద్ధ పాత్రికేయుడు, పలు ప్రముఖ దినపత్రికలకు సంపాదకుడిగా పనిచేసిన డాక్టర్ ఏబీకే ప్రసాద్‌కు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 'రాజా రామ్మోహన్‌రాయ్'జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బుధవారం ప్రకటించింది. జర్నలిజం రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా అవార్డులను అందిస్తున్న విషయం తెలిసిందే. పాత్రికేయ రంగంలో దాదాపు ఆరు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న ఏబీకే గతంలో (2004–2009) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షులుగా వ్యవహరించారు. దాదాపు 87 ఏళ్ల వయస్సులోనూ ఏబీకే తన పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తూనే ఉన్నారు. 'రాజా రామ్మోహన్‌రాయ్'అవార్డు కింద ఏబీకేకి జ్ఞాపిక, ప్రశంసాపత్రం, లక్ష నగదు అందించనున్నారు. ఈనెల 28న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డును ప్రకటించింది.

కార్టూనిస్ట్ శంకర్‌కు జాతీయ అవార్డు..

సాక్షిలో 'భారత భాగ్య విధాత'క్యాప్షన్‌తో వేసిన క్యారికేచర్‌కు పురస్కారం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కార్టూనిస్టు పామర్తి శంకర్‌కు 'ఎక్సలెన్స్ ఇన్ పొలిటికల్ క్యారికేచర్'జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బుధవారం ప్రకటించింది. శంకర్ 'సాక్షి'పత్రికలో మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా 'భారత భాగ్య విధాత' క్యాప్షన్‌తో వేసిన క్యారికేచర్ ఈ పురస్కారానికి ఎంపికైంది. గతంలో పామర్తికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ పలు అవార్డులు లభించిన సంగతి విదితమే. ఈ నెల 28వ తేదీన న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ.50 వేల నగదు అందించనున్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డును ప్రకటించింది.



అడ్డదారులకు అడ్డా!

సోషల్ మీడియా వేదికగా యువత అసాంఘిక కార్యకలాపాలు

- పెడతోవ పట్టిస్తున్న సామాజిక సంబంధాల గ్రూపులు
- యువతీయువకులకు, విద్యార్థులకు ఎర
- డ్రగ్స్‌కు, అశ్లీల వీడియోల వీక్షణకు బానిసలుగా, నేరస్తులుగా మారుతున్న వైనం
- ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌ల్లో డ్రగ్స్ ఆర్డర్లు..టెలిగ్రామ్‌లో అశ్లీల వీడియోల లింక్‌లు
- మహిళా భద్రత విభాగం ఆన్‌లైన్ పెట్రోలింగ్‌లో గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: ఓ అగ్గిపుల్లతో ఇంట్లో కొవ్వొత్తిని వెలిగించొచ్చు. అదే అగ్గిపుల్లతో ఇంటినీ తగులబెట్టొచ్చు. ఓ కత్తితో కూరగాయలు కోయొచ్చు. అదే కత్తితో ప్రాణం కూడా తీయొచ్చు. ఏ వస్తువునైనా వాడే విధానాన్ని బట్టి దాని ప్రయోజనం ఉంటుంది. సోషల్ మీడియా వేదికలకు కూడా ఇప్పుడదే సూత్రం వర్తిస్తోంది. సామాజిక సంబంధాలు మెరుగు పరుచుకోవడానికి, సమాచారం ఇచ్చి పుచ్చుకోవడానికి ఉపయోగించుకోవాల్సిన సోషల్ మీడియా వేదికలను కొందరు తమ అడ్డదారులకు అడ్డాలుగా వాడుకుంటున్నారు. నేరగాళ్లు వీటిని ఆధారంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంటే.. వీటిని విరివిగా ఉపయోగించే యువత డ్రగ్స్‌కు బానిసలుగా అవుతున్నారు. కొందరు నేరస్తులుగా మారుతూ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు.

గుంపులు కట్టి..పెడతోవ పట్టి..

యుక్త వయస్సులో దూకుడుగా వ్యవహరించే కొందరు యువతకు సోషల్ మీడియా యాప్‌లు మంచి అడ్డాలుగా మారాయి. ముఖ్యంగా జీవితంలో ఏమీ సాధించకుండానే పోకిరీలుగా మారి జల్సాలు చేసే యువత ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, గూగుల్ గ్రూప్స్, రెడ్డిట్ వంటి సోషల్ మీడియా యాప్స్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. ప్రత్యేక గ్రూప్‌లుగా ఏర్పడి, వీటి ద్వారా మత్తుపదార్థాల వినియోగం, సరఫరా, కొనుగోలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్టు పోలీస్, ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇటీవల పట్టుబడిన చాలా కేసుల్లో నిందితులు ఈ గ్రూపులను డ్రగ్స్ సరఫరాకు, కొనుగోలుకు వాడుకున్నట్టు వారు వెల్లడించారు. డ్రగ్స్ ముఠాలు సైతం యుతను లక్ష్యంగా చేసుకుని ఈ సోషల్ మీడియా గ్రూపుల్లో డ్రగ్స్, అక్రమ ఆయుధాల విక్రయం వంటి వాటిపై ప్రకటనలు ఇస్తున్నాయి. ఆకర్షితులైన యువతను తమ గ్రూపుల్లోకి చేర్చుకుని పెడతోవ పట్టిస్తున్నాయి.

పరిచయం పెంచుకుని పుట్టి ముంచుతారు

తొలుత కొన్నాళ్లు వారితో చాటింగ్ చేస్తూ పరిచయాలు పెంచుకుంటుఆరు. నమ్మకం కుదిరిన తర్వాత మెల్లగా వారిని డ్రగ్స్ వైపు ఆకర్షితుల్ని చేస్తారు. తర్వాత వాటిని కొనుగోలు చేసేలా వాడేలా ప్రేరేపిస్తారు. వాళ్లు డ్రగ్స్ కొనడం మొదలు పెట్టి, క్రమంగా వాటికి అలవాటు పడిన తర్వాత వారి తోటి విద్యార్థులు, స్నేహితులకు వాటిని అలవాటు చేసేలా చేస్తారు. ఇలా ఒకరి నుంచి ఒకరికి ఈ మత్తుపదార్థాల అలవాటు వ్యాపింపజేస్తారు. యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చడంతో పాటు వారి దగ్గర డబ్బులు దండుకోవడం, డ్రగ్స్ పెడ్లర్లుగా మార్చడం వంటివి చేస్తున్నట్టు పోలీసు అధికారుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.

ప్రతి దానికీ కోడ్ భాష..

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, అక్రమ ఆయుధాలు ఇలా ప్రతిదానికీ ఆన్‌లైన్‌లోని ముఠాలు మారుపేర్లు పెట్టుకుంటున్నట్టు ఓ పోలీస్ అధికారి తెలిపారు. గంజాయిని పాట్, ఎల్ఎస్‌డీని పేపర్, ఎక్సటసీ డ్రగ్స్‌ను పిల్ (వీటిని పార్టీ డ్రగ్స్ అంటారు)గా పిలుస్తారు. స్నేహితులతో డ్రగ్స్ తీసుకునేందుకు వెళ్లాలనుకుంటే 'ట్రిప్‌కు వెళదాం' అంటారు. ఇలా ప్రతి దానికీ ఓ కోడ్ భాష ఉంటుందని ఆ అధికారి వివరించారు.

అమ్మకానికి అశ్లీల వీడియోలు..

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువతలో చాలామంది అశ్లీల వీడియోలను చూసేందుకు అమితాసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా యుక్త వయసులోని పాఠశాల, కళాశాలల విద్యార్థులు అశ్లీల వీడియోల వీక్షణకు బానిసలుగా మారుతున్నట్టు రాష్ట్ర మహిళా భద్రత విభాగం అధికారుల ఆన్‌లైన్ పెట్రోలింగ్‌లో వెల్లడైంది. టెలిగ్రామ్‌లో ఈ తరహా వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్నట్టు పోలీస్ అధికారులు ఇప్పటికే గుర్తించారు. రూ.50 నుంచి రూ.100 ఇస్తే చాలు 50 నుంచి 100 పోర్న్ వీడియోల లింకులను కొన్ని ముఠాలు యువతకు చేరవేస్తున్న సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విద్యార్థుల వయస్సు, ప్రొఫైల్స్ వారి అభిరుచులను ఆధారంగా చేసుకుని కొన్ని ముఠాలు సోషల్‌మీడియా యాప్స్‌లోని కొన్ని గ్రూప్‌ల ద్వారా వారికి రిక్వెస్ట్‌లు పెడుతున్నాయి. వారు ఆ గ్రూప్‌లలో చేరిన తర్వాత వారితో సెక్స్ గురించి చాటింగ్ చేసి..ఉద్రేకపరచడం ద్వారా వారిని పోర్న్ వీడియోలకు బానిసలుగా మారుస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు. ఇలా బానిసలుగా మారిన వారు పాకెట్‌మనీ ఖర్చుపెట్టి పోర్న్ వీడియోలు చూడడంతో పాటు కొన్ని సందర్భాల్లో ఇంట్లో డబ్బులు కాజేసి వాటిని అశ్లీల వీడియోలు వీక్షించేందుకు ఖర్చు చేస్తున్నట్టు ఆ అధికారి వివరించారు.

అవగాహన కల్పన, అప్రమత్తతే కీలకం

సాంకేతిక యుగంలో టెక్నాలజీని వాడకుండా ఉండడం అనేది కుదరని పని. సోషల్ మీడియా యాప్స్‌కు దూరంగా ఉండాలని పిల్లలకు చెప్పే పరిస్థితి కూడా లేదు. మంచితో పాటు చెడుకు అవకాశం ఉన్న ఈ సోషల్ మీడియా యాప్స్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై పిల్లలకు స్పష్టమైన అవగాహన కల్పించాలి. అపరిచితులతో ఆన్‌లైన్‌లో స్నేహాలు సరికాదన్న విషయాన్ని వాళ్లకి అర్థం అయ్యేలా చెప్పాలి. అదే సమయంలో ఇంటర్నెట్‌లో వాళ్ళు ఏ ఏ అంశాలు సెర్చ్ చేస్తున్నారు.. సోషల్ మీడియాలో ఎవరెవరితో స్నేహం చేస్తున్నారు అనేది గమనిస్తూ ఉండాలి. పిల్లల ప్రవర్తనలో ఏదైనా మార్పు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ఇంట్లో ఉన్న కంప్యూటర్ వీలైనంత వరకు కామన్ ఏరియాలో ఉండేలా చూసుకోవడం ఉత్తమం. పిల్లలు కంప్యూటర్లు, ఫోన్లలో గంటల తరబడి గడుపుతుంటే..వారిపై ఓ కన్ను వేయాల్సిందే.

– సీనియర్ పోలీస్ అధికారి

క్రెడిట్ కార్డుల స్వైపింగ్‌తో రూ.5 కోట్ల మోసం

వందకు పైగా క్రెడిట్ కార్డులు సేకరించి..

- రూ.5కోట్ల నగదు స్వైప్ చేసి కార్డుదారులకు నగదు ఇవ్వకుండా పరార్
- పక్కా వ్యూహంతో కొన్నాళ్లుగా 20మంది యువకుల నుంచి క్రెడిట్ కార్డుల సేకరణ
- మొదట్లో ఆకర్షించేందుకు కమీషన్ తీసుకోకుండా స్వైపింగ్
- దాంతో ఆశకు పోయి కార్డులు తీసుకొచ్చి అప్పగించిన యువకులు
- దమ్మాయిగూడ వాసి ఘరానా మోసం
- సైబర్‌క్రైం, సీసీఎస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న బాధితులు



హిమాయత్‌నగర్: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 100కు పైగా క్రెడిట్ కార్డుల నుంచి దాదాపు రూ.5కోట్ల సొమ్మును స్వైప్ చేసి..ఆ మొత్తం సొమ్ముతో పరారైన దమ్మాయిగూడకు చెందిన నవీన్ అనే యువకుడి భాగోతం కలకలం రేపుతోంది. స్వైప్ చేసి డబ్బులు ఇస్తాడని ఎదురుచూసీ చూసీ చివరికి మోసపోయామని భావించి దాదాపు 20మంది యువకులు పోలీసులను ఆశ్రయించారు. రెండు రోజులుగా సిటీ సైబర్‌క్రైం, సీసీఎస్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివరాలిలా.,

మొబైల్ షోరూం స్వైప్ మిషన్ ద్వారా

ఓ మొబైల్ షోరూంలో క్యాషియర్‌గా పనిచేస్తున్న నవీన్ మొదట్లో తన స్నేహితులకు క్రెడిట్‌కార్డును స్వైప్ చేసి కమీషన్ తీసుకోకుండా క్యాష్ ఇచ్చేవాడు. ఇలా అతనిపై నమ్మకం కుదరడంతో మిత్రబృందానికి అత్యాశకలిగింది. నవీన్ తమ నుంచి కమీషన్ తీసుకోవడం లేదు కాబట్టి మనమే క్రెడిట్‌కార్డులను సేకరించి పదిశాతం కమీషన్ చొప్పున క్యాష్ కావాల్సిన వారికి ఇద్దామనే ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఇలా సుమారు 20మంది యువకులు ఒక్కొక్కరు ఐదారు బ్యాంకుల నుంచి దాదాపు వంద క్రెడిట్‌కార్డులు సేకరించి పిన్ నంబర్లతో సహా ఒకేసారి నవీన్‌కు ఇచ్చారు. ఇన్ని కార్డులు ఒకేసారి ఇవ్వడంతో క్యాష్ ఇచ్చేందుకు అతను వారం గడువు అడిగాడు. అయితే వారం కాదు.. రెండు వారాలు గడిచినా పత్తా లేకపోవడం... ఈలోగా తమ కార్డుల నుంచి స్వైప్ చేస్తున్నట్టు ఫోన్లలో మెసేజీలు రావడంతో యువకులు పోలీసులను ఆశ్రయించారు. కాగా, తాను ఒక్కడినే రూ.కోటి డబ్బు కావాలని కార్డులు ఇచ్చినట్లు ఓ బాధితుడు రవి చెప్పుకొచ్చారంటే ఏ స్థాయిలో మోసం జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

ఎలక్ట్రిక్ వాహన రంగానికి పూర్తి ప్రోత్సాహం: కేటీఆర్

మొబిలిటీ వీక్‌లో ఈ–మోటార్ షో ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి పూర్తి స్థాయిలో ప్రోత్సాహాన్ని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. దేశ ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో కీలక పాత్ర పోషించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతున్న ఈ–మొబిలిటీ వీక్‌లో భాగంగా ఈ–మోటార్ షోను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 24/7 విద్యుత్‌ను అందించే సామర్థ్యం, ప్రగతిశీల 'ఈవీ' వినియోగ పాలసీలతో దేశంలోనే అత్యంత విద్యుదీకరించిన రాష్ట్రంగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సెల్ మాన్యుఫాక్చరింగ్, సెల్ కాంపోనెంట్ తయారీ, బ్యాటరీ మార్పిడి స్టేషన్లు, 2–వీలర్, 3–వీలర్, బస్సుల్లో ఈవీ తయారీ...ఇలా విద్యుత్ వాహన రంగానికి సంబంధించి తెలంగాణ సమగ్ర వ్యూహాన్ని అనుసరిస్తోందన్నారు. అధునాతన ఆటోమోటివ్ టెక్నాలజీల అభివృద్ధిలో నగరం అగ్రగామిగా ఉందని, రానున్న రోజుల్లో ఈ–మోటార్ షో ఆటోమొబైల్ కంపెనీలకు మార్గదర్శక వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ మోటార్ షోను ఆద్యంతం ఆసక్తిగా తిలకించిన ఆయన హాప్ ఓఎక్సో సిటీ బైక్ సహా పలు ఈవీ వాహనాలను ఆవిష్కరించారు. ఈ ప్రదర్శన 3 రోజులపాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

'ఆ అభ్యర్థులకు' మరో అవకాశం

ఒక సెం.మీ.లోపు ఎత్తు తేడా ఉన్న వారికి మరోమారు కొలతలు తీయనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

సాక్షి, హైదరాబాద్ : యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీలో భాగంగా అభ్యర్థులకు నిర్వహించిన ఎత్తు కొలతల్లో ఒక సెంటీమీటర్, అంతకంటే తక్కువ తేడాతో అనర్హులైన అభ్యర్థులకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మరో అవకాశం కల్పించనుంది. ఒక సెంటీమీటర్, ఆ లోపు తేడాతో అనర్హులైన అభ్యర్థులకు మరోమారు ఎత్తు కొలతలు తీయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎత్తు కొలతలో పాల్గొనాలనుకునే అర్హులైన అభ్యర్థులు www.tslprb.in వెబ్‌సైట్ ఈనెల 10 ఉదయం 8 గంటల నుంచి 12వ తేదీ రాత్రి 8 గంటల వరకు లాగిన్ ఐడీల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎస్ఏఆర్ సీపీఎల్ అంబర్‌పేట్, 8వ బెటాలియన్ కొండాపూర్‌లలో ఈ ఎత్తు కొలతలను తీయనున్నట్లు వెల్లడించారు. భౌతిక కొలతలకు హాజరయ్యే అభ్యర్థులు అడ్మిట్‌కార్డులను తీసుకురావాల్సి ఉంటుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయకుండా వినతిపత్రాలు రాసి తెచ్చే వారిని ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం

ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూకృష్ణన్ పిలుపు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తోన్న రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా సమరశీల ఉద్యమాలు చేపట్టాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూకృష్ణన్ పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జాతీయ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్ల అధ్యక్షతన జరిగిన ఏఐకేఎస్ జాతీయ ఆఫీస్‌బేరర్ల సమావేశంలో విజూ పాల్గొని మాట్లాడారు. కనీస మద్దతు ధరల చట్టం చేస్తానని చెప్పిన కేంద్రం ఇంతవరకూ దాన్ని అమలు చేయలేదని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 9, 10వ తేదీల్లో దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అఖిల భారత కోశాధికారి కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు విజరుకుమార్, అమల్‌హల్దా, అమ్రరాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజూ కృష్ణన్

రాష్ట్రంలో మరో | కొత్త రైల్వే మార్గం

ఇటు కర్నూలు.. అటు వాడీ లైన్లను అనుసంధానిస్తూ కొత్త మార్గం

- అందుబాటులోకి వచ్చిన మహబూబ్‌నగర్ –కృష్ణా రైల్వే లైన్
- మహబూబ్‌నగర్–మునీరాబాద్ ప్రాజెక్టులో భాగంగా పూర్తి
- దానిమీదుగా వెంటనే గూడ్సు రైళ్లకు గ్రీన్ సిగ్నల్
- ప్రధాన మార్గాల్లో ప్యాసింజర్ రైళ్లకు ట్రాఫిక్ రద్దీ నుంచి కొంత ఊరట



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి వచ్చింది. మహబూబ్‌నగర్– కర్ణాటకలోని మునీరాబాద్ మధ్య నిర్మిస్తున్న కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే మార్గానికి సంబంధించి తెలంగాణ భూభాగంలో పనులు పూర్తి చేయటంతో పాటు ఒకవైపు కాచిగూడ–కర్నూలు మార్గాన్ని, మరోవైపు సికింద్రాబాద్–వాడీ మార్గాన్ని అనుసంధానించింది. దీంతో ఈ రెండు మార్గాలకు ఇదో కొత్త ప్రత్యామ్నాయ మార్గంగా అవతరించింది. ఈ మార్గాన్ని ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే దాని మీదుగా తొలుత సరుకు రవాణా రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఇంకా ఈ మార్గాన్ని విద్యుదీకరించలేదు. సెప్టెంబర్ నాటికి ఆ పనులు కూడా పూర్తవుతాయి. అప్పటి వరకు గూడ్సు రైళ్లనే తిప్పాలని అధికారులు నిర్ణయించారు. ఇది దేవరకద్ర– జక్లెయిర్– మక్తల్– మాగనూరు–కృష్ణా మీదుగా నిర్మితమైంది. ఇప్పుడు కర్నూలు మార్గంలో బెంగుళూరు వైపు, వాడీ మార్గంలో వెళ్లే గూడ్సు రైళ్లను ఈ మార్గం మీదుగా మళ్లించటం ద్వారా, వాటి ప్రయాణ సమయం తగ్గటమే కాకుండా, ప్రధాన మార్గాల్లో ఓవర్ ట్రాఫిక్‌తో ప్యాసింజర్ రైళ్లకు ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించినట్టవుతుంది. దీంతో ఈ కొత్త మార్గానికి ప్రాధాన్యం ఏర్పడింది.

రూ.943 కోట్లతో నిర్మాణం..: మహబూబ్‌నగర్–మునీరాబాద్ మార్గాన్ని రూ.3543 కోట్ల అంచనాతో ప్రారంభించారు. ఇందులో తెలంగాణ పరిధిలో దేవరకద్ర నుంచి కర్ణాటక సరిహద్దులోని కృష్ణా మధ్య 66 కి.మీ. నిడివి ఉంటుంది. తెలంగాణ పరిధిలోని ఈ దూరాన్ని రూ.943 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఆ పనులు ఇప్పుడు పూర్తి చేశారు. దేవరకద్ర–జక్లెయిర్ మధ్య 28.3 కి.మీ. దూరాన్ని 2017 మార్చిలో, జక్లెయిర్–మక్తల్ మధ్య 11.5 కి.మీ. దూరాన్ని 2020లో, మక్తల్–మాగనూరు మధ్య ఉన్న 13.3 కి.మీ. నిడివిని 2022 మార్చిలో పూర్తి చేశారు. మాగనూరు–కృష్ణా మధ్య 12.7 కి.మీ. నిడివిని ఇప్పుడు పూర్తి చేశారు. దీంతో తెలంగాణ పరిధిలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 66 కి.మీ. మొత్తం పని పూర్తయింది. దేవరకద్ర వద్ద ఇది కర్నూలు లైన్‌తో, కృష్ణా దాటాక వాడి లైన్‌తో అనుసంధానమైంది. దీంతో ఇటు కర్నూలు మీదుగా వెళ్లాల్సిన రైళ్లు, అటు వాడీ మీదుగా వెళ్లాల్సిన రైళ్లను ఈ మార్గం మీదగా నడిపించేందుకు వీలు కలిగింది. హైదరాబాద్ నుంచి రాయచూర్, గుంతకల్, బళ్లారి, హుబ్లీ, గోవా తదితర ప్రాంతాలకు ఈ మార్గం మీదుగా తక్కువ సమయంలో వెళ్లే వీలుంటుంది. బెంగళూరుకు కూడా ఇది ప్రత్యామ్నాయ లైన్‌గా ఉండనుంది. ఆయా ప్రాంతాల్లోని విద్యుదుత్పత్తి, సిమెంటు తదితర పరిశ్రమలకు సరుకు రవాణా చేసే రైళ్లకు ఇది ముఖ్య మార్గంగా మారుతోంది. దీంతో ఈ మార్గంలో వెంటనే గూడ్సు రైళ్లను నడిపేందుకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ కీలక మార్గాన్ని పూర్తి చేయటంలో శ్రమించిన అధికారులు, సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

రాష్ట్ర జనాభా మూడున్నరకోట్లు..

ఎస్సీల జనాభా 54,08,800

ఎస్టీల జనాభా 31,77,940

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర జనాభా 3,50,03,674. అందులో పురుషుల సంఖ్య 1,76,11,633 కాగా మహిళలు 1,73,92,041మంది ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం చూస్తే... మొత్తం ఎస్సీల జనాభా 54,08,800 కాగా వారిలో మహిళలు 27,15,673 , పురుషులు 26,93,127 మంది ఉన్నారు. ఇక ఎస్టీల జనాభా విషయానికొస్తే... మొత్తం 31,77,940 ఉండగా, అందులో పురుషులు 16,07,656, మహిళలు 15,70,284 మంది ఉన్నారు.

- ➡ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా ఎస్టీల జనాభా సంఖ్య 3,92,034, మహబూబాబాద్ జిల్లాలో 2,92,778, ఆదిలాబాద్ జిల్లాలో 2,24,622, నల్లగొండ జిల్లాలో 2,09,252, ఖమ్మం జిల్లాలో 1,99,342.
- ➡ ఎస్సీల విషయానికొస్తే...రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా అంటే 3,34,337, ఆ తర్వాత నల్లగొండ జిల్లాలో 2,92,951, ఖమ్మం జిల్లాలో 2,79,319, సంగారెడ్డి జిల్లాలో 2,77,429. హైదరాబాద్ జిల్లాలో 2,47,927 మంది ఉన్నారు.
- ➡ బుధవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఆయా అంశాలు పొందుపరిచారు. గతంలో ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలను షెడ్యూల్ ప్రాంతాల జిల్లాలుగా పరిగణించగా, ప్రస్తుతం అవే షెడ్యూల్ ప్రాంతం కొమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, వరంగల్, నాగర్‌కర్నూల్ అనే 9 జిల్లాల్లో ఉన్నట్టు తెలియజేశారు.
- ➡ ఉట్నూరు, ఆసిఫాబాద్, భద్రాచలం, సారపాకతో సహా షెడ్యూల్ ప్రాంతాల్లో పంచాయతీలు=1,286
- ➡ వందశాతం ఎస్టీ గ్రామపంచాయతీలు (తండాలు/గూడెంలు) =1,177 ప్లెయిన్, ఎస్టీ రిజర్వ్ గ్రామపంచాయతీలు =687
- ➡ 2018–19 నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు షెడ్యూల్ ప్రాంత జీపీలు, వంద శాతం ఎస్టీ జీపీలు, షెడ్యూలేతర ప్రాంతాల్లో ఎస్టీ జీపీలకు విడుదల చేసిన గ్రాంట్లు సంక్షిప్తంగా కలిపి మొత్తం...రూ.2,062.75 కోట్లు గ్రాంట్ల రూపంలో విడుదల చేసినట్టు తెలియజేశారు.



క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ

డాలస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రి (భారత్) జోడీ శుభారంభం చేసింది. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 5-7, 7-6 (7/3), 10-3తో క్రిస్టోఫర్ యుబ్యాంక్స్-మార్కస్ జిరోన్ (అమెరికా) జోడీపై గెలిచింది. గంటా 46 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-యూకీ మూడు ఏస్‌లు సంధించారు. క్వార్టర్ ఫైనల్లో జూలియన్ క్యాష్-హెన్రీ ప్యాటర్న్ (బ్రిటన్)లతో సాకేత్-యూకీ ఆడతారు.

మెయిన్ 'డ్రా'కు శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ అమ్మాన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, జాతీయ చాంపియన్ ఆకుల శ్రీజ మహిళల సింగిల్స్‌లో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. జోర్డాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో క్వాలిఫయింగ్ రౌండ్ చివరి మ్యాచ్‌లో 79వ ర్యాంకర్ శ్రీజ 6-11, 11-7, 7-11, 11-3, 11-5తో ఎన్జీ వింగ్ లామ్ (హాంకాంగ్)పై గెలిచింది. నేడు జరిగే మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ మిమా ఇటో (జపాన్)తో శ్రీజ తలపడుతుంది.





బోర్డర్-గావస్కర్ ట్రోఫీతో రోహిత్ శర్మ, కమిన్స్

అసలు సిసలు 'పరీక్ష'

- నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు
- డబ్ల్యూటీసీ ఫైనల్ లక్ష్యంగా బరిలో టీమిండియా
- శుభారంభంపై ఆసీస్ దృష్టి
- ఉదయం గం.9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

సమయం వచ్చేసింది... ధనాధన్ క్రికెట్ తరంలో టెస్టు క్రికెట్‌ను సజీవంగా నిలబెడుతూ అంతా ఎదురు చూస్తున్న పోరుకు రంగం సిద్ధమైంది... హోరాహోరీ సమరాలు, పోటాపోటీ మాటల తూటాలు, అగ్రశ్రేణి ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనలు, అనూహ్య మలుపులు, చిరస్మరణీయ ఫలితాలు... ఒకటేమిటి భారత్, ఆస్ట్రేలియా మధ్య పోరు అంటే అన్ని రకాల దినుసులతో కూడిన సంపూర్ణ భోజనం... గత కొన్నేళ్లుగా టెస్టు క్రికెట్‌లో అత్యంత ఆసక్తికర మ్యాచ్‌లతో 'యాషెస్'ను మించి అభిమానులను అలరిస్తున్న 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' కోసం ఇరు జట్లు సమస్త అస్త్రాలు, సర్వ సన్నాహాలతో బరిలోకి దిగబోతున్నాయి. 33 రోజుల వ్యవధిలో సాగే ఈ నాలుగు టెస్టుల్లో తుది విజేతగా ఎవరు నిలిచినా... అభిమానులకు ఫుల్ వినోదం మాత్రం గ్యారంటీ!

నాగ్‌పూర్: తొలి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు మరోసారి ఫైనల్‌కు అర్హత సాధించే లక్ష్యంతో సొంత గడ్డపై అత్యంత కీలక పోరుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియాతో నేటి నుంచి జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌లో టీమిండియా కనీసం మూడు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. మరోవైపు ఇప్పటికే డబ్ల్యూటీసీ ఫైనల్ చేరిన ఆసీస్ బృందం భారత గడ్డపై సిరీస్ గెలిచే 'అత్యంత కఠిన ఆపరేషన్' కోసం తమ సర్వశక్తులూ ఒడ్డనుంది. తమ దేశంలోనే వరుసగా రెండుసార్లు టీమిండియాకు సిరీస్‌లు కోల్పోయిన కంగారూ బృందం ఇక్కడ సత్తా చాటి ప్రతీకారం తీర్చుకోగలదా అనేది ఆసక్తికరం. స్వదేశంలో అసమాన రికార్డు, తాజా ఫామ్ చూస్తే భారత్‌దే పైచేయిగా కనిపిస్తున్నా... ఆస్ట్రేలియాలాంటి బలమైన జట్టును తక్కువగా అంచనా వేస్తే భంగపాటు తప్పదు.

కేఎస్ భరత్ అరంగేట్రం?

తుది జట్టులో కచ్చితంగా ఉండే ఆరుగురు కాకుండా మిగతా ఐదు స్థానాలకు జట్టులో పోటీ నెలకొని ఉంది. చివరి నిమిషంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఆసక్తికరం. రోహిత్, పుజారా, కోహ్లి, అశ్విన్, జడేజా, షమీ ఆడటం ఖాయం కాగా, వైస్ కెప్టెన్‌గా ఇప్పటికే రెండుసార్లు మీడియా సమావేశాలకు వచ్చిన కేఎల్ రాహుల్ స్థానానికి కూడా ఢోకా ఉండకపోవచ్చు. రోహిత్‌కు ఓపెనింగ్ భాగస్వామిగా రాహులే బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే గాయంతో దూరమైన శ్రేయస్‌కు బదులుగా మిడిలార్డర్‌లో గిల్, సూర్యకుమార్‌లలో ఒకరినే ఎంచుకోవాల్సి ఉంటుంది. వన్డేలు, టి20ల్లో కలిపి గత ఏడు ఇన్నింగ్స్‌లలో 4 సెంచరీలు చేసిన గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు కాబట్టి అతనికే తొలి ప్రాధాన్యత. సూర్యకుమార్ ప్రధానంగా టి20 ఫామ్‌తోనే టీమ్‌లోకి వచ్చాడు. అతని ఫస్ట్ క్లాస్ రికార్డు (45.93 సగటు) మరీ గొప్పగా ఏమీ లేదు. అయితే పంత్ లేకపోవడంతో అతని తరహాలో తక్కువ సమయంలో ఎదురుదాడికి దిగి ప్రత్యర్థిని ఆత్మరక్షణలో పడేసే దూకుడు సూర్యలో ఉందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అలా చూస్తే సూర్య కీలకమవుతాడు. కీపర్ స్థానం కోసం ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ భరత్, ఇషాన్ కిషన్ మధ్య పోటీ ఉంది. ఎడంచేతి వాటం, ధాటి ఇషాన్ సొంతమైనా... ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతని కీపింగ్ సామర్థ్యంపై సందేహాలు ఉన్నాయి. మరోవైపు మూడో స్పిన్నర్‌గా అక్షర్ పటేల్‌ను ఆడిస్తారా లేక వైవిధ్యం కోసం కుల్దీప్‌ను తీసుకుంటారా చూడాలి. ఎంత స్పిన్ పిచ్ అయినా సరే నాలుగో స్పిన్నర్ ఆలోచన లేకపోవచ్చు. షమీతో పాటు సిరాజ్ బరిలోకి దిగే అవకాశాలే ఎక్కువ. అశ్విన్, జడేజా చెలరేగితే ఆసీస్ బెంబేలెత్తిపోవడం ఖాయం.

రెండో స్పిన్నర్ ఎవరు?

ఆస్ట్రేలియా టాప్-5 బ్యాటింగ్ లైనప్ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. భారత గడ్డపై టెస్టుల్లో పేలవమైన రికార్డు ఉన్న వార్నర్ ఈసారి దానిని చక్కదిద్దుకుంటాడా అనేది చూడాలి. ఎప్పటిలాగే స్మిత్ అసమాన బ్యాటింగ్‌పై ఆసీస్ ఆధారపడుతోంది. నాటి సిరీస్‌లో అతనికి మరే బ్యాటర్ నుంచి సహకారం లభించలేదు. ఈసారి ఆ పాత్రను పోషించేందుకు దాదాపు స్మిత్‌లాంటి సామర్థ్యం ఉన్న లబుషేన్ సిద్ధంగా ఉన్నాడు. బౌలింగ్‌లో హాజల్‌వుడ్ దూరం కావడంతో కెప్టెన్ కమిన్స్‌పై బాధ్యత పెరిగింది. ప్రధాన స్పిన్నర్ నాథన్ లయన్ ఆ జట్టు కీలక అస్త్రం కాగా, అతనికి అండగా ఎవరు నిలుస్తారో చూడాలి. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ యాష్టన్ అగర్ కంటే కొత్త ఆటగాడు మర్ఫీకి ఎక్కువ సానుకూలతలు ఉన్నాయి.



నాగ్‌పూర్‌లోని జామ్తా మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఆరు టెస్టులు ఆడింది. ఇందులో నాలుగు టెస్టుల్లో గెలిచింది. ఒక టెస్టులో ఓడిపోయి, మరో టెస్టును 'డ్రా' చేసుకుంది. 2008లో ఆస్ట్రేలియాతో ఇక్కడ టెస్టు ఆడిన భారత్ ఆ మ్యాచ్‌లో 172 పరుగుల తేడాతో విజయం సాధించింది.

"టాస్ సమయంలోనే అన్ని పరిస్థితులను అంచనా వేసి దానికి తగినట్టుగానే తుది జట్టును ఎంపిక చేస్తాం. మేం పిచ్ గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బాగా ఆడటం పైనే మా దృష్టి. గతంలోనూ ఇలాంటి చర్చ జరిగింది. 22 మంది కూడా నాణ్యమైన ఆటగాళ్లే బరిలోకి దిగుతారు. వారు బంతి ఎంత టర్న్ అవుతుంది, స్వింగ్ అవుతుంది ఇలాంటివి ఆలోచించరు."

-రోహిత్ శర్మ, భారత కెప్టెన్

"భారత గడ్డపై ఆసీస్ పాత రికార్డు గురించి మాట్లాడటం అనవసరం. అప్పుడు వారు ఎలా ఆడినా, ఇప్పటి మా టీమ్ చాలా బాగుంది. కఠిన పరిస్థితులకు, ఎలాంటి సవాళ్లకైనా మేం సిద్ధం. ఏ తరహా పిచ్ ఉన్నా దానికి తగ్గట్టు మా ఆటను మార్చుకుంటాం."

-ప్యాట్ కమిన్స్, ఆసీస్ కెప్టెన్

తుది జట్లు (అంచనా):

భారత్: రోహిత్ (కెప్టెన్), రాహుల్, పుజారా, కోహ్లి, గిల్/సూర్యకుమార్, జడేజా, అశ్విన్, భరత్, అక్షర్/కుల్దీప్, షమీ, సిరాజ్.

ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, ఖాజా, లబుషేన్, స్మిత్, హెడ్, హ్యాండ్స్‌కోంబ్/రెన్‌షా, క్యారీ, అగర్/మర్ఫీ, లయన్, బోలండ్.

పిచ్, వాతావరణం

సందేహం లేకుండా స్పిన్‌కు అనుకూలమైన పిచ్. మ్యాచ్ ఆరంభమయ్యాక ఎంత తొందరగా టర్న్ కావడం మొదలవుతుందనేది ఆసక్తికరం. అనుకూల వాతావరణం. వర్షం సమస్య లేదు.

50 భారత గడ్డపై ఇరు జట్ల మధ్య 50 టెస్టులు జరిగాయి. ఇందులో భారత్ 21 గెలిచి, 13 ఓడింది. 15 మ్యాచ్‌లు 'డ్రా' అయ్యాయి. 1 మ్యాచ్ 'టై'గా ముగిసింది.

రిచా మెరుపులు

56 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లతో 91 నాటౌట్



స్టెలెన్‌బాస్ (దక్షిణాఫ్రికా): టి20 ప్రపంచకప్‌కు ముందు ఆఖరి వార్మప్ మ్యాచ్‌లో భారత అమ్మాయిలు జోరుగా ప్రాక్టీస్ చేశారు. రిచా ఘోష్ (56 బంతుల్లో 91 నాటౌట్; 3 ఫోర్లు, 9 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడటంతో భారత్ 52 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగుల భారీస్కోరు చేసింది. రిచా, జెమీమా రోడ్రిగ్స్ (27 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్సర్) నాలుగో వికెట్‌కు 92 పరుగులు జోడించారు. ఆఖరి రెండు ఓవర్లలో అయితే రిచా, పూజ వస్త్రకర్ (13 నాటౌట్; 2 సిక్సర్లు) జోడీ ఏకంగా 46 పరుగులు సాధించడం విశేషం. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 131 పరుగులే చేసింది. శుక్రవారం ప్రపంచకప్ మొదలుకానుండగా... భారత్ తమ తొలి మ్యాచ్‌ను ఆదివారం పాకిస్తాన్‌తో ఆడుతుంది.

విండీస్, జింబాబ్వే టెస్టు 'డ్రా'

బులవాయో: వెస్టిండీస్, జింబాబ్వే మధ్య జరిగిన తొలి టెస్టు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. మ్యాచ్ చివరిరోజు వెస్టిండీస్ నిర్దేశించిన 272 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 54 ఓవర్లలో 6 వికెట్లకు 134 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 21/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ 5 వికెట్లకు 203 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. బ్రాత్‌వైట్ (25; 3 ఫోర్లు), తేజ్‌నారాయణ్ (15) టెస్టు మ్యాచ్‌లో వరుసగా ఐదు రోజులు ఆడిన తొలి ఓపెనింగ్ జోడీగా గుర్తింపు పొందింది.

మయాంక్ అజేయ సెంచరీ: కర్ణాటక 229/5



బెంగళూరు: మయాంక్ అగర్వాల్ (110 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కర్ణాటకను ఆదుకున్నాడు. సౌరాష్ట్రతో బుధవారం ఇక్కడ మొదలైన రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక తొలిరోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో 5 వికెట్లకు 229 పరుగులు చేసింది. ఒక దశలో 112 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన జట్టును ఓపెనర్ మయాంక్ అజేయ శతకంతో నిలబెట్టాడు. శరత్ (58 బ్యాటింగ్; 4 ఫోర్లు)తో కలిసి మయాంక్ అబేధ్యమైన ఆరో వికెట్‌కు 117 పరుగులు జోడించారు.

భారీ స్కోరు దిశగా బెంగాల్

ఇండోర్‌లో డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మరో సెమీఫైనల్లో బెంగాల్ తొలి రోజు తొలి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో 4 వికెట్లకు 307 పరుగులు చేసింది. అనుస్తుప్ మజుందార్ (120; 13 ఫోర్లు, 1 సిక్స్), సుదీప్ (112; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో కదంతొక్కారు.

తెలంగాణకు మరో స్వర్ణం



లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో బుధవారం తెలంగాణ కుర్రాడు లక్ష్మణ్ జూడోలో (50 కేజీలు) పసిడి పతకం గెలిచాడు. స్విమ్మింగ్‌లో బాలుర 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో సాయి నిహార్ కాంస్యం... బాలికల 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రితి అగర్వాల్ రజతం నెగ్గారు. రోయింగ్‌లో బాలుర క్వాడ్రాపుల్ స్కల్స్ రేసులో తెలంగాణ జట్టుకు కాంస్యం దక్కింది.

సినిమా



● చిరంజీవి

డ్యాన్సింగ్ శంకర్

అదిరిపోయే డ్యాన్స్ మూమెంట్స్ చేస్తున్నారు శంకర్. చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తుండగా, ఆయనకు జోడీగా తమన్నా నటిస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా తాజా షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రత్యేకంగా వేసిన కోల్‌కతా బ్యాక్‌డ్రాప్ సెట్‌లో చిరంజీవి, కీర్తీ సురేష్‌లతో పాటు 200 మంది డ్యాన్సర్లు పాల్గొంటుండగా, ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రాఫర్‌గా చేస్తున్నారు. సత్యానంద్ కథా పర్యవేక్షణ చేస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: డడ్లీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.



'బింబిసార' చిత్రానికి ముందే 'అమిగోస్' కథ విన్నాను. రాజేంద్రగారు స్టోరీ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించడంతో వెంటనే ఓకే చెప్పాను. ఒకే పోలికలతో ఉండే ముగ్గురు వ్యక్తులు ఎలా కలిశారు? వాళ్ల లక్ష్యం ఏంటి? వంటి ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది" అని హీరో కల్యాణ్ రామ్ అన్నారు. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో కల్యాణ్ రామ్, ఆషికా రంగనాథ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'అమిగోస్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ పంచుకున్న విశేషాలు.

రెండు నిమిషాలు మాత్రమే కనబడను!

- కల్యాణ్ రామ్

తారకరత్న ఆరోగ్యం ఎలా ఉందో నేను చెబితే బాగుండదు. వైద్యం అందిస్తున్న ఆస్పత్రి వర్గాలు చెబితేనే బాగుంటుంది.

● 'బింబిసార' హిట్ తర్వాత నేను కథలు ఎంచుకునే విధానంలో ఎలాంటి మార్పు రాలేదు. ముందు ఎలా ఉన్నానో తర్వాత కూడా అలానే ఉన్నాను. ఎందుకంటే 'బింబిసార', 'అమిగోస్', 'డెవిల్' సినిమాల కథలను 2020లోనే ఓకే చేశాను. 'బింబిసార' హిట్ తర్వాత కొత్తగా ఏ కథనీ ఎంచుకోలేదు. అయితే ఆ సినిమా విజయం నా బాధ్యతని పెంచింది. అంతకంటే ఇంకా పెద్ద విజయాన్ని నా నుంచి ఆశిస్తారు. అందుకే మంచి కాన్సెప్ట్, స్టోరీ ఉన్నవి ఒప్పుకోవాలి. లక్కీగా నాకు అన్నీ అలాంటి మంచి కథలు వస్తున్నాయి. ● 'అమిగోస్' చిత్రంలో నేను త్రిపాత్రాభినయం చేశాను. సిద్ధార్థ్ చాలా చురుకుగా ఉంటాడు. మంజునాథ్‌ది చాలా సైలెంట్ అండ్ సాఫ్ట్ క్యారెక్టర్. మైఖేల్ పాత్ర గ్యాంగ్‌స్టర్‌ని పోలిన విలన్‌లా ఉంటుంది. విలన్‌లా నటించడం చాలా కొత్తగా అనిపించింది. ట్రిపుల్ రోల్ చిత్రంలో కనీసం ఇద్దరు కథానాయికలైనా ఉంటారు. కానీ ఇది రెగ్యులర్ సినిమాలకు పూర్తి విభిన్నమైనది కావడంతో ఒక హీరోయిన్ మాత్రమే ఉంటుంది. పైగా ఈ మూవీలో విలన్ ఉండకపోవడం ఓ విశేషం. ● మనిషిని పోలిన మనుషులను 'డాపుల్ గాంగర్' అంటారని రాజేంద్రగారు చెప్పారు. ఈ సినిమాకి 'అమిగోస్' టైటిల్ అనుకున్నప్పుడు అందరికీ అర్థం అవుతుందా? అన్నాను. అమిగో అనే పదం సామాజిక మాధ్యమాల్లో ఈ మధ్య బాగా వాడుతున్నారని చెప్పడంతో ఫిక్స్ చేశాం. సినిమా చూస్తే ఆ టైటిల్ ఎందుకు పెట్టామో అర్థం అవుతుంది. ఈ మధ్య సూపర్ హిట్ అయిన 'కాంతారా' టైటిల్ అర్థం నాకు తెలీదు. దాని గురించి వెతికితే 'వైల్డ్ ఫారెస్ట్' అని అర్థం అయింది. ● కోవిడ్ సమయంలో నన్ను నేను బాగా తెలుసుకున్నాను. నేను చేసిన కొన్ని సినిమాలు పరాజయం కావడానికి కారణం ఏంటి? నేను చేసిన తప్పులు ఏంటి? అని తెలుసుకున్నాను. 'అమిగోస్' సినిమా 2 గంటల 19 నిమిషాలు ఉంటే.. అందులో రెండు గంటల పదిహేడు నిమిషాలు కల్యాణ్ రామ్‌నే చూస్తారు.. సినిమాలో జస్ట్ రెండు నిమిషాలు మాత్రమే కనబడను. ఆ పాత్రకి అంత ప్రాధాన్యం ఉంటుంది. ● ప్రస్తుతం నేను నటిస్తున్న 'డెవిల్' మూవీ చిత్రీకరణ మే నెలలో పూర్తవుతుంది. 'బింబిసార 2' షూటింగ్‌ని ఈ ఏడాది ఆఖరులో ప్రారంభిస్తాం.

ఉలవచారు బిర్యానీ చాలా ఇష్టం

- శివ రాజ్‌కుమార్


"ముప్పైఏళ్లుగా తెలుగువారితో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక్కడి ఉలవచారు బిర్యానీ అంటే చాలా ఇష్టం. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ గార్లు, ఎన్టీఆర్, రామ్‌చరణ్.. ఇలా అందరూ నాకు మంచి స్నేహితులు.. చాలా మోటివేట్ చేస్తారు" అని కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ అన్నారు. ఎ. హర్ష దర్శకత్వంలో శివ రాజ్‌కుమార్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'శివ'. శివ రాజ్‌కుమార్ భార్య గీత నిర్మించిన ఈ చిత్రం కన్నడలో గత డిసెంబరు 23న రిలీజైంది. ఈ చిత్రాన్ని 'శివ వేద' పేరుతో వీఆర్ కృష్ణ మండపాటి నేడు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శివ రాజ్‌కుమార్ చెప్పిన విశేషాలు.

● రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో నేను నటించిన 'కిల్లింగ్ వీరప్పన్' (2016) చిత్రం తెలుగులో విడుదలైంది. ఆ సినిమాని ఇక్కడి ప్రేక్షకులు బాగా ఆదరించడం హ్యాపీగా అనిపించింది. ఇప్పుడు 'శివ వేద' చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తుండటం వెరీ హ్యాపీ. ● 'వేద' కన్నడలో విడుదలై 50 రోజులు కావస్తున్నా ఇప్పటికీ మంచి ఆదరణ వస్తోంది. 'శివ వేద'లో వినోదం, భావోద్వేగాలతో పాటు చక్కని సందేశం ఉంది. కుటుంబంలో సమస్య వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలి? అనేది ఈ చిత్రంలో ఉంటుంది. 'వేద' అనేది క్యారెక్టర్ పేరు. లవ్, లైఫ్, హ్యాపీనెస్, ట్రస్ట్.. ఇవన్నీ వేద లైఫ్‌లో ఉంటాయి. ● 'శివ వేద'ని కన్నడ, తెలుగులో ఒకే రోజు రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ, పబ్లిసిటీకి సమయం లేకపోవడంతో ఇక్కడ విడుదల చేయలేదు. కన్నడ, తమిళ్‌లో రిలీజ్ చేయగా మంచి హిట్టయ్యింది. తమిళంలోనూ బాగా ఆదరిస్తున్నారు. హర్షకి నాపై ఉన్న నమ్మకం వల్లే మా కాంబినేషన్‌లో ఎక్కువ సినిమాలు చేశాం. ● తెలుగు, కన్నడ ఇండస్ట్రీలు ప్రస్తుతం మంచి పొజిషన్‌లో ఉన్నాయి. పాన్ ఇండియా స్టార్ అంటే అన్ని భాషల్లో మాట్లాడగలగాలి. నేను కన్నడ, తమిళ్, హిందీ, తెలుగు మాట్లాడగలను. ఇండస్ట్రీలో ఎప్పుడూ ఒకరే ఉండలేరు.. ఒకరి తర్వాత ఒకరు వస్తుంటారు కాబట్టి కొత్తవారిని ప్రోత్సహించాలి. ● భక్తి నేపథ్యంలో ఓ మూవీ చేయాలని ఉంది. పునీత్ రాజ్‌కుమార్ బయోపిక్ తీసే ఆలోచన లేదు. ప్రస్తుతం రజనీ సార్‌తో 'జైలర్', ధనుష్‌తో 'కెప్టెన్ మిల్లర్' మూవీ చేస్తున్నాను. తెలుగులో రెండు, మూడు ప్రాజెక్ట్స్ విన్నాను.



ఇప్పుడు ఇండియన్ సినిమా అంటున్నారు

- ధనుష్



● సంయుక్త, ధనుష్, వెంకీ, నాగవంశీ

"ఒకప్పుడు తెలుగు సినిమా, తమిళ సినిమా, కన్నడ సినిమా, హిందీ సినిమా.. అనేవాళ్లు. ఇప్పుడు ఇండియన్ సినిమా అనడం సంతోషించదగ్గ విషయం" అని హీరో ధనుష్ అన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్'(తెలుగు), 'వాత్తి' (తమిళం). శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. ధనుష్ మాట్లాడుతూ– ''సార్' నా మొదటి తెలుగు సినిమా.. ఇంత మంచి సినిమా ఇచ్చినందుకు వెంకీ అట్లూరిగారికి థ్యాంక్స్. అలాగే నిర్మాతలు చినబాబు, నాగవంశీగార్లకు, డైరెక్టర్ త్రివిక్రమ్‌గారికి కృతజ్ఞతలు'' అన్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ– ''లాక్‌డౌన్ సమయంలో ఈ కథని వంశీగారికి వినిపించగా ఆయనకు నచ్చింది. ధనుష్‌గారు ఈ మూవీ చేసినా చేయకపోయినా ఆయనకు కథ చెప్పానన్న సంతృప్తి చాలనుకున్నాను. కానీ, ఆయన కథ వినగానే చేస్తాననడంతో ఆనందంతో మాటలు రాలేదు'' అన్నారు.

సబ్జెక్ట్‌ని నమ్మి తీశారు

- అలీ



● విశ్వ, అలీ, హ్రితికా

విశ్వ కార్తికేయ, హ్రితికా శ్రీనివాస్ జంటగా చలపతి పువ్వల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అల్లంత దూరాన'. కోమలి సమర్పణలో తెలుగు, తమిళ భాషల్లో ఎన్. చంద్రమోహనరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు అతిథిగా హాజరైన నటుడు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ ట్రైలర్‌ను విడుదల చేసి, మాట్లాడుతూ– ''సబ్జెక్ట్‌ను నమ్ముకుని, నిర్మాత చంద్ర మోహన్ రెడ్డి మొదలుకుని సినిమా పట్ల ఎంతో ప్రేమ ఉన్న ప్రేమికులు చేసిన సినిమా ఇది'' అన్నారు. ''ప్రేక్షకుల మనసులకు హత్తుకునేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు దర్శక-నిర్మాతలు.

బ్రదర్ ఆఫ్ యమ



● శంకర్ రావు, రమేష్, ప్రదీప్

జై రమేష్, శ్రీదేవి, రుక్మిణి, భానుచందర్, కోటా శంకర్ రావు, సెల్వరాజ్, సుమన్ శెట్టి, శాంతకుమార్ ప్రధాన పాత్రల్లో ప్రదీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ ధర్మ' (బ్రదర్ ఆఫ్ యమ). రమేష్ ఆర్.కె. నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని నిర్మాత, ఫిలించాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి విడుదల చేసి, మాట్లాడుతూ– ''చిన్న నిర్మాతల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకొని చిన్న సినిమాల రిలీజ్ కమిటీని ఏర్పాటు చేశాం. అయితే ఈ కమిటీ కార్యక్రమాలు సజావుగా జరగడం లేదు.. ఈ విషయంపై త్వరలో చర్చిస్తాం'' అన్నారు. ''పోలీస్ స్టోరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు రమేష్ ఆర్.కె.

క్రైమ్ థ్రిల్లర్

నిహాల్, అర్జున్, సంధ్య, ఐశ్వర్య హీరో హీరోయిన్లుగా సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'సంధిగ్దం'. పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో తీర్ధ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అతిథిగా విచ్చేసిన బీజేపీ నేత పద్మ వీరపనేని తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టగా, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, సాయి వెంకట్ స్క్రిప్ట్‌ను దర్శకునికి అందించారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా మా చిత్రం రూపొందుతోంది'' అన్నారు పార్థసారధి కొమ్మోజు.

మూడు తరాల కథ



● గణేష్, సృష్టి

ఈవీ గణేష్‌బాబు నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన తమిళ చిత్రం 'కట్టిల్'. సృష్టి డాంగే, కనిక, మీరా హీరోయిన్లు. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడిన ఈ చిత్రం తెలుగులో 'పందిరి మంచం'గా రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని 'కోవెలలో..' పాటను దర్శకుడు మోహన్‌రాజా రిలీజ్ చేశారు. శ్రీకాంత్ దేవా స్వరపరచిన ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యం అందించగా సిద్ శ్రీరాం పాడారు. ''తరతరాలుగా ఒకే ఇంట్లో ఉన్న పందిరిమంచం కథే ఈ చిత్రం. ఒక వంశంలోని మూడు తరాల గురించి ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అనగనగా కథలా...



● ఉపేంద్ర, శుభ

కంచర్ల ఉపేంద్ర, శుభ శ్రీ, నేహాదేశ్ పాండే హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రానికి 'అనగనగా కథలా..' టైటిల్‌ను ఖరారు చేశారు. ఎస్వీ పసలపూడి దర్శకత్వంలో కంచర్ల అచ్యుత్ రావు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ''మంచి కథాంశంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ సినిమా అందరికీ పేరు తెస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు ఎస్వీ పసలపూడి. కుమార్, లైన్ ప్రొడ్యూసర్: కొల్లా వెంకట్రావు.

సాక్షి
గురువారం
9-2-2023

బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
378	150
60,664	17,872

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,935	▲ 178
డోజోన్స్	33,972	▲ 185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,885	▲ 20
డాక్స్	15,412	▲ 91
షాంఘై	3,232	▼ 16
నికాయ్	27,402	▼ 79

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	57,538	▲ 173
బంగారం (22 క్యారెట్)	57,308	▲ 173
వెండి (కిలో)	67,516	▲ 382

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.66	84.34
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.42	90.89
€	యూరో	ఒకటి	97.51	102.31
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	50.00	76.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.18	59.99
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.06	64.61
SAR	సౌదీ రియాల్	ఇరవై	21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	ఇరవై	21.56	23.36
¥	చైనా యువాన్	ఇరవై	11.04	13.11

బిజినెస్ రీల్

రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఫోన్లు



హైదరాబాద్: దక్షిణ కొరియా శాంసంగ్ ఇటీవల మార్కెట్‌లోకి విడుదల చేసిన గెలాక్సీ ఎస్23 ఫోన్లు రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో లభిస్తాయని కంపెనీ వెల్లడించింది. ''శాంసంగ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నందుకు సంతోషిస్తున్నాము. ఈ ఒప్పందం ద్వారా కస్టమర్లకు గెలాక్సీ ఎస్23 సిరీస్ వంటి అత్యాధునిక సాంకేతికత అందించడం గర్వంగా ఉంది'' అని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బ్రియాన్ బడే అన్నారు. గెలాక్సీ ఎస్23 కొనుగోలుపై గెలాక్సీ వాచ్4 బ్లూటూత్‌ను రూ.2,999 పొందవచ్చు. గెలాక్సీ ఎస్23 అల్ట్రా కొనుగోలుపై గెలాక్సీ వాచ్4 క్లాసిక్ ఎల్‌టీఈ–గెలాక్సీ బడ్స్‌ను రూ.4999కే లభిస్తుంది.

ఫీనిక్స్ గ్రూప్‌తో టీసీఎస్ భారీ డీల్


ముంబై: దేశీ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ తాజాగా బ్రిటన్‌కు చెందిన ఫీనిక్స్ గ్రూప్‌నకు వ్యాపార డిజిటలీకరణ సర్వీసులు అందించనుంది. ఇందులో భాగంగా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ 600 మిలియన్ పౌండ్లు (సుమారు రూ. 5,986 కోట్లు). ఆర్థిక సర్వీసుల సంస్థ ఫీనిక్స్ గ్రూప్‌తో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది కొనసాగింపని టీసీఎస్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-2-2023	
విశాఖ	460–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	415–00
రిటైల్ ధర (డజను)	66.00
8-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00
రిటైల్ ధర	4.85

వడ్డింపే.. కానీ భారం స్వల్పం!

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా సమావేశం అంచనాలకు అనుగుణంగా రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు) ఈ సారి పావుశాతమే పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ఈ మేరకు బ్యాంకుల గృహ, వాహన, కార్పొరేట్ రుణ రేట్లు పెరగనున్నాయి. గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో జరిగిన మూడు రోజుల సమావేశ కీలక నిర్ణయాలు బుధవారం వెలువడ్డాయి. ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గవర్నర్ ఈ విషయాలు వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) లోక్‌సభలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల ఒకటవ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ తర్వాత జరిగిన మొదటి పాలసీ సమీక్ష ఇది.



ఈసారి రెపో రేటు పెంపు 0.25 శాతమే
- 6.5 శాతానికి కీలక రేటు
- గృహ, వాహన, కార్పొరేట్ రుణాలు ఆమేరకు 'ప్రియం'
- ద్రవ్యోల్బణం పెరిగితే రేటు పెంపు తప్పదని సంకేతాలు
- 2022–23 ద్రవ్యోల్బణం సగటు 6.5%
- 2023–24లో 5.3% అంచనా

ఆర్థిక వృద్ధి 7%

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనా 7 శాతంకాగా, 2023–24లో ఇది 6.4 శాతానికి తగ్గుతుంది. అయితే, ఎకానమీ పటిష్టంగా ఉంది. భారీ రబీ విస్తీర్ణం, రుణ విస్తరణ, 2023–24 బడ్జెట్‌లో మూలధన కేటాయింపుల పెంపు వంటి అంశాలు వృద్ధికి మద్దతు నిస్తాయి.
– శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

వరుసగా ఆరవసారి...

ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. వరుసగా ఆరవసారి పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగినట్లయ్యింది. తాజా సమీక్షలో ఆరుగురు ఎంపీసీ సభ్యుల్లో నలుగురు రేటు పెంపునకు ఓటువేయగా, మిగిలిన ఇద్దరు... కఠిన ద్రవ్య విధానం ఉపసంహరణను కోరారు. ద్రవ్యోల్బణం కట్టడిలోకి రావడం దీనికి కారణంగా చూపారు.

క్యూఆర్ కోడ్.. కాయిన్ వెండింగ్ మెషీన్

విధాన నిర్ణయాల ప్రకారం.. నాణేల పంపిణీని పెంచేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత కాయిన్ వెండింగ్ మెషీన్ (క్యూసీవీఎం) కోసం పైలెట్ ప్రాజెక్ట్ 12 నగరాల్లో ప్రారంభించడం జరుగుతుంది. రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, మార్కెట్ ప్లేస్‌లలో ఈ ప్రాజెక్ట్ అమలవుతుంది. దీనివల్ల నకిలీ నోట్ల బెడదా తగ్గుతుంది.

ద్రవ్యోల్బణం దిగివస్తుంది...



అక్టోబర్ వరకూ గడచిన 10 నెలల్లో రెపో రేటు నిర్ణయానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ఆరు శాతంపైబడి కొనసాగిన సంగతి గమనార్హం. నవంబర్, డిసెంబర్‌లలో ఇది 6 శాతం దిగువకు చేరింది. ఇది తాజా పాలసీ సమీక్షలో రేటు పెంపు స్పీడ్ తగ్గడానికి కారణమైంది. అయితే ద్రవ్యోల్బణం పెరిగితే రేటు పెంపు అవకాశాలకు తలుపులు తెరిచే ఉంటాయని గవర్నర్ తన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటున 6.5 శాతంగా ఉండే రిటైల్ ద్రవ్యోల్బణం, వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5.3 శాతానికి దిగివస్తుందని సమావేశం అంచనా వేసింది. భౌగోళిక ఉద్రిక్తతలు, కమోడిటీ ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం అవుట్‌లుక్ అస్పష్టంగా ఉందనీ గవర్నర్ పేర్కొన్నారు.

అదానీ గ్రూప్ ప్రభావం వ్యవస్థపై ఉండదు



అదానీ గ్రూప్‌నకు దేశీయ బ్యాంకుల రుణ పరిమాణం 'భారీ ప్రాధాన్యత కలిగినది కాదు''అని ఆర్‌బీఐ పేర్కొంది. ఇలాంటి ఏకైక ఘటన వ్యవస్థపై ఎంతమాత్రం పడబోదని డిప్యూటీ గవర్నర్ ఎంకే జైన్ పేర్కొన్నారు. ఒకే ఒక్క సంఘటన వ్యవస్థను బలహీనపరిచే స్థితిలో భారత్ లేదన్నారు. ''బ్యాంకులు ఆస్తులు తనఖాగా ఉంచుకునే రుణాలు ఇస్తాయి. లిక్విడిటీ, ప్రాజెక్టుల అమలు, వంటి అంశాలను రుణాలకు ప్రాతిపదికగా తీసుకుంటాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ రుణాలకు ప్రాతిపదిక కాదు'' అని అన్నారు.

ఈ-రూపీ ప్రాజెక్ట్ విస్తరణ



రిటైల్ కస్టమర్ల కోసం సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లేదా ఈ–రూపాయికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్టులో మరో ఐదు బ్యాంకులు చేరతాయి. అలాగే ప్రాజెక్ట్‌ను మరో తొమ్మిది నగరాలకు విస్తరించడం జరుగుతుంది. డిసెంబర్‌లో ఐదు నగరాల్లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో 8 బ్యాంకులు పాల్గొంటున్నాయి. రిటైల్ సీబీడీసీ ఇప్పుడు 50,000 మంది వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది.

ముఖ్యాంశాలు...

- దేశంలోకి వచ్చీ–పోయే మొత్తం విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాస గణాంకాలకు సంబంధించిన కరెంట్ అకౌంట్ లోటు 2022–23 ఏప్రిల్–సెప్టెంబర్‌లో 3.3 శాతంగా ఉంటే, అక్టోబర్– మార్చి మధ్య తగ్గే వీలుంది.
- 2023 జనవరి 27 నాటికి భారత విదేశీ మారకద్రవ్య నిల్వలు 576.8 బిలియన్ డాలర్లు. దాదాపు 9.4 నెలల దిగుమతులకు ఇవి సరిపోతాయి.
- ఆసియా సహదేశాలతో పోల్చితే భారత్ రూపాయి విలువ 2022లో తక్కువ ఒడిదుడుకులనే చూసింది.
- జీ20 దేశాల నుండి దేశంలోని ఎంపిక చేసిన విమానాశ్రయాలకు వచ్చే ప్రయాణికులు దేశంలో చెల్లింపులు చేయడానికి యూపీఐని వినియోగించడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. తరువాత ఈ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సదుపాయాన్ని అన్ని దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విస్తరించాలని కూడా ప్రతిపాదించడం జరిగింది.
- దేశీయ మ్యూచువల్ ఫండ్స్‌లో విదేశీ పెట్టుబడుల పరిమితిని ప్రస్తుత 7 బిలియన్ డాలర్ల నుంచి పెంచే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదు.
- తదుపరి పాలసీ సమీక్ష ఏప్రిల్ 3 నుంచి 6వ తేదీ మధ్య జరుగుతుంది.


గృహ కొనుగోళ్లకు ప్రతికూలమే..!



రేటు పెంపు గృహ రుణాలపై వడ్డీ రేట్లు పెరగడానికి దారి తీస్తుంది. దిగువ– మధ్య స్థాయి ఆదాయ వర్గాల నుంచి గృహ వినియోగ డిమాండ్ తగ్గవచ్చు. అయితే ఇది చివరి దఫా రెపో రేటు పెంపు అని భావిస్తున్నాం.
– ప్రాపర్టీ దేవలపర్లు, కన్సల్టెంట్లు

సూచీలకు పాలసీ లాభాలు

- మార్కెట్‌ను మెప్పించిన ఆర్‌బీఐ
- సెన్సెక్స్ 378 పాయింట్లు అప్
- 17,850 స్థాయిపైకి నిఫ్టీ
- రెండురోజుల నష్టాలకు చెక్



ముంబై: ఆర్‌బీఐ రేట్ల పెంపులో దూకుడు తగ్గించడంతో స్టాక్ మార్కెట్ బుధవారం రెండు రోజుల నష్టానికి ముగింపు పలికింది. అదానీ గ్రూప్ షేర్లలో రెండోరోజూ రికవరీ, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. రిలయన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ఒకశాతం బలపడి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. సెన్సెక్స్ 47 పాయింట్లు లాభంతో 60,333 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 60,324 కనిష్టాన్ని, 60,792 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 378 పాయింట్లు పెరిగి 60,664 వద్ద స్థిరపడింది. సూచీలో మొత్తం 30షేర్లకుగానూ ఐదు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 28 పాయింట్లు పెరిగి 17,750 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 17,744 – 17,899 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 150 పాయింట్లు బలపడి 17,872 వద్ద నిలిచింది. బీఎస్ఈలో రూ.2.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.268.60 లక్షల కోట్లకు చేరింది. కాగా, రూపాయి విలువ 21 పైసలు బలపడి 82.50 స్థాయి వద్ద స్థిరపడింది.

రెండింతలైన పెన్నార్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ కంపెనీ పెన్నార్ ఇండస్ట్రీస్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రెండింతలై రూ.21.12 కోట్లు సాధించింది. ఎబిటా 40.61 శాతం దూసుకెళ్లి రూ.66 కోట్లుగా ఉందని పెన్నార్ కార్పొరేట్ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ కె.ఎం.సునీల్ తెలిపారు. టర్నోవర్ 29.88 శాతం అధికమై రూ.692.22 కోట్లను తాకిందన్నారు. ఏప్రిల్–డిసెంబర్‌లో నికరలాభం రెండింతలకుపైగా పెరిగి రూ.51.58 కోట్లు, ఎబిటా 41% అధికమై రూ.183.87 కోట్లుగా ఉంది. టర్నోవర్ 41.53 శాతం ఎగసి రూ.2,226 కోట్లకు పెరిగింది.

బీఎస్ఈలో షేరు ధర బుధవారం 4.53% అధికమై రూ.57.70 వద్ద స్థిరపడింది.

భవిత

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేవీలో.. విద్య + ఉద్యోగం

10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు ప్రకటన

ఇంటర్మీడియట్ పూర్తిచేసి రక్షణ రంగంలో కొలువు కోరుకునే వారి కోసం ఇండియన్ నేవీ.. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్‌కు ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా నేవీలో ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ బ్రాంచ్, ఎడ్యుకేషన్ బ్రాంచ్ పోస్టులను భర్తీ చేయనుంది. జేఈఈ మెయిన్స్‌లో సాధించిన ర్యాంక్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడతారు. ఇందులో ఎంపికైన వారికి ఉచిత ఇంజనీరింగ్ విద్యను అందించి ఉద్యోగంలోకి తీసుకుంటారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారు సబ్ లెఫ్టినెంట్ హోదాతోపాటు ఆకర్షణీయ వేతనాలు అందుకుంటారు.

నేవీ జాబ్స్

- మొత్తం ఖాళీలు: 35
- ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ బ్రాంచ్–30, ఎడ్యుకేషన్ బ్రాంచ్–05.

అర్హతలు

- అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే నేవీ 10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వీరు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌ల్లో 70శాతం మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి. అలాగే పదోతరగతి లేదా ఇంటర్‌లో ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీటితోపాటు జేఈఈ మెయిన్ -2022లో అర్హత సాధించడం తప్పనిసరి.
- **వయసు:** జనవరి 02, 2004 నుంచి జులై 01, 2006 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక ఇలా

జేఈఈ మెయిన్ 2022లో సాధించిన ర్యాంకుతో మెరిట్ ప్రకారం-వచ్చిన దరఖాస్తులను మదింపు చేస్తారు. ఖాళీలకు అనుగుణంగా కొంతమందిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. వీరికి సర్వీసెస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ).. ఐదురోజుల పాటు రెండు దశల్లో బెంగళూరు, భోపాల్, కోల్‌కతా, విశాఖపట్నంలో.. మార్చి నుంచి ఏప్రిల్‌లోపు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

రెండు దశలు

స్టేజ్–1 పరీక్షలో భాగంగా ఇంటెలిజెన్స్ టెస్టు, పిక్చర్ పెర్సెప్షన్ టెస్టు, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన వారికే మిగిలిన 4 రోజులపాటు స్టేజ్–2 ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, మౌఖిక పరీక్ష జరుపుతారు. వీటిలో విజయం సాధించిన వారికి మెడికల్ టెస్టులు ఉంటాయి. అందులోనూ అర్హత సాధించిన వారిని తుది నియామకానికి పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్ఎస్‌బీలో సాధించిన మెరిట్ ప్రకారం-అర్హులకు అవకాశం ఇస్తారు. ప్రవేశం పొందిన కోర్సును అనుసరించి వీరికి ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ లేదా ఎడ్యుకేషన్ బ్రాంచ్ కేటాయిస్తారు.

వేతనం

ఎంపికైన వారికి లెవల్ పే 10 ప్రకారం-ప్రతి నెల రూ.56,100 మూలవేతనంగా లభిస్తుంది. మిలటరీ సర్వీసెస్ పే కింద రూ.15వేలు చెల్లిస్తారు. అంతేకాకుండా డీఏ, హెచ్ఆర్ఏ సహ ఇతర అలవెన్సులను కూడా అందుకోవచ్చు.

శిక్షణ

అభ్యర్థులు ఇంటర్వ్యూలో సాధించిన మార్కులు, ఖాళీలకు అనుగుణంగా ఇండియన్ నేవల్ అకాడెమీ, ఎజిమళ(కేరళ)లో బీటెక్ అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లేదా మెకానికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సుల్లోకి తీసుకుంటారు. చదువుతోపాటు ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)–న్యూఢిల్లీ.. ఇంజనీరింగ్ డిగ్రీని ప్రధానం చేస్తుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 12, 2023
- వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్, బీబీనగర్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 02
- పోస్టుల వివరాలు: ప్రొఫెసర్–01, అసిస్టెంట్ ప్రొఫెసర్–01. • విభాగం: కార్డియాలజీ.
- అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/ఎండీ/ఎంఎస్/ఎన్‌బీఏహెచ్/డీఎం ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 50 నుంచి 58 ఏళ్లు ఉండాలి.
- వేతనం: నెలకు రూ.1,42,506 నుంచి రూ.2,20,000 చెల్లిస్తారు.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా. • ఇంటర్వ్యూ తేది: 20.02.2023.
- ఇంటర్వ్యూ సమయం: ఉదయం 8.30 నుంచి.
- వెబ్‌సైట్: www.aiimsbibinagar.edu.in

అవుతారా.. ఆర్మీ ఆఫీసర్!

ఇండియన్ ఆర్మీ.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్-54వ కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఎంపికైతే.. షార్ట్ సర్వీస్ కమిషన్(నాన్-టెక్నికల్) పద్ధతిలో కొలువు సొంతం చేసుకోవచ్చు. అంతేకాకుండా లెఫ్టినెంట్ హోదాతో కెరీర్ ప్రారంభించి.. ఆర్మీలో విధులు నిర్వర్తించే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్-54వ కోర్సుకు ఎంపిక ప్రక్రియ, అర్హతలు, శిక్షణ, ఆర్మీలో కెరీర్ తదితర అంశాలపై విశ్లేషణ..

» 55 ఖాళీలతో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ నోటిఫికేషన్
» ఎన్‌సీసీ-సీ, డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే లెఫ్టినెంట్ హోదాతో కెరీర్
» శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్

ఇండియన్ ఆర్మీ.. త్రివిధ దళాలు అనగానే గుర్తొచ్చే పేరు. ఆర్మీ ఉద్యోగాల కోసం ఏటా లక్షల మంది సన్నద్ధమవుతున్న సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగానే ఇండియన్ ఆర్మీ ఎన్‌డీఏ, సీడీఎస్‌లే కాకుండా..తన సొంత ఎంపిక విధానం ద్వారా పలు నియామకాలు చేపడుతోంది. తాజాగా.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్–54వ కోర్సు ద్వారా ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో అర్హులను ఎంపిక చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

55 మందికి అవకాశం

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్–54వ కోర్సు ద్వారా.. షార్ట్ సర్వీస్ కమిషన్ అధికారులుగా 55 మందికి అవకాశం కల్పిస్తారు. ఎన్‌సీసీ–పురుష అభ్యర్థులకు 50, ఎన్‌సీసీ–మహిళా అభ్యర్థులకు 5 పోస్టులను కేటాయించారు. ఈ కోర్సు అక్టోబర్‌లో ప్రారంభం కానుంది.

అర్హతలు

ఎన్‌సీసీ–సి సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో బి గ్రేడ్‌తో పాటు 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అక్టోబర్ 1 నాటికి సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది. వయసు: 19–25 ఏళ్లు ఉండాలి.

ఎస్ఎస్‌బీ ఎంపిక

ముందుగా అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి..అంతర్గత నిబంధనలు, కటాఫ్ మార్కులు, రిజర్వేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని.. ఎస్ఎస్‌బీ(సర్వీస్ సెలక్షన్ బోర్డ్) ఎంపిక ప్రక్రియకు జాబితా సిద్ధం చేస్తారు. ఆ తర్వాత అలహాబాద్, భోపాల్, బెంగళూరు, కపుర్తలలోని ఎస్ఎస్‌బీ సెలక్షన్ సెంటర్లలో ఏదో ఒక కేంద్రంలో ఎంపిక ప్రక్రియకు హాజరవ్వాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే ఎస్ఎస్‌బీ సెలక్షన్ సెంటర్ ప్రాధమ్యాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

రెండు దశల్లో ఎస్ఎస్‌బీ

అర్హులైన అభ్యర్థులకు నిర్వహించే ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ.. రెండు దశల్లో(స్టేజ్–1, స్టేజ్–2) ఉంటుంది. స్టేజ్–1ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారిని స్టేజ్–2కు ఎంపిక చేస్తారు. స్టేజ్–2 లోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

అయిదు రోజులు

- ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌లో కీలకంగా నిలిచే ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ మొత్తం అయిదు రోజులపాటు రెండు దశల్లో(స్టేజ్–1, స్టేజ్–2) జరుగుతుంది.
- స్టేజ్–1నే స్క్రీనింగ్ టెస్ట్‌గానూ పిలుస్తారు. ఈ దశలో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ (ఓఐఆర్) టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్, డిస్కషన్ టెస్ట్‌లు ఉంటాయి.
- ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్‌ను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అయిదు రకాలుగా(ఔట్ స్టాండింగ్, ఎక్సలెంట్, ఎబోవ్ యావరేజ్, యావరేజ్, బిలో యావరేజ్) రేటింగ్స్ ఇస్తారు. తర్వాత దశలో నిర్వహించే పిక్చర్ పర్సెప్షన్, డిస్కషన్ టెస్ట్‌లలో పొందిన మార్కులకు ఈ రేటింగ్స్‌ను కూడా కలుపుతారు.
- ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్ తర్వాత నిర్వహించే పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్‌లో ఒక సందర్భం లేదా సన్నివేశానికి సంబంధించిన చిత్రాన్ని 30 సెకన్లపాటు ప్రదర్శించి.. ఆ చిత్రంలోని అంశాల ఆధారంగా అభ్యర్థులు నాలుగు నిమిషాల వ్యవధిలో ఒక చిన్న స్టోరీ రాయాలని పేర్కొంటారు. ఆ చిత్రం ప్రాధాన్యత, అందులో కనిపించిన సన్నివేశం, సందర్భం, ఆ చిత్రం సారాంశం గురించి వివరించాల్సి ఉంటుంది.
- పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్‌లో.. ప్రతిభ ఆధారంగా విభజించిన బృందాలకు గ్రూప్ డిస్కషన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులు తాము రాసిన స్టోరీ(వివరణ) గురించి మౌఖికంగా చర్చించాల్సి ఉంటుంది. ప్రతి బృందంలోని అభ్యర్థులందరూ ఆ చిత్రానికి సంబంధించి ఉమ్మడి అభిప్రాయానికి వచ్చే విధంగా ఉండాలి.
- ఈ మూడు టెస్ట్‌లలో అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ రూపొందించి స్టేజ్–2కు ఎంపిక చేస్తారు.



జాబ్స్ ఇన్ఫో

స్టేజ్–2 నాలుగు రోజులు

ఎస్ఎస్‌బీ స్టేజ్–2 ఎంపిక ప్రక్రియ మొత్తం నాలుగు రోజుల పాటు సాగుతుంది. ఈ నాలుగు రోజుల్లో ప్రతిరోజు పలు పరీక్షలు, ఈవెంట్స్ నిర్వహిస్తారు.

సైకాలజీ టెస్ట్

స్టేజ్–2 మొదటి రోజు సైకలాజికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ముందుగా థీమాటిక్ అప్పెర్సెప్షన్ టెస్ట్, వర్డ్ అసోసియేషన్ టెస్ట్, సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్, సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లు ఉంటాయి. థీమాటిక్ అప్పెర్సెప్షన్ టెస్ట్‌లో అభ్యర్థులు ఏదైనా చిత్రంపై స్టోరీ రాయాల్సి ఉంటుంది. వర్డ్ అసోసియేట్ టెస్ట్‌లో నిర్దేశిత పదాలతో అర్థవంతమైన వాక్యాన్ని రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు నిజ జీవిత సంఘటనలపై అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది.

రెండో రోజు

స్టేజ్–2 రెండో రోజున గ్రూప్ టెస్టింగ్–1 పేరుతో ఔట్ డోర్, ఇన్‌డోర్ టెస్ట్‌లను నిర్వహిస్తారు. గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్ ఎక్సర్‌సైజ్, ప్రోగ్రెసివ్ గ్రూప్ టాస్క్, గ్రూప్ అబ్‌స్టాకిల్ టాస్క్, హాఫ్ గ్రూప్ టాస్క్ వంటి ఇండోర్, ఔట్ డోర్, ఇండివిడ్యువల్, గ్రూప్ యాక్టివిటీస్‌లో సత్తా చూపాల్సి ఉంటుంది.

గ్రూప్ టెస్టింగ్–2

స్టేజ్ 2లో మూడో రోజున..గ్రూప్ టెస్టింగ్–2 పేరుతో లెక్చరెట్, ఇండివిడ్యువల్ అబ్‌స్టాకిల్స్, కమాండ్ టాస్క్, ఫైనల్ గ్రూప్ టాస్క్ వంటివి నిర్వహిస్తారు. వీటన్నింటిలోనూ చూపిన ప్రతిభ ఆధారంగా.. అదేరోజున పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూలో ఎస్ఎస్‌బీలో అప్పటి వరకు జరిగిన ప్రక్రియల్లో అనుభవాలు, అదే విధంగా వ్యక్తిగతంగా అకడమిక్, కుటుంబ నేపథ్యం, అకడమిక్‌గా చూపిన ప్రతిభ, జనరల్ అవేర్‌నెస్ అంశాలపై అభ్యర్థులను ప్రశ్నిస్తారు.

నాలుగో రోజు.. కాన్ఫరెన్స్

స్టేజ్–2లో చివరి రోజున కాన్ఫరెన్స్ పేరిట అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తారు. ఈ ప్రక్రియలో ముందుగా మూల్యాంకన చేసే అధికారి క్లోజింగ్ అడ్రస్(ముగింపు ప్రకటన) చేస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల కాన్ఫరెన్స్ మొదలవుతుంది.

49 వారాల ట్రైనింగ్

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన వారికి.. 49 వారాల పాటు చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రీ-కమిషన్ ట్రైనింగ్ పేరుతో శిక్షణనిస్తారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి మద్రాస్ యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ సర్టిఫికెట్‌ను కూడా అందజేస్తారు. అదే విధంగా శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 చొప్పున స్టయిఫండ్ ఇస్తారు.

లెఫ్టినెంట్ హోదా

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత.. పురుష అభ్యర్థులకు పద్నాలుగేళ్లు, మహిళా అభ్యర్థులకు పదేళ్ల గడువుతో షార్ట్ సర్వీస్ కమిషన్‌ను ఖరారు చేస్తారు. తర్వాత మరో నాలుగేళ్లపాటు పొడిగించే విధానాన్ని కూడా ఇండియన్ ఆర్మీ అనుసరిస్తోంది. అంటే.. పురుష అభ్యర్థులు గరిష్టంగా 18ఏళ్లు, మహిళా అభ్యర్థులు గరిష్టంగా 14 ఏళ్లు ఆర్మీలో విధులు నిర్వర్తించొచ్చు. షార్ట్ సర్వీస్ కమిషన్ ఖరారు చేసుకున్న వారికి లెఫ్టినెంట్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం జాయిన్ ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లోని 'ఆఫీసర్ ఎంట్రీ అప్లికేషన్/లాగిన్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 17 – ఫిబ్రవరి 15, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.



1st in segment



6 ఎయిర్‌బ్యాగ్స్
4 ఎయిర్‌బ్యాగ్స్ స్టాండర్డ్
(డ్రైవర్, ప్యాసింజర్ మరియు సైడ్)

New



NIOS బ్రాండింగ్‌తో ఫ్యాబ్రిక్
సీట్ అప్‌హోల్‌స్టరీ

1st in segment



టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్
(TPMS)- హైలైన్

New



LED టెయిల్ ల్యాంప్స్

Best in segment



స్మార్ట్‌ఫోన్ నేవిగేషన్‌తో 20.25 cm (8")
టచ్‌స్క్రీన్ ఆడియో*

New



ESC, VSM & HAC

1st in segment



వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్

RDE యొక్క కాంప్లియెంట్ మరియు E20 ఫ్యూయల్ కోసం సిద్ధం.

HYUNDAI

To know more, WhatsApp us on 8447228019 | my Hyundai app | Hyundai Cl!ck to Buy | 3 YEAR 1 00 000km Warranty Coverage** | 3 YEAR Road Side Assistance (RSA)* | UPTO 7 YEARS Extended Warranty^ | UPTO 5 YEARS Shield of Trust Running Repair Package* | UPTO 5 YEARS Shield of Trust Super Maintenance Package* | Lowest cost of maintenance#

For Information Contact: Toll Free:1800114645 **Telangana:** **Karim Nagar:** Sasya Hyundai, Ph: 9550077566 **Hyderabad/Secunderabad:** Lakshmi Hyundai, Himayath Nagar Ph: 8096666332, Madinaguda Ph: 8096666325, Malakpet, Ph: 7331119964 LB Nagar, Ph: 8096666428 KPHB-manjeera Trinity Ph: 7997017772, Erragadda PH: 8096666104, Attapur, Ph: 8096666332 Fusion Hyundai, Bowenpally Ph: 7330772222, Tirumalghery Ph: 9154953048 Kun United Hyundai, Lakadikapul Ph: 9885010011 ECIL X Roads, Ph: 9885753111 Hitech City, Ph: 9885710028 Shaikpet, Ph: 9885906987 Gachibowli, Ph: 9885077677 Bharat Hyundai, Financial District Gachibowli, Ph: 7733888999 Neon Hyundai, SP Road Ph: 8008004996, Dwaraka Hyundai, Boduppal Ph: 7337331720 JSP Hyundai, Jubilee Hills Ph: 8882101010, JSP Hyundai, Banjara Hills Ph: 8882101010, Geetha Hyundai, Mettuguda, Ph: 8099678678 **Khammam:** Bharat Hyundai, Ph: 7733888999, Kothagudem Ph: 7032153153 **Mahabubnagar:** Trend Hyundai, Ph: 7660022382, **Nalgonda:** Sansai Hyundai, Ph: 9160079966 **Nirmal:** Prakash Hyundai, Ph: 9052110404 **Nizamabad:** Prakash Hyundai, Ph: 9052116511 **Warangal:** Hema Hyundai, Ph: 8008204442 **AP:** **Anantapur:** Kun United Hyundai, Ph: 9885289069 **Bhimavaram:** Kusalava Hyundai, Ph: 9866175390 **Chittoor:** RK Hyundai, Ph: 9533873666 **Guntur:** Kusalava Hyundai, Ph: 9866672302 **Kadapa:** MDH Hyundai, Ph: 8886112111 **Kurnool:** Kun United Hyundai, Ph: 9160114474 **Nellore:** Kun Hyundai, Ph: 9849549222 **Ongole:** Sri Chakra Hyundai, Ph: 9949096708 **Rajahmundry:** Lakshmi Hyundai, Ph: 8096666410 **Tirupati:** RK Hyundai, Ph: 9885234307 **Vijayawada:** Kusalava Hyundai, Labbipet, Ph: 9985374311, Autonagar, Ph: 7997966434 Sai Swarna Hyundai, Ramavarappadu Ring Road, Ph: 9581251234 Lucky Hyundai, Enikepadu Ph: 7799911789 **Vishakapatnam:** Lakshmi Hyundai, CBM Compound, Ph: 8096666558 Mango Hyundai, PM Pallem, Opp Dr. YSR Stadium, Ph: 8099000666 **Srikakulam:** Mango Hyundai, Pedapadu Road, Ph: 8099000666 **Gajuwaka:** Lakshmi Hyundai, 8096666518 **Vizianagaram:** Lakshmi Hyundai, Ph: 8096666550

*Terms & Conditions apply. Features & specifications shown may not be part of standard fitment & are subject to change without prior notice. Segment is defined by comparable high compact segment hatchbacks whose length lies between 3 700-3 845 mm, width between 1 680-1 735 mm & petrol engine capacity 1 197 cc. **Warranty upto 3 Years or 1 00 000 km whichever occurs earlier. ^Upto 7 years extended warranty is applicable only for petrol variants. #The new Grand i10 NIOS (Petrol) has lowest average yearly periodic maintenance service cost in its segment of ₹2 754 for 5 years in Delhi, Source: Cardekho.com. Hyundai Motor India reserves the right to change specifications, colour, equipment and schemes at any time without prior notice. Technical specifications have been rounded-off to the nearest value. Deployment of Airbags depends upon number of factors explained in detail in Owners Manual, available on Hyundai website. Visit your nearest Hyundai dealership for more details. Hyundai urges you to follow traffic rules – these are meant to keep you safe on roads.

INNOCEAN-010/23 TEL